# THE BOOK WAS DRENCHED

UNIVERSAL
LIBRARY
OU_206171
UNIVERSAL
LIBRARY

నారసింహసంస్కృతకళాశాలాగ్రంథమాల. నెం. 6.

ఆంధ్రీకృత

# న్యాయదర్శనము

## ప్రథమభాగము

గ్రంథకర్తలు:

**కొల్లూరు సోమశేఖరశాస్త్రి,**

**విద్వాన్ దువ్వూరి వేంకటరమణశాస్త్రి,**

నారసింహసంస్కృతకళాశాలాపండితులు, చిట్టిగూడూరు.

చెన్నపురి:

వావిళ్ల రామస్వామిశాస్త్రులుఅండ్‌సన్స్ వారిచే

ప్రకటితము.

1933

*All Rights Reserved.*

PRINTED BY
V. RAMASWAMY SASTRULU & SONS
AT THE 'VAVILLA' PRESS
Madras.—1933.

# ప్రకటన

మన దేశమునఁ జిరకాలమునుండియు నభివృద్ధినొంది మనపూర్వులబుద్ధికుశలతకుఁ బ్రకాశకములుగనుండిన యాస్తిక నాస్తికదర్శనములను సభాష్యముగసుబోధమగునాంధ్రమునఁ బరివర్తించి యీగ్రంథమాలయందుఁ బ్రచురింపఁ దలంచితిమి. అందీదర్శనము మొదటిది.

శ్రీ. తి. గు. వరదాచార్యులు.

# భూమిక.

తొల్లి భారతవర్షమున విజ్ఞానసంపన్ను లగుమహనీయులు గొందఱు చిరకాలము నిరంతరపరిశోధనములు గావించి ప్రపంచ తత్త్వమును, నాత్మతత్త్వమును సమతమదృష్టికి గోచరించిన తీఱున నిర్ణయించి మిథ్యాజ్ఞానసమాచ్ఛాదితంబై సంసారపంక నిమగ్నమగులోకము నుద్ధరింపఁ దలంచి యాతత్త్వములనెల్ల సంగ్రహముగ లోకమున కుపదేశించియుండిరి. ఇటు లుపదేశింపుటకై వారు రచించి లోకమునకుఁ బ్రసాదించినసూత్రగ్రంథములే దర్శనములని వ్యవహరింపఁబడుచున్నవి. "దర్శ్యతే తత్త్వమనేన" యనువ్యుత్పత్తినిబట్టి తత్త్వబోధకములగు వీనికి దర్శనములను వ్యవహార మన్వర్థమగుచున్నది

దర్శనోత్పత్తి.

ఆస్తికదర్శనములు, నాస్తికదర్శనములు నని దర్శనములు ద్వివిధములు. వేదప్రామాణ్యము నంగీకరించిన గోతమాదులచే రచింపఁబడిన 1. న్యాయము (గౌతమము), 2 వైశేషికము (కాణాదము), 3. సాంఖ్యము (కాపిలము), 4 యోగము (పాతంజలము), 5. పూర్వమీమాంస (జైమినీయము), 6. ఉత్తరమీమాంస (బాదరాయణీయము) యనునివి యాస్తిక దర్శనములు. వేదప్రామాణ్యము నంగీకరింపనిచార్వాకాదులచే రచింపఁబడిన 1. చార్వాకదర్శనము, 2. బౌద్ధదర్శనము, 3.

దర్శనవిభాగము.

జైనదర్శనము, 4. ఆర్హతదర్శనము, 5. దిగంబరదర్శనము, 6. సౌమదర్శనము నను నీయాఱును నాస్తికదర్శనములు

ఇందు నాస్తికదర్శనస్వరూపము తొలుత నిరూపింపఁబడును.

దేహాతిరిక్తమగునాత్మ, పురుషునికిఁ బుణ్యపాపసంబంధము, జన్మాంతరము, పరలోకము మున్నగునదృష్టపదార్థములు లేవని బోధించుట బౌద్ధచార్వాకదర్శనములందుఁ దుల్యము. జ్ఞానాతిరిక్తముగ బాహ్యాభ్యంతరప్రపంచములు లేవనియుఁ, బ్రత్యక్షాతిరిక్తమగు ననుమానాదులు ప్రమాణములు గావనియు, యథేచ్ఛముగ లౌకికసుఖముల ననుభవించుటయే ముక్తియనియుఁ, జార్వాకదర్శనప్రతిపాదితములగువిశేషములు.

నాస్తికదర్శన స్వరూపము.

జ్ఞానాతిరిక్తముగ బాహ్యాభ్యంతరప్రపంచములు గలవనియుఁ, బ్రత్యక్షానుమానములు రెండును బ్రమాణములనియు, మరణమే యపవర్గమనియు బౌద్ధదర్శనప్రతిపాదితవిశేషములు.

దేహాతిరిక్తమును దేహమాత్రపరిమితము నగునాత్మ గలదనియుఁ, గర్మపాశబద్ధమై యాత్మ సంసారమగ్నమై యుండుననియు, జినదేవోపాసనమునఁ గ్రమముగాఁ గర్మబంధము తొలఁగినపిదప నాత్మ యీలోకమును విడిచి యూర్ధ్వదేశమునకుఁ బోవుననియు, నిట్లుపోవుటయే ముక్తియనియు బోధించుట జైనార్హతదిగంబరదర్శనములకు సమానము. ఈదర్శనములు మూఁటికిని బ్రపంచతత్త్వనిరూపణంబున 'స్యాద్వాదము' మున్నగుపద్ధతులచేఁ గొన్ని యవాంతరభేదములు గానంబడును. ఆసూక్ష్మభేదములనెల్ల వివరించుట కిది తావుగాదు.

భైరవపూజాంగముగ జంతుబలిసమర్పణము, మద్యమాంససేవనము మున్నగుహింసాసంబద్ధకృత్యముల నాచరించుటచే జన్మాంతమున శివసారూప్యరూపమగు ముక్తిగలుగునని సోమదర్శనసిద్ధాంతము. సోమదర్శనముదక్క మిగిలిననాస్తికదర్శనములందెల్ల నహింసయే పరమధర్మముగ నిరూపింపఁబడినది.

**ఆస్తికదర్శనస్వరూపము.**

ప్రత్యక్షానుమానోపమానశబ్దంబులు నాలుగిటికిఁ బ్రామాణ్యమును, షోడశపదార్థంబులస్వరూపంబును, దేహాత్మభేదమును, తత్త్వజ్ఞానంబున సకలదుఃఖధ్వంసరూప మోక్షప్రాప్తియు న్యాయదర్శనప్రతిపాద్యములు ప్రత్యక్షానుమానములు రెండిటికే ప్రామాణ్యమును, సప్తపదార్థస్వరూపంబును, దేహాత్మభేదమును, తత్త్వజ్ఞానంబున నిత్యసుఖాభివ్యక్తిరూప మోక్షప్రాప్తియు వైశేషికదర్శనప్రతిపాద్యములు. కాఁగాఁ బ్రమాణపరిగణనంబునను, పదార్థపరిగణనంబునను, మోక్షస్వరూపంబునను న్యాయవైశేషికమతములు భిన్నములగుచుండును.

మూలప్రకృతి, మహత్తత్త్వము, అహంకారము, శబ్దాదిపంచతన్మాత్రలు, జ్ఞానేంద్రియపంచకమును, కర్మేంద్రియపంచకమును, మనస్సును, ఆకాశాదిభూతపంచకమునను షోడశవికారములు, పురుషుఁడు నను నీయిరువదియైదును తత్త్వంబులనియుఁ, బురుషునికంటె వేఱుగ నీశ్వరుఁడు లేఁడనియుఁ, బ్రకృతిపురుషసంసర్గముచే సంసారమేర్పడుననియుఁ, బ్రకృతిపురుషభేదజ్ఞానంబునఁ గైవల్యము సిద్ధించుననియు, నాత్మనిస్సంగముగ నుండుటయే కైవల్యమనియు, సాంఖ్యదర్శనము నిరూపించును. చిత్తచాంచల్యమును నిరోధించుటయే యోగ

మనియు, యమనియమాదు లెనిమిదియు యోగాంగంబు లనియుఁ, బురుషునికంటె వేఱుగ నీశ్వరుఁడు గలఁడనియు, యోగాభ్యాసంబున నీశ్వరు నుపాసించువానికి నణిమాద్యష్ట సిద్ధులు గలుగుననియు, యోగులు దీర్ఘాయుష్కులై స్వచ్ఛంద మరణము నొందుదురనియు, నీశ్వరోపాసనచే మోక్షప్రాప్తి గలుగుననియు, నాత్మనిస్సంగస్థితియే మోక్షమనియు యోగ దర్శనము నిరూపించును. కాఁగా నీశ్వరవిషయమున సాంఖ్య యోగమతములకు వైషమ్యము గలదు.

వేదనిత్యత్వమును, గర్మస్వరూపమును, గర్మములయం గాంగిభావమును, మంత్రాదులస్వరూపంబును, దద్వినియోగం బును, వేదనిషిద్ధకర్మములఁ బరిత్యజించి వేదచోదితకర్మముల నాచరించుటచే శాశ్వతస్వర్లోకవాసరూప మోక్షప్రాప్తియుఁ బూర్వమీమాంసా ప్రతిపాద్యములు. జీవాతిరిక్తముగ నీశ్వ రుఁడు లేఁడనువిషయమున నీకర్మమీమాంసకులకును, సాంఖ్యు లకును నైకమత్యము గలదు. 1 పరమేశ్వరునికి జగదుత్ప త్త్యాదికారణత్వమును, నాపరమేశ్వరతత్త్వమునకు వేదాంత వేద్యత్వమును, సంసారమున కజ్ఞానమూలకత్వమును, బ్రపంచ మునకు మిథ్యాత్వమును, జీవేశ్వరులకు వాస్తవికభేదాభావ మును, సగుణనిర్గుణభేదంబునఁ బరాపరబ్రహ్మ ద్వైవిధ్యమును, నపరబ్రహ్మోపాసనపద్ధతులును, నాత్మతత్త్వజ్ఞానంబున నజ్ఞాన వినాశరూప మోక్షప్రాప్తియు నుత్తరమీమాంసా ప్రతిపాద్య ములని శంకరాచార్యులమతము. 2. ప్రపంచసత్యత్వమును, జీవేశ్వరులకు వాస్తవికభేదంబును, జీవాణుత్వమును, నిర్గుణ బ్రహ్మాభావమును, దత్త్వత్రయంబు (1 ఈశ్వరుఁడు, 2 చిత్తు=

జీవుఁడు, 3 అచిత్తు=జడమగు ప్రపంచము)ను, నీశ్వరతత్త్వమునకును, జిదచిత్తత్త్వములకును శరీరిశరీరభావంబును, జిదచిత్తత్త్వములకు స్థూలసూక్ష్మావ్యవస్థాభేదంబులును, బ్రపంచస్థితికాలంబున నీశ్వరునికి స్థూలచిదచిద్విశిష్టత్వమును, బ్రలయకాలంబున నీశ్వరునికి సూక్ష్మచిదచిద్విశిష్టత్వమును, స్థూలచిదచిద్విశిష్టునికిని సూక్ష్మచిదచిద్విశిష్టునికిని నద్వైతంబు (భేదాభావంబు)ను, నీశ్వరానుగ్రహంబున నప్రాకృతలోక(వైకుంఠ)ప్రాప్తిరూపమోక్షంబును, నుత్తరమీమాంసాప్రతిపాద్యములని రామానుజాచార్యులమతము. 3. తత్త్వద్వయంబు (1 ఈశ్వరుఁడు, 2 చిదచిద్రూపప్రపంచము)ను, విశేషణభేదంబుచే విశిష్టభేదంబు సిద్ధించునుగాన స్థూలచిదచిద్విశిష్టునికిని, సూక్ష్మచిదచిద్విశిష్టునికిని నద్వైతాభావంబు(భేదంబు)ను, వ్యాసదర్శనప్రతిపాద్యములని మధ్వాచార్యుల (ఆనందతీర్థుల)మతము. పరమేశ్వరునికి జగదుత్పత్త్యాదికారణత్వమును, వేదాంతవేద్యత్వము ననునీరెండును మతత్రయసమ్మతములు. జీవేశ్వరభేదము,జీవాణుత్వము, జీవనానాత్వము, జీవేశ్వరులకు నియమ్యనియామకభావము, విష్ణుపారమ్యము, నప్రాకృతలోకావాప్తిరూపమోక్షము, మున్నగువిషయములు ద్వైతవిశిష్టాద్వైతసిద్ధాంతంబులఁ దుల్యంబులు. జీవేశ్వరుల కైక్యమును బ్రతిపాదించుటచే శంకరమతమున కద్వైతమనియు, స్థూలచిదచిద్విశిష్టసూక్ష్మచిదచిద్విశిష్టులకైక్యము నంగీకరించుటచే రామానుజమతమునకు విశిష్టాద్వైతమనియు, జీవేశ్వరభేదంబును, స్థూలసూక్ష్మచిదచిద్విశిష్టభేదంబును నిరూపించుటచేఁ బూర్ణప్రజ్ఞమతమునకు ద్వైతమనియు వ్యవహారము రూఢమైనది.

ఈరీతిని వ్యాసదర్శనమునకు శంకరరామానుజపూర్ణప్రజ్ఞాచార్యులు త్రివిధములగు భాష్యముల రచించుటచే ద్వైతాద్వైతవిశిష్టాద్వైతము లను మూఁడుమతంబులు లోకమున వ్యాప్తిఁ జెందినవి.

**న్యాయదర్శన ప్రాశస్త్యము.**

లోకమున, నేవస్తువు తత్త్వమును నిర్ణయింపఁబూనినను బ్రత్యక్షాది ప్రమాణము లత్యావశ్యకము లగుచుండును. ప్రమాణవిరహితముగఁ బదార్థతత్త్వమును నిర్ణయించుట యెవ్వరికిని శక్యముగాదుగదా! ఇటు లవశ్యాపేక్షితములగు ప్రమాణములు స్పష్టముగను, సవిమర్శముగను, సమగ్రముగను న్యాయదర్శనమున నిరూపింపఁబడియున్నవి. ప్రమాణములవిషయమున నింతటిపరిశీలన మితరదర్శనములం దెచ్చటను నగపడదు. మఱియు సంస్కృతవాఙ్మయమునం దెల్లయెడలఁ దత్తద్విషయనిర్ణయమునకు న్యాయదర్శనమునఁ బ్రతిపాదితములగు ప్రమాణములే యాధారములగుచుండును ఈప్రమాణములు శాస్త్రీయవిషయములందేగాక లౌకికవ్యవహారములందు సయితము దఱుచుగా నుపచరించుచుండును. కావున లోకవ్యవహారమునకును, వాఙ్మయమునకును నిరంతరోపకారకములగు ప్రమాణములను బ్రధానముగఁ బ్రతిపాదించునదగుటం జేసి యీన్యాయశాస్త్రము దర్శనములన్నిటను బ్రశస్తమనఁ దగియున్నది. మఱియు నీన్యాయదర్శనమునఁ బ్రతిపాదింపఁబడినయుక్తు లచ్చటచట వేదమున ("కథమసతస్సజ్జాయేత"... ఛాందో 6 అ. ఇత్యాదులందు) గ్రహింపఁబడియున్నవి మనుస్మృతి, యాజ్ఞవల్క్యస్మృతి, విష్ణుపురాణము మున్నగువానియం

దీదర్శనము దలుచుగాఁ బ్రశంసింపఁబడియున్నది. ఇట్టి ప్రాచీన ప్రశంసలంబట్టియు న్యాయదర్శనప్రాశస్త్యము బలపడుచున్నది.

## న్యాయదర్శనకర్త; తచ్చరితము.

న్యాయదర్శనప్రణేతయగుమహర్షి నామము గోతముఁడనియు, గౌతముఁడనియు రెండువిధములుగఁ గానవచ్చుచున్నది "ఏషా మునిప్రవరగోతమసూత్రవృత్తిః" అని విశ్వనాథపంచాననవిరచితమగున్యాయసూత్రవృత్తియందును,"భగవతా గోతమేన ప్రమాణాదిపదార్థలక్షణనిరూపణం విధాయ" అని మాధవాచార్యవిరచితమగు సర్వదర్శనసంగ్రహంబునను, న్యాయశాస్త్రకర్తగోతముఁడని 'న్యాయ' శబ్దార్థవివరణసందర్భమున వాచస్పత్యకోశమునందును, "గోతమేన తథా న్యాయమ్" అని పద్మపురాణమునందును నిట్లు ప్రామాణికగ్రంథములు పెక్కిట గోతమశబ్దమే నిర్దిష్టమై యుండుటంజేసి న్యాయదర్శనకర్త గోతముఁడనుటయే సమంజసమని తోఁచుచున్నది ఈతనికే యక్షపాదుఁడనియు నామాంతరము గలదు.

నామము. ఈనామము గలుగుట కొకగాథయొతిహ్యము గలదు. "గోతముఁడు తనశిష్యుఁడగు వ్యాసమహర్షి తనమతమునకు విరుద్ధముగ జీవబ్రహ్మైక్యము (అద్వైతము)ను నౌపనిషదదర్శనమున నిరూపించుటచే నాతనిపైఁ గోపించి నే నీకన్నులతో నీమొగము జూడనని శిష్యుని నిరాకరించెనఁట పిమ్మట వ్యాసుఁడు ఖిన్నుఁడై గురువు ననుగ్రహమును బెక్కువిధముల వేఁడుకొనెనఁట. శిష్యవత్సలుఁ డగుగోతముఁ డెట్టకేలకుఁ బ్రసన్నుఁడై తనప్రతిజ్ఞకు భంగము వాటిల్లకుండ శిష్యు ననుగ్రహింప

నెంచి తపోమహత్త్వముచేఁ దనపాదమునం దొకనేత్రమును గల్పించి దానితో శిష్యుని జూచుచుండెనఁట. అప్పటినుండియు గోతమునికి నక్షపాదుఁ డనువ్యవహారము గలిగెనఁట." అని పెద్దలు వచింతురు. ఈయైతిహ్యము వాచస్పత్యాదులందును గానఁబడును.

ఈగోతమమహర్షి రహూగణమహర్షికిఁ బుత్త్రుఁడనియు, విదేహదేశాధీశులగు జనకులకుఁ బురోహితుఁడనియు, "విదేఘోహమాథవోఽగ్నిం వైశ్వానరం ముఖే బభార, తస్య గోతమోరాహూగణః పురోహిత ఆస" అని శతపథబ్రాహ్మణము నిరూపించుచున్నది. "అహల్యాదర్శనం చైవ గౌతమస్య సమాగమం, శ్రుత్వా......గౌతమస్య సుతో జ్యేష్ఠః......

వంశము.

శతానన్దో మునిశ్రేష్ఠం విశ్వామిత్ర మథాబ్రవీత్, అపి రామాయ కథితం యథావృత్తం పురాతనం, మమ మాతు ర్మహాతేజో దైవేన దురనుష్ఠితమ్" (రామా. బాల, 50, 51 స.) ఇత్యాదులగు శ్రీమద్రామాయణవాక్యములంబట్టి గోతమునకు జనకపురోహితుఁ డగుశతానందుఁడు పుత్త్రుఁడగుటయు, నహల్య భార్యయగుటయు స్పష్టము.

శ్రీమద్రామాయణమున (బాల. 48-51) గోతమాశ్రమము మిథిలాపురమునకు సమీపమున నున్నటులు వర్ణింపఁబడి యున్నది దీనింబట్టి న్యాయదర్శనము విదేహదేశమున మిథిలాపురసమీపమున రచింపఁబడినటు లూహింపఁదగును. తొలుత

నుండియు నుదయనాచార్యులు, వాచస్పతిమిశ్రులు, గంగేశోపాధ్యాయులు, వర్ధమానోపాధ్యాయులు

**దేశము.**

మున్నగు మైధిలేయులే కుసుమాంజలి, తాత్పర్యటీక, చింతామణి, పరిశుద్ధి మున్నగున్యాయగ్రంథములను రచించియుండుటగూడఁ బయియూహను బలపఱచుచున్నది. మఱియు క్రీ॥ శ॥ 1600 ప్రాంతమువాఁడును, దీధితికర్తయు, వంగదేశీయుఁడు నగురఘునాథశిరోమణికాలమువఱకును న్యాయశాస్త్రప్రచారము మిధిలాప్రాంతమునమాత్రమే యుండుటగూడఁ బయియూహకు సాధకము కాఁగలదు.

మంత్రద్రష్టయు గోత్రప్రవర్తకుఁడునగు నీగోతమ మహర్షికాలమును సరిగా నిర్ణయించుటకుఁ దగినయాధారములు లభింపవు. రామాయణకథాకాలమున గోతమునియునికిని వాల్మీకిమహర్షి వర్ణించియుండుటచే

**కాలము.**

రామాయణకథాకాలమే గోతమునికాలమని స్థూలముఁగ నూహింపనగును.

బౌద్ధమతప్రవర్తకుఁ డగుగౌతముఁడును, జైనమతానుయాయి యగుగౌతముఁడును న్యాయదర్శనప్రణేతయగు నీగోతమునికంటె భిన్నులని యెఱుఁగవలయును. మొదటియిరువురును వేదప్రామాణ్యనిరాసకులు. ఈతఁడు వేదప్రామాణ్యస్థాపకుఁడు.

## భాష్యము.

న్యాయదర్శనమునకు వాత్స్యాయనమహర్షి ప్రౌఢమగు నొకభాష్యమును రచించియుండెను. ఈతనిభాష్యరచనాప్రౌఢిని

బట్టియు, వార్తికకారాదుల ప్రశంసలంబట్టియు నీయన లోకో త్తర ప్రతిభాశాలియని విదితమగుచున్నది. ఈభాష్యమునందలి వాక్యములు గొన్ని సూత్రములను బోలియుండును. కావుననే చదువరులు భాష్యవాక్యములఁ గొన్నిఁటిని సూత్రములుగాఁ దలంచుటయు, నట్టిభ్రమచే సమన్వయసందేహములు గలుగు టయుఁ దటస్థింపఁగా వాచస్పతిమిశ్రులు పరిశీలించి సూత్రము లను, భాష్యవాక్యములను వేఱుపఱిచి న్యాయసూచీనిబంధ మను నొకగ్రంథమును రచింపవలసివచ్చెను.

ఈవాత్స్యాయనునికిఁ బక్షిలస్వామియనియుఁ, బక్షిల మునియనియు నామాంతరములు గలవు. ఈతని దేశకాలముల నిర్ణయించుటకుఁ దగినయాధారములు లభింపకున్నవి అయి నను క్రీ॥ శ॥ 4-వ శతాబ్దిలోనివాఁడగు దిఙ్నాగాచార్యులు వాత్స్యాయనభాష్యమును ఖండించుచు బౌద్ధమతానుసార ముగ న్యాయసూత్రముల కొకటీకను రచించియుండుటంబట్టి వాత్స్యాయనుఁడు క్రీ॥ శ॥ 4-వ శతాబ్దికిఁ బూర్వుఁడనిమాత్ర మూహింప వీలగుచున్నది. దిఙ్నాగాచార్యులటీకను ఖండించి వాత్స్యాయనభాష్యమును సమర్థించుచు నుద్యోతకరుఁడను వ్యవహారముగలభారద్వాజులు న్యాయవార్తికమను విపులమగు టీకాగ్రంథమును క్రీ॥ శ॥ 7-వ శతాబ్దిని రచించియుండిరి. ఈవార్తికమతమును దూషించుచు దిఙ్నాగమతమును సమ ర్థించుచు క్రీ॥ శ॥ 7-వ శతాబ్దియందే ధర్మకీర్తి యొకగ్రంథ మును రచించెను. పిమ్మట క్రీ॥ శ॥ 9-వ శతాబ్దిని వాచస్పతి మిశ్రులు ధర్మకీర్తిటీకను నిరసించుచుఁ దాత్పర్యటీక యను గ్రంథము నొకదానిని రచించి వార్తికమతమును స్థాపించెను.

ఈతాత్పర్యటీకకు క్రీ॥ శ॥ 10-వ శతాబ్దిలోని యుదయనాచార్యులు పరిశుద్ధి యనువ్యాఖ్యను రచించిరి.

ఈరీతిని క్రీ॥ శ॥ 10-వ శతాబ్దివఱకును న్యాయదర్శన సిద్ధాంతములు దేశమున నసంకీర్ణముగ వ్యాప్తిఁజెందినవి. పిమ్మట క్రీ॥ శ॥ 12-వ శతాబ్దిలోని గంగేశోపాధ్యాయులు న్యాయ మతానుసారముగఁ బ్రమాణచతుష్టయమును, వైశేషిక మతానుసారముగ సప్తపదార్థములను సమ్మతించి యామత ద్వయమును జోడించి చింతామణి యనుగ్రంథమును నూతన మార్గమున రచించెను. ఈమణిగ్రంథమునకు వ్యాఖ్యలు, తద్వ్యాఖ్యలు, తద్విమర్శనములు మున్నగురీతిని న్యాయ గ్రంథము లనేకములు వెలువడినవి. క్రీ॥ శ॥ 12-వ శతాబ్ది నుండి బయలువెడలిననాన్యాయమునకు నవ్యతర్కమనియు, నంతకుముందటిన్యాయమునకుఁ బ్రాచీనతర్కమనియు వ్యవహారము రూఢమైనది. క్రమముగా నవ్యతర్కము వ్యాపించిన కొలఁది ప్రాచీనన్యాయప్రచారము దేశమున విరలమయినది. విరల మన నేల! ఇంచుమించుగఁ దత్ప్రచారము నశించినదనియే చెప్పనగును.

సుదూరము పరిశీలించినచోఁ బ్రాచీనతర్కవ్యాసంగముచేఁ గలిగెడివస్తుతత్త్వజ్ఞానమున శతాంశమైనను నవ్యతర్కమువలనఁ గలుగనేరదనుట నిర్వివాదము. కావుననే ప్రాచీనన్యాయశాస్త్రప్రచారమునకై యాధునికులు గావించెడి యత్నములెల్లఁ గడుంగడు ప్రశంసార్హములనుటకు సందియములేదు. మనుజులకెల్లరకును, శాస్త్రీయలౌకికవ్యవహార

ములం దెల్లయెడలను బదార్థస్వరూపపరిశీలనపద్ధతియుఁ, దత్త్వ జ్ఞానంబును నత్యావశ్యకంబులు గావునఁ బరిశీలనపద్ధతిబోధ కంబులును, దత్త్వజ్ఞానోత్పాదకంబులునగు నిట్టి దర్శనగ్రంథ ములు దేశీయులెల్లరకును సుబోధమగునటులు దేశభాషలలోఁ బరివర్తితములగుట యెంతయు నభిలషణీయము. అట్టి యభి లాషయే మాప్రకృతాంధ్రీకరణమునకుఁ బ్రేరకము.

కొల్లూరు సోమశేఖరశాస్త్రి,
దువ్వూరి వేంకటరమణశాస్త్రి.

శివాయ గురవే నమః.

# న్యాయదర్శనము

## ప్రథమాధ్యాయము.

### ప్రథమాహ్నికము.

I

లోకంబునఁ బ్రమాణవిరహితంబుగఁ బదార్థజ్ఞాన ముద యింపదు. పదార్థజ్ఞానవిరహితంబుగఁ బ్రవృత్తినివృత్తులు సంభ వింపవు. మనుజుండు ప్రమాణమునుబట్టి పదార్థస్వరూపంబు నధిగమించి యద్దానఁ బ్రవర్తించుటకో, నివర్తించుటకో యిచ్ఛయించి, ప్రవర్తించిగాని, నివర్తించిగాని ససాధనంబుగ సుఖదుఃఖముల నందుచుండుట సహజంబు. ప్రపంచంబునందలి పదార్థతత్వమెల్లఁ బ్రమాణము( తెలుపునది.), ప్రమాత ( తెలియు వాఁడు ), ప్రమేయము ( తెలియఁబడునది ), ప్రమితి ( తెలియుట.) యను నీనాలుగిటిని సంబంధించియే యుండును. పదార్థతత్వం బనఁ బదార్థములు ప్రమాణవిషయంబు లగుట. పదార్థంబులు సత్తులనియు, నసత్తులనియు ద్వివిధంబులు. ఇయ్యవి ప్రమాణం బులవలననే గ్రహింపంబడును. అనఁగాఁ జక్షురింద్రియము (ప్రమాణము.) ఘటరూపసత్పదార్థమును గ్రహించినటులే పటాభావరూపంబగు నసత్పదార్థమునుగూడ గ్రహించును.

కాఁగా సకసత్పదార్థంబులెల్లఁ బ్రమాణగ్రాహ్యంబులనుట పర్యవసన్నంబు

అందు, (౧—౧ సూత్రము.)

ప్రమాణ, ప్రమేయ, సంశయ, ప్రయోజన,దృష్టాంత, సిద్ధాంతా, వయవ, తర్క, నిర్ణయ, వాద, జల్ప, వితండా,హేత్వాభాస, చ్ఛల,జాతి,నిగ్రహస్థానంబుల తత్వంబునధిగమించిన నిశ్శ్రేయసంబు సులభంబు ౧.

ఇందలి ప్రమాణాదు లగుసత్పదార్థములు పదునాఱిటి స్వరూపంబు ముస్ముందు వివరింపఁబడును.

త్రయి, వార్త, దండనీతి, యాన్వీక్షికి యను నీనాలుగు విద్యలను లోకంబునఁ బ్రాణికోటి యుపయోగంబునకు మహర్షు లనుగ్రహించియుండిరి ఋగ్యజుస్సామవేదంబులు త్రయి యనంబడును. హాలశకట క్షేత్రాది ప్రతిపాదకం బగుకృషివిద్య వార్త నాఁబడును. స్వామ్యమాత్యాది రాజ్యాంగ ప్రతిపాద కంబు దండనీతి. ఆన్వీక్షికి యనఁ బ్రమాణప్రమేయసంశయాది స్వరూపవివేచనక్షమం బగున్యాయవిద్య. ఈన్యాయవిద్యకును, వేదాంతవిద్యకును భేదంబుగల్పించుటకుఁ బ్రమేయాంతర్గతంబు లయినను బ్రకృతవిద్యాసంబద్ధములగు సంశయాదులు వేఱుగ నిరూపింపఁబడుచున్నయవి.

సంశయాదులకు న్యాయశాస్త్ర(సంబంధం బెట్టిదనిన)ము తోడిసంబంధము నీక్రిందిరీతిగ నెఱుంగునది.

ప్రత్యక్షాగమావిరుద్ధంబగు ననుమానంబు వస్తుస్వరూపంబును బోధింపఁజాలియుండును. ఇదియే యన్వీక్ష. (అను+ఈక్ష=ప్రత్యక్షము ననుసరించునది) యనంబడును ఈయన్వీక్షను బ్రధానంబుగ నిరూపించునది యాన్వీక్షికి యనంబడు. ఇదియే న్యాయశాస్త్రంబు. ఇయ్యది ప్రమాణంబులంబట్టి వస్తుతత్వంబు నిర్ణయించు చుండును.

వస్తుస్వరూపానవధారణాత్మకజ్ఞానంబు సంశయంబు. వస్తుస్వరూపం బించుకయుఁ దెలియనపుడుగాని, సమగ్రంబుగఁ దెలిసినపుడుగాని న్యాయప్రవృత్తి యనావశ్యకంబు. వస్తుస్వరూపంబు సంశయితంబగునపుడే న్యాయము ప్రవర్తింపవలసియుండును కావున సంశయము న్యాయశాస్త్రప్రతిపాద్యము. సుఖప్రాప్తిదుఃఖపరిహారరూపం బగు ప్రయోజనంబు లేనిచో మనుజుండు వస్తుస్వరూపపరీక్షకుఁ బ్రవర్తింపఁడు గానఁ బ్రయోజనంబు న్యాయశాస్త్రసంబద్ధము. నిశ్చితమగు సాధ్యసాధనసంబంధముగలది దృష్టాంతము. ఇది యనుమానాగమంబుల కుపకరించుచు న్యాయాంగమగును. స్వపక్షసాధనమునకు దృష్టాంతానుకూల్యమును బరపక్షనిరాకరణంబునకు దృష్టాంతప్రాతికూల్యంబును నావశ్యకంబులు. నాస్తికు లాగమాదిప్రామాణ్యము నంగీకరింపరు. వస్తుతత్వవిచారంబున క్షణికవాది యగునాస్తికుఁ డేదేని దృష్టాంతమును సమ్మతించినచోఁ దన్నాస్తికత్వమునకే భంగమువాటిల్లును. సమ్మతింపనిచో సాధనవికలుం డగును. కావున దృష్టాంతము నాస్తికమతనిరా

కరణంబునకు సాధనంబు. సాంఖ్యాదితంత్రకర్తలచేఁ దత్తన్మతానుకూలంబుగ నంగీకరింపఁబడినవిషయములు సిద్ధాంతములనంబడును. అట్టిసిద్ధాంతములభేదంబులు వాదజల్పాదులచే నీశాస్త్రంబునఁ జర్చింపఁబడునుగాన సిద్ధాంతము న్యాయాంగమగును. అవయవంబులనఁ బ్రతిజ్ఞాహేతూదాహరణోపనయనిగమనంబులు. ప్రతిజ్ఞయన శబ్దప్రమాణంబు. హేతువన ననుమానప్రమాణంబు. ఉదాహరణంబనఁ బ్రత్యక్షంబు. ఉపనయంబన నుపమానంబు. నిగమనంబనఁ బయినాలుగింటియాను కూల్యంబును నొక్కవిషయంబున నిరూపించుట. ఈయైదింటి సముదాయంబె పరమన్యాయంబు. పరమంబన విప్రతిపన్నులను గూడ సమ్మతింపఁజేయునదనుట. ఈయవయవంబులంబట్టియే వాదజల్పవితండలు ప్రవర్తిల్లును. తత్త్వవ్యవస్థయు వీనివలననే యేర్పడును. స్పష్టముగాఁ దెలియనివస్తుతత్త్వమును గారణోపపత్తినిబట్టి తెలిసికొనుటకుఁ జేయునూహాయే తర్కమనంబడును. ఇయ్యది ప్రమాణాంతరంబుగా నేరదు. ప్రమాణాను గ్రాహకంబుమాత్ర మగును. ఎట్లన; మనుజునిజన్మము నిర్హేతుకమా? నిత్యహేతుకమా? అనిత్యహేతుకమా? యనుపరిశీలనంబున, నిర్హేతుకమయినచో నది స్వయముగనే నివృత్తమగును గాన జన్మరాహిత్యమునకు యత్నం బనావశ్యకం బగును. నిత్యహేతుకమయినయెడ హేతూచ్ఛేదంబు సంభవింపదుగాన జన్మోచ్ఛేదంబు దుర్ఘటంబు. కాన జన్మం బనిత్యహేతుకంబు గాఁదగును. అను నిట్టితర్కముచే 'కర్మణా జాయతే జన్తుః'

అనెడిశబ్దప్రమాణము స్థిరపఱుపఁబడును. ఈతర్కము వాదమున స్వమతస్థాపనంబునకును, బరమతనిరాకరణంబునకును నుపయుక్తం బగుచు న్యాయాంగం బగును.నిర్ణయంబనఁ బ్రత్యక్షాదులకు ఫలభూతంబగు తత్వజ్ఞానంబు. ఇయ్యది సిద్ధించు వఱకు వాదంబు ప్రవర్తిల్లును. కావున నిర్ణయము న్యాయశాస్త్రప్రతిపాద్యము. ప్రవీణులగు గురుశిష్యులు తత్వజిజ్ఞాసువులు విమర్శనీయంబగు విషయంబునంగలపక్షంబులను సహేతుకంబుగఁ బరిశీలించి యందొకపక్షంబును సిద్ధాంతీకరించుట కుపయోగించెడివాక్యసముదాయంబు వాద మనంబడును.ఈవాదంబును బూర్వోక్తంబగుతర్కంబును లోకవ్యవహారంబునకు మిక్కిలి యుపకరించు చుండును. విషయవిమర్శమున స్వమతస్థాపనంబునకై యత్నించుజిగీషువులగు ప్రతిద్వంద్వులవాక్యసముదాయంబునకు జల్పమని వ్యవహారము. స్వపక్షస్థాపనమును వాంఛింపక పరపక్షనిరాకరణమాత్రంబున కుపయోగింపఁబడుకథకులవాక్యసముదాయంబు వితండ యనంబడును. వాదంబు తత్వజ్ఞాననిష్పత్తికిని జల్పవితండలు తత్వజ్ఞానపరిపాలనంబునకును నుపయుక్తంబులగుటచే న్యాయశాస్త్రంబున నిరూపణీయంబులయ్యె. తత్వనిర్ణయవిజయప్రయోజనకము లగువాదజల్పములకు ఫలముండినను స్వపక్షరహితుఁ డగువైతండికుని పరదూషణరూప మగువితండకు ఫలమేమి యనుశంక యుద్భవించుట కిట నవకాశము గలదు. కాని వైతండికునికిఁగూడ స్వపక్ష మొకటి యుండక తప్పదు. లేనియెడ నాతఁ డున్మత్త

ప్రాయుఁ డగును. స్వపక్షమును స్థాపించుకొనుటకుమాత్ర మాతఁడు వేఱుగ యత్నింపఁడు. పరపక్షనిరాకరణమువలననే స్వపక్షము స్థాపితమగునని యాతఁడు తలంచును కాన వాద జల్పములవలె వితండ సాక్షాత్తుగ స్వపక్షసాధకముగాకున్నను బరపక్షనిరాకరణద్వారమున స్వపక్షస్థాపకమే యగుంగావున నియ్యదియు సప్రయోజనంబని యెఱుంగునది. దుష్టహేతువులు హేత్వాభాసంబు లనంబడును. ఇయ్యవి స్వపక్షమునఁ బరిహృతంబులయ్యును, బరపక్షంబున నుద్భావితంబులయ్యును దత్వనిర్ణయంబున కుపయుక్తంబు లగును. అర్థాంతరకల్పనచే వాదివాక్యము నాక్షేపించుట ఛల మనంబడును జాతి యన దృష్టాంతసామ్యమునుబట్టిగాని, తద్వైషమ్యమునుబట్టిగాని పరపక్షమును దూషణాభాసములచే నాక్షేపించుట. పరపక్షమునం గలదోషంబుల నుద్భావింపఁజాలకుండుటయుఁ బరప్రదర్శితంబు లగుదోషంబుల వారింపఁజాలక నిర్దుష్టమయిన స్వమతంబు విడుచుకొనుటయు నిగ్రహస్థాన మనంబడును. ఈఛల జాతినిగ్రహస్థానంబులు విజిగీషుకథయందుమాత్ర ముపచరించును. హేత్వాభాసములు వాదంబునందునుం బ్రయోగార్హములు. కాన నిగ్రహస్థానంబునఁ జేరినవయ్యును హేత్వాభాసంబులు వేఱుగ నిరూపింపఁబడినవి. ఇట్లు షోడశపదార్థ నిరూపకం బగున్యాయశాస్త్రంబు సర్వవిద్యాప్రకాశకంబు. ఇందు నిరూపింపంబడు నాత్మాదితత్వజ్ఞానంబున నపవర్గంబు సులభంబు.

ఈయపవర్గంబు తత్వజ్ఞానసమనంతరమే సిద్ధించునా లేక కాలక్రమంబునఁ బ్రాప్తమగునా యని పరిశీలింపఁదగియున్నది. తత్వవేత్త జ్ఞానోదయసమనంతరమే ముక్తుఁ డగునన్నచో లోకమునఁ దత్వవేత్తలు జీవించియుండుట యసంభవము. కావున దత్వోపదేశసంప్రదాయము వినష్టము గావలసియుండును. ఆసంప్రదాయ మవిచ్ఛిన్నముగఁ బ్రవృత్త మగుచుండుటచే సమనంతరముక్తిని నిర్ణయింప నవకాశముగాన రాదు. ఇఁకఁ గాలక్రమంబున మోక్షంబు గలుగునందమన్నఁ గాలాంతరభావి యగుముక్తికి, క్షణికంబగుతత్వజ్ఞానము కారణము గాఁజాలదు. కావునఁ దత్వజ్ఞానంబున నపవర్గంబు గలుగుట యెట్లో వివరించుట ప్రసక్తమై యున్నది.

**సూ.—దుఃఖ, జన్మ, ప్రవృత్తి, దోష, మిథ్యాజ్ఞానంబుల యుత్తరోత్తరాపాయంబువలని తత్తత్సన్నిహితనాశంబుచే నపవర్గంబు సిద్ధించెడు.** ౨.

లోకంబున దేహాతిరిక్తం బగునాత్మ లేదనియు, దుఃఖసాధనము సుఖసాధన మనియు, ననిత్యమగు దేహాదికము నిత్యమనియు, నరక్షకమగు క్షేత్రగృహాదికంబు రక్షకం బనియుఁ, బ్రమాదబహుళం బగుధనాదికము నిర్భయం బనియు, మలమాంసభూయిష్ఠంబయి జుగుప్సావహం బగుశరీరంబు ప్రశస్తం బనియుఁ, గర్మంబులు స్వర్గనరకాదిఫలజనకంబులు గావనియు, సంసారంబు రాగద్వేషాదిదోషమూలకంబు గాదనియుఁ, బున

ర్జన్మంబు లేదనియు, నిప్పటిజన్మంబు కర్మమూలకంబుగాక ప్రకృతిసిద్ధంబ యనియుఁ, బ్రేత్యభావ (చచ్చిపుట్టుట) మను నెడ మరణభవనక్రియలు దేహకర్తృకములన్నను, నాత్మ కర్తృకంబులన్నను లోకంబున సర్వంబు క్షణికంబెగాన విభిన్న కాలికములగు నీక్రియలు రెండిటికి సమానకర్తృకత్వము దుస్సాధమగుటంజేసి ప్రేత్యభావస్వరూపమే సిద్ధింపనేర దనియు, నెట్టటో సిద్ధించుననన్నను నయ్యది యనంతముగాన మోక్షమే లేదనియు, నున్నదన్నను నది నిర్నిమిత్తంబె యగు ననియు, సకలభోగంబులవిడనాడి సర్వవిరహరూపంబయి భయం కరంబగు మోక్షంబు నభిలషించుట సమంజసంబుగాదనియు నిట్లు మిథ్యాజ్ఞానంబు లనేకవిధంబులు. ఈమిథ్యాజ్ఞానంబువలన ననుకూలవస్తువులందు రాగంబును, బ్రతికూలంబులయెడ ద్వేషంబును నేర్పడును. వీనివలన నీర్ష్య, యసూయ, మాయ, లోభము మున్నగు దోషవిశేషంబు లుద్భవించును. ఈదోషం బులవలన ధర్మాధర్మసాధనంబు లగు శుభాశుభప్రవృత్తులు గలు గును. శుభప్రవృత్తిగలమనుజుఁడు దానము, నార్తరక్షణము, వృద్ధసేవ మున్నగు శారీరక కార్యములను, సత్యము, హితోక్తి, ప్రియభాషణము మున్నగు వాచిక కార్యములను, దయ, నిస్పృ హత, యాస్తిక్యము మున్నగు మానసిక కార్యములను నాచరిం చును. అశుభప్రవృత్తిగలవాఁడు చౌర్యము, హింస, నిషిద్ధాచర ణము మొదలగు శారీరకములను, నసత్యము, వంచనోక్తి, పరుష భాషణంబు మున్నగు వాచికంబులను, బరద్రోహము, పర

ద్రవ్యాభిలాష, నాస్తిక్యము మున్నగుమానసికంబులకును గడం గును. ఈశుభాశుభప్రవృత్తియే యుత్తమాధమజన్మంబులకుఁ గారణం బగును. జన్మంబన బుద్ధీంద్రియములతోఁగూడిన శరీర మావిర్భవించుట. ఈజన్మంబువలన దుఃఖంబును, దుఃఖభూ యిష్ఠం బగుసుఖలేశంబును బ్రాప్తించును. పయినిరూపింపఁ బడిన మిథ్యాజ్ఞానము, దోషము, ప్రవృత్తి, జన్మము, దుఃఖము ననువీనిసముదాయంబే సంసార మనంబడును. తత్వజ్ఞానంబుచే మిథ్యాజ్ఞానంబు నివర్తించును. మిథ్యాజ్ఞాననివృత్తిచే దోషం బులు తొలంగును. అవి తొలఁగుటచేఁ బ్రవృత్తి నశించును. తన్నాశముచే దుఃఖము నశించును. దుఃఖము నశింపఁగా నప వర్గము సిద్ధించును. కావున నపవర్గంబునకుఁ దత్వజ్ఞానంబు కార ణంబుగాక ప్రయోజకం బగునని యెఱుంగునది.

దేహాతిరిక్తం బగునాత్మగలదనియు, దుఃఖసాధనంబు దుఃఖసాధనమే యనియు, దేహ మనిత్యమనియు, క్షేత్ర గృహాదికంబు రక్షకంబుగాదనియు, ధనాదికంబు సభయం బనియు, శరీరంబు తుచ్ఛంబనియుఁ, గర్మంబులు ఫలజనకంబు లనియు, సంసారంబు రాగద్వేషాదిదోషమూలకంబనియుఁ, బునర్జన్మంబు గలదనియు, జన్మంబు ప్రకృతిసిద్ధంబుగాక కర్మ మూలకంబ యనియు, నాత్మ క్షణికంబుగాక నిత్యమగుటంజేసి పూర్వదేహత్యాగ దేహాంతరోపాదానరూపం బగుప్రేత్యభావ స్వరూపము సిద్ధించుననియు, నిట్టిప్రేత్యభావము బీజాంకుర న్యాయమున ననాదియు సాంతము నగుటచే నది నశించి మోక్ష

ముగలుగవచ్చుననియు, మోక్షము తత్త్వజ్ఞానమూలకమే యనియు నట్టిమోక్షము సర్వవిరహరూపంబుగావుననే దుఃఖ సంస్పర్శలేక ప్రశాంతమగుటంజేసి సర్వాభిలషణీయం బనియు నిట్లు మిథ్యాజ్ఞానవిరుద్ధంబుగఁ దత్త్వజ్ఞానంబు లనేకవిధంబు లయి యుండును.

అభిధేయప్రయోజనసంబంధప్రకరణము

స మా ప్త ము.

---

II

ఉద్దిష్టంబులగుపదార్థములు లక్షితంబులు, పరీక్షితం బులు నయినంగాని వానితత్త్వంబు తేటపడదు కావున శాస్త్ర ప్రవృత్తి యుద్దేశము, లక్షణము, పరీక్ష యని మూఁడువిధము లుగ నుండును. ఉద్దేశమనఁ బదార్థములఁ బేర్కొనుట. లక్షణ మన నొకపదార్థమున కితరపదార్థభేదమును సాధించు ధర్మము. పరీక్ష యన నుద్దిష్టమున వివక్షితమగులక్షణము సంగత మగునా కాదా యని ప్రమాణములచే విమర్శించి నిర్ణయిం చుట.

ఈశాస్త్రంబున నొకొ్కకయెడ నుద్దిష్టము విభజింపఁబడి పిమ్మట లక్షణము నిరూపింపఁబడుచుండును. వేఱొకచో లక్షణ నిరూపణానంతరము విభాగము చేయఁబడుచుండును. అర్థవిక ల్పోపపత్తిచే వచనవిఘాతంబు ఛల మనంబడు. అయ్యది వాక్ఛలంబు, సామాన్యచ్ఛలంబు, నుపచారచ్ఛలంబు నని త్రివి ధంబు.

(౧ అధ్యా-౨ ఆహ్ని-౧౧, ౧౨ సూ) మున్నగుచోట్ల లక్షణానంతరవిభాగము గాననగును. ప్రకృతంబునఁ బ్రథమ సూత్రంబున నుద్దిష్టంబగు ప్రమాణమునకుఁ దొలుత విభాగము చూపఁబడుచున్నది.

**సూ:—ప్రత్యక్షానుమానోపమానశబ్దరూపంబునఁ బ్రమాణంబు చతుర్విధంబు—3.**

ఇంద్రియములకుఁబదార్థములతోడి సన్నికర్ష (=సంబంధ)ముగాని, యింద్రియముగాని ప్రత్యక్ష (ప్రమాణ)మని వ్యవహరింపఁబడును. ప్రత్యక్ష ప్రమాణజన్యమగుజ్ఞానమునకును బ్రత్యక్షమనువ్యవహారము గలదు. ప్రత్యక్ష ప్రమాణమువలనఁ బ్రత్యక్షజ్ఞానంబును బ్రత్యక్షజ్ఞానంబువలన హానోపాదానోపేక్షాబుద్ధులును గలుగుచుండును. ప్రత్యక్షానుసారంబుగ సాధ్యమును నిర్ణయించుహేతువు, అనుమానం (అను = (పశ్చాత్)+మానమ్) బనంబడును. ఉపమానంబన సామీప్యజ్ఞానము. సాదృశ్యజ్ఞానమని భావము. [సమ్(=సమమ్)+ఆప్యతే (=ఈక్ష్యతే)=సమీపమ్(=సదృశమ్)] అర్థబోధకమగుశబ్దము శబ్దప్రమాణ మనంబడును. ప్రమాణమనఁగ జ్ఞానసాధనమని యెఱుంగునది. ఈప్రమాణము లొక్కొక్కచోఁ గలిసియును, వేఱొకచోఁ బ్రత్యేకముగను దత్వనిర్ణాయకము లగుచుండును. ఎట్లన నొకచో నున్నయగ్నిని దూరంబుననుండి యాప్తవచనం (శబ్దప్రమాణం)బునను సమీపించుచు, ధూమదర్శనం(అను

మానం)బునను సమీపించి, ప్రత్యక్షంబునను దెలియవచ్చును. ఇట్టియెడఁ బ్రమాణములకు సంప్లవ(సంకర)మని యెఱుంగవలయును. యాగము స్వర్గసాధన మనునది "స్వర్గ కామో యజేత" యనుశబ్దప్రమాణమువలనమాత్రమే తెలియఁబడును. గృహమధ్యముననుండి గర్జితము వినినంతనే గగనమున మేఘ మున్నటుల ననుమానప్రమాణమువలనఁ దెలిసికొనఁగలము. ఇటఁ బ్రమాణాంతరమున కావశ్యకత లేదు. ప్రత్యక్షమువలన నాత్మీయకరచరణాదిజ్ఞానము గలుగునపుడు ప్రమాణాంతర మనావశ్యకము. ఇట్టియెడఁ బ్రమాణంబులకు వ్యవస్థ(=అసంకీర్ణత) యని యెఱుంగవలయును. మనుజుఁడు జిజ్ఞాసితమగు పదార్థస్వరూపమును నాప్తవచనంబున నెఱింగియు నంతమాత్రమునఁ దృప్తిఁజెందక యింకను సహేతుకంబుగ దాని నిర్ణయింప యత్నించును. సహేతుకంబుగ నిర్ణయింపఁబడినదానిం గూడఁ దాను బ్రత్యక్షంబుగఁ జూడ నభిలషించును. స్వయముగఁ జూచినతోడనే యాతనిజిజ్ఞాస నిశ్శేషముగ నివర్తించును. కావున జ్ఞానంబులలోఁ బ్రత్యక్షజ్ఞానంబును, బ్రమాణంబులం దెల్లఁ బ్రత్యక్షప్రమాణంబును బ్రధానంబులు.

**సూ:—ఇంద్రియార్థసన్నికర్షజన్యమై యవ్యపదేశ్యంబును, నవ్యభిచారియు, వ్యవసాయాత్మకంబు నగు జ్ఞానంబు ప్రత్యక్షంబు—౪.**

చక్షురాదీంద్రియములకు ఘటాదిపదార్థములతోడి సంబంధమువలనఁ గలిగెడిజ్ఞానమునకుఁ బ్రత్యక్షమని వ్యవహారము.

ఆత్మ మనస్సుతోడను, మనస్సు చక్షురాదీంద్రియములతోడను, నింద్రియములు వస్తువులతోడను గలియుటచేఁ బ్రత్యక్షజ్ఞానముదయించునని నైయాయికమతమున జ్ఞానోత్పత్తిక్రమంబు నిరూపింపఁబడియున్నది. ఇందలి యాత్మమనస్సంయోగము సర్వజ్ఞానసాధారణకారణము. ఇంద్రియమనస్సంయోగము తత్తదింద్రియజన్యసకలప్రత్యక్షసాధారణకారణము. ఇంద్రియార్థసంయోగము తత్తదింద్రియజన్యప్రత్యక్షవిశేషంబులకు విశేషకారణము. కావున న్యాయమతమునఁ బయిరీతిని జ్ఞానోత్పత్తిక్రమము నిరూపింపఁబడియున్నను నింద్రియార్థసన్నికర్షమే కారణముగ సూత్రమున గ్రహింపఁబడినది.

ఈ ప్రత్యక్షము నిర్వికల్పకమనియు, సవికల్పకమనియు ద్వివిధంబు. నిర్వికల్పకమన వస్తుస్వరూపమును మాత్రము భాసిల్లఁజేయుజ్ఞానము. సవికల్పకమన విశేషణవిశేష్యభావావగాహిజ్ఞానము. 'భూతలమున ఘట మున్నది' యను నీజ్ఞానమున భూతలము విశేషణముగను, ఘటము విశేష్యముగను భాసిల్లుచుండును. ఈనిర్వికల్పకసవికల్పకములే సూత్రమున "నవ్యపదేశ్య" "వ్యవసాయాత్మక" పదములచే నిర్దేశింపఁబడినవి.

లోకంబునఁ బదార్థంబులన్నియు శబ్దములచేఁ జెప్పఁబడునపుడు 'గౌరిత్యర్థః, అశ్వ ఇత్యర్థః' అని యారీతిని సామానాధికరణ్య (అభేదనిర్దేశ) ముండుటంజేసి శబ్దార్థముల కభే

దము సిద్ధించుచున్నది. కాఁగా 'నిది ఘటము' (అయంఘటః) మున్నగుజ్ఞానంబులందెల్ల నర్థముతోపాటు శబ్దముగూడ విశేషణరూపమున భాసిల్లుచునే యుండుటచే వస్తుస్వరూపమాత్రావగాహియగు నిర్వికల్పకజ్ఞానమే యుండదని స్ఫురింపవచ్చును. కాని శబ్దార్థంబుల కభేదంబు దుర్ఘటంబు. శబ్దార్థముల కభేదమే యున్నయెడ రూపశబ్దశ్రవణమాత్రమున నంధునకు నీలాదిరూపప్రత్యక్షమును గలుగవలసియుండును అయ్యది యనుభవవిరుద్ధంబు. మఱియు నీశబ్దమున కిది యర్థమని యెఱుంగఁజాలనిపసిపిల్లలకును నింద్రియార్థసన్నికర్షంబున వస్తుస్వరూపమాత్రజ్ఞాన ముదయించుచుండుట యనుభవసిద్ధంబు. ఈపసిబాలురకువలెనే ప్రాజ్ఞులకును నింద్రియార్థసంబంధము గలిగినతోడనే వస్తుస్వరూపమాత్రజ్ఞానమే యుదయించును. ఈ జ్ఞానమున శబ్దము భాసిల్లనేరదు. ఇటు లుదయించినజ్ఞానమును బరులకుఁ దెలుపునవసరమున దీనిని బోధింపఁగలిగిన యితర శబ్దము లేకుండుటచే వస్తుబోధకములగుఘటాదిశబ్దములకే 'ఇతి' యనుపదమును జేర్చి 'ఘట ఇతి జానామి' అను మొదలగురీతిని వ్యవహరించుట సంభవించినది. కాఁగా శబ్దము వ్యవహారమునందుమాత్రము భాసిల్లుచుండును. దీనింబట్టి నిర్వికల్పక ప్రత్యక్షమున్నట్లు తేలుచున్నది.

గ్రీష్మకాలమున సూర్యకిరణములు భూమిపయిఁ బ్రసరించుచుఁ దప్తమగుభూమినుండి వెలువడునూష్మంబుతోఁ గలిసి

చలించుచుండును. పురుషుఁడీయెండమావులను దూరమునుండి చూచినతోడనే యింద్రియార్థసన్నికర్షమువలన నయ్యది యుదకమనుజ్ఞాన ముదయించును. ఆజ్ఞాన మీసూత్రమున నిరూపింపఁబడిన ప్రత్యక్షము కాకుండుటకై యవ్యభిచారి యనువిశేషణము గ్రహింపఁబడినది. ఒకదానిని మఱొకటిగాఁ దెలిసికొనుట వ్యభిచారిజ్ఞానము. ఇంతియగాక యనుమానాది ప్రమాణములకంటెఁ బ్రత్యక్షప్రమాణమునకుఁగల యొకవిశేషమును సూచించుటయు నీవిశేషణమునకు ఫల మనఁదగును. ధూమమువలన వహ్ని ననుమానించునపుడు ముందుగ ధూమము తెలిసియేయుండవలయును. ఇట్లే యుపమానప్రమాణమున గవయమృగమున కుండెడిగోసాదృశ్యము ముందుగఁ దెలియకున్నచో గవయశబ్దార్థజ్ఞానము గలుగనేరదు. మఱియు శబ్దప్రమాణమందును శబ్దము శ్రావణప్రత్యక్షవిషయముగాకున్నచో (వినఁబడనిచో) నర్థజ్ఞానము గలుగఁజాలదు. కావున నీమూఁడుప్రమాణములును ముందుగఁ దాము తెలియఁబడియే వస్తుజ్ఞానమును గలిగించుచుండును. ప్రత్యక్షప్రమాణం బట్టిది గాదు. మన కగపడకుండెడిసూక్ష్మరూపముగల చక్షురాదీంద్రియములు మనకున్నట్లు ముందుగఁ దెలియకుండఁగనే మనము చక్షురాదులచే వస్తువుల గ్రహింపఁగలుగుదుము. వస్తుజ్ఞానానంతరము చక్షురాదులస్థితి యూహింపఁబడును. కావునఁ జక్షురాదులు సత్తామాత్రంబుననే ముందుగఁ దెలియఁబడనక్కఱలేకయే జ్ఞానజనకంబులగును. కాఁగా ననుమానాదులు, అను

మిథ్యాదిజ్ఞానములను గలిగించుటకుముందే యవ్యభిచారులుగ నిశ్చయింపఁబడవలెను. చక్షురాదులు జ్ఞానమును గలిగించిన పిమ్మటఁగాని యవ్యభిచారులని నిశ్చయింప వలనుపడదు. ఇదియే యితర ప్రమాణములకంటెఁ బ్రత్యక్షమునకుఁ గలవిశేషము.

ఒకప్పుడు మనుజుఁడు కనుచీఁకటిలో దూరముననుండి యొకవస్తువును జూచునపుడు స్థాణువా, పురుషుఁడా యని సంశయించును. ఇట్టి సంశయజ్ఞానము ప్రత్యక్షజ్ఞానముగాదని తెలుపుటకయి "వ్యవసాయాత్మక" మనువిశేషణము ప్రయుక్త మయినది. సంశయము మానసిక (ఆత్మమనస్సంయోగమాత్ర జన్య)మై యుండునుగాని యింద్రియార్థసన్నికర్ష జన్యముగాదు గాన సంశయవ్యావృత్తికయి వ్యవసాయాత్మకమనువిశేషణ మును గ్రహింపఁ బనిలేదని శంకింపవలదు. నిశ్చయ (వ్యవసాయ) జ్ఞాన మింద్రియార్థసన్నికర్ష జన్యమయి పిదప మనస్సుచే నెట్లను సంధింపఁబడునో యటులనే గొన్నిసంశయములును దొలుత నింద్రియార్థసన్నికర్షమువల్లనే యుదయించి పిమ్మట మనస్సుచే ననుసంధింపఁబడు చుండును. సంశయములన్నియు మానసిక ములేయన్నచో నంధునకును స్థాణువా, పురుషుఁడా యను మున్నగుసంశయము లుదయింపవలసివచ్చును. ఇటులే బధిరు నకును వేణునాదమా, వీణాధ్వనియా యనుమున్నగుసంశ యము లుదయింపవలసివచ్చును. కావున సంశయములకు వ్యావర్తకముగ నీవిశేషణ మావశ్యకము.

ఆత్మ, సుఖాదిప్రత్యక్షములు మనోరూపేంద్రియమునకును నాత్మాదిరూపవస్తువునకునుగల సన్నికర్షముచే నుదయించినవేగాన వానియందును నీలక్షణము నిర్బాధకముగఁ బ్రవర్తించును. మనస్సుగూడ నింద్రియమేయయినచో దానిని జక్షురాదీంద్రియవర్గంబునఁ జేర్పక వేఱుగ నిరూపింప నేల యని శంక పొడమవచ్చును. కాని చక్షురాదీంద్రియములు పృథివ్యాదిభూతములవలనఁ బుట్టినవి. కావుననే యనిత్యములు. ఇదిగాక చక్షురింద్రియము రూపాదులను గ్రహింపఁగలిగినను గంధాదులను గ్రహింపఁజాలదు. ఘ్రాణేంద్రియము గంధమును గ్రహింపఁగలిగినను రూపాదులను గ్రహింపఁజాలదు. ఇట్లు చక్షురాదులు పరిమితవిషయములు. మఱియు సాధారణముగఁ జక్షురాదులు తమయందు లేనిగుణములను గ్రహింపనేరవు. ఉన్నవానిలోనయినఁ గొన్నిటినిమాత్రమే గ్రహింపఁగలుగును. మనస్సు భౌతికముగాదు నిత్యము. మనస్సంబంధము లేనిచో, నేజ్ఞానమును నుదయింపదు గాన మనస్సు సర్వవిషయకము. ఇట్లు చక్షురాదులకును మనస్సునకును గలభేదమును బట్టి, యింద్రియమయినను మనస్సు చక్షురాదులకంటె వేఱుగ నిరూపింపఁబడినది. ఇతరతంత్రకర్తలును మనస్సు నింద్రియముగనే యంగీకరించిరి.

ఇఁక ననుమానస్వరూపంబు నిరూపింపఁబడును.

**సూ:—అనుమానంబు ప్రత్యక్షపూర్వకంబయి పూర్వవత్తు, శేషవత్తు, సామాన్యదృష్టంబు నని త్రివిధంబయ్యెడు.—౫.**

పురుషుఁడు మహానసాదు (పాకశాలాదు) లందుఁ బలుమాఱు వహ్నిధూమములఁ జూచి, వాని నియతసంబంధమును గ్రహించి, పిమ్మటఁ బర్వతప్రాంతమున కేఁగినపు డచ్చో ధూమ మగపడినయెడ ధూమమునకు వహ్నితోడి నియతసంబంధమును స్మరించుకొని, వహ్నితో నియతసంబంధముగలధూమ మిచటఁ గలదని నిశ్చయించుకొని, యీనిశ్చయమువలన నీపర్వతమున వహ్ని గలదని తెలిసికొనును. ఇట్లు తెలిసికొనుటయే యనుమితి యనంబడును. ఈయనుమితికిఁ గారణమగు 'వహ్నితో నియతసంబంధముగలధూమ మిటఁ గల' దనునిశ్చయమే యనుమానప్రమాణము

అనుమాన స్వరూపము.

ఈనిశ్చయము గలుగవలయునన్న మహానసాదులందలి వహ్ని ధూమముల (సాధ్య హేతువు (లింగము) ల) నియతసంబంధప్రత్యక్షమును బర్వతీయ ధూమ (లింగ) ప్రత్యక్షమును ముందుగఁ గలుగవలయును. కావున ననుమానప్రమాణ మీ రెండుప్రత్యక్షములవలన నుదయించును. ఇట సాధ్య హేతువుల, నియతసంబంధస్మరణమును హేతుప్రత్యక్షమునుమాత్రమే యనుమానప్రమాణమని కొందఱందురు. ప్రత్యక్షమగు హేతు వనుమానప్రమాణ మనియు మఱికొందఱమతము. ఎచటఁ గారణముచేఁ గార్యము నూహింతుమో యట్టి యనుమానంబు పూర్వ (కారణ) వత్త నంబడును. గగనమున మేఘోన్నతిని గాంచి వర్షముగురియు

తత్పూర్వకము.

పూర్వవత్తు.

నని యూహింతుము. ఇటఁ గారణమగు మేఘముచేఁ గార్యమగువర్షము నూహింతుము. ఇచట మేఘదర్శన మనుమాన ప్రమాణము. ఇందు వర్ష కారణమగు మేఘము భాసిల్లుచుండుటచే నిది పూర్వవ త్తనంబడును.

శేషవత్తు.

ఎచటఁ గార్యముచేఁ గారణము నూహింతుమో యట్టి యనుమానంబు శేష (కార్య) వ త్తనంబడును. నది యందలిఁ బూర్ణముగఁ బ్రవహించు క్రొత్తనీటిని జూచి వర్షములుగురిసిన ట్లూహింతుము. ఇట నూతనోదకదర్శనమే యనుమాన ప్రమాణము. ఇందు వర్షకార్యమగు నూతనోదకము భాసిల్లుచుండుటచే నిది శేష (కార్య) వ త్తగుచున్నది.

సామాన్య దృష్టంబు.

కార్యకారణములకంటె భిన్నమగు హేతువుగల యనుమానంబు సామాన్యదృష్టంబని వ్యవహరింపఁబడును. ప్రాతఃకాలమునఁ దూర్పున నగపడు సూర్యుఁడు సాయంతనమునఁ బడమటిదిశ నగపడుచుండుటచే సూర్యునికి గమనము గలదని యూహింతుము. ఒకచోనుండిన సూర్యుఁడు వేఱొకచో నగపడుట సూర్యునిగమనము నూహించుటకుఁ గారణమయినను నిట సాధ్యమగుగమనమునకుఁ గారణముగాని కార్యముగాని కానేరదు. లోకమున నొకచో నుండినమనుజుఁడు గమనములేకుండ నింకొకచో నగపడుట సంభవింపదు

గానఁ దత్సామాన్య (సామ్య) మునుబట్టి యీయనుమానంబు ప్రవర్తించుటచే నియ్యది సామాన్యదృష్టంబని వ్యవహరింపఁ బడుచుండును. మనుష్యులలో శూరు లెవరని పరిశీలించునెడ బ్రాహ్మణులు వైశ్యులు శూద్రులును శూరులుగారని చెప్పి నంతనే క్షత్త్రియులే శూరులని తేటపడును. ఇయ్యది పరిశేషానుమానము. ఇచట హేతువగుపరిశేషము (మిగులుట) సాధ్యమగుశూరత్వమునకుఁ గారణముగాని కార్యముగాని కాకుండుటచే లక్షణమునుబట్టి యిదియును సామాన్యదృష్టంబె యగును.

లేదా పూర్వవత్తను నెడఁ బూర్వశబ్దమునకు లక్షణచేఁ గార్యవత్తనియుఁ, గారణవత్తనియు నర్థము చేయనగును. కాఁగాఁ గార్యలింగకానుమానమును గారణలింగకానుమానమును బూర్వవత్తు లనంబడును శేషవత్తనఁ బరిశేషానుమానము. సామాన్యదృష్టంబను నెడ నీపక్షమున నయితము వెనుకటియర్థమునే గ్రహింపవలయును. ఉదాహరణములు తొల్లిటివే యగుచుండును.

**సూ:—శబ్దంబులయర్థజ్ఞానంబున కుపకరించు ప్రసిద్ధసాధర్మ్యం బుపమానంబు.—౬.**

గవయశబ్దార్థము నెఱుంగనిమనుజుఁ డాప్తులవలన గవయము గోసదృశమై యుండునని తెలిసికొనును. పిమ్మట నాత

నికి గవయమృగ మగపడినపుడు దాని గోసాదృశ్యమునుబట్టి యిదియే గవయశబ్దార్థమని నిర్ణయించుకొనును. ఇటులే భృంగరాజము గుంటగలగరనుబోలియుండునని తెలిసినచో భృంగరాజశబ్దార్థము సుబోధమగును.

ఉపమాన స్వరూపము.

**సూ:—ఆప్తోపదేశంబు శబ్దప్రమాణంబు.—౭.**

పదార్థములను బ్రమాణంబున బాగుగఁ దెలిసికొని తనకుఁ దెలిసినది దెలిసినరీతిగ నితరులకు బోధింప నెంచి యుపదేశించువాఁ డాప్తుఁడు. ఆప్తి యనఁ బదార్థసాక్షాత్కారము. అదిగలవాఁడగుటచే నిట్టివాని కాప్తుఁడని వ్యవహారము. తాముచూచినదానిని దెలుపుటలో ఋషులుగాని తదితరులగుపండితులుగాని పామరులుగాని యెవ్వరయినను నాప్తులే యగుదురు. ఇట్టి యాప్తులయుపదేశమే శబ్దప్రమాణంబు.

శబ్దస్వరూపము.

**సూ:—ఇయ్యది దృష్టార్థం బదృష్టార్థంబు నని ద్వివిధంబు.—౮.**

ఈలోకంబున నగపడుపదార్థంబుల బోధించుశబ్దంబు దృష్టార్థంబు. అదృష్టార్థం బనఁ బారలౌకికమును బోధించునది. అదృష్టార్థబోధనంబున ఋషులశబ్దమే ప్రమాణముగఁ బరిగ్రహింపఁదగును. దృష్టార్థ మెటులఁ బ్రత్యక్షప్రమాణముచే నిశ్చయింపఁబడునో యటులనే యదృష్టార్థముగూడ ననుమాన

ప్రమాణముచే నిశ్చయింపఁబడును గాన దృష్టార్థబోధక మగు శబ్దమువలె నదృష్టార్థబోధకశబ్దంబుగూడఁ బ్రమాణమే యని యెఱుంగునది.

లోకంబున వ్యవహారంబులన్నియుఁ బయిని నిరూపింపఁబడిన ప్రమాణచతుష్టయంబువలననే ప్రవర్తించుచుండును గానఁ బ్రమాణస్వరూపపరిజ్ఞాన మత్యావశ్యకము.

ప్రమాణలక్షణప్రకరణము

సమాప్తము.

---

III

పూర్వోక్తంబులగు ప్రమాణంబులచేఁ దెలియఁదగిన ప్రమేయంబు లిఁక నిరూపింపఁబడును.

**సూ:—ఆత్మ,శరీరే,ంద్రియా,ర్థ,బుద్ధి,మనః,ప్రవృత్తి, దోష,ప్రేత్యభావ,ఫల,దుఃఖా,పవర్గంబులు ప్రమేయంబులు—౯**

సకలసుఖదుఃఖసాధనంబులఁ దెలిసికొని వానినిబరిగ్రహించి సుఖదుఃఖముల ననుభవించునది 'యాత్మ' యనఁబడును. 'ఆత్మ' సుఖదుఃఖముల ననుభవించుటకుఁ దగినస్థానమే 'శరీరము.' 'ఇంద్రియములు' విషయానుభవద్వారమున సుఖదుఃఖానుభవసాధనములు. గంధాదివిషయము 'లర్థము' లనంబడును. పదార్థానుభవంబును సుఖదుఃఖానుభవంబును 'బుద్ధి'

యనంబడును. 'మనస్సు'నఁగా సర్వార్థగ్రాహకం బగునంతరింద్రియంబు. 'ప్రవృత్తి'యు 'దోషంబు'లును శరీరేంద్రియార్థబుద్ధి సుఖదుఃఖంబుల సంపాదనంబునకు సాధనంబులు. ఆత్మకు శరీర సంబంధ మనాదిగానుండును. ఆత్మ యొకశరీరమునువిడిచి వేఱొకశరీరము నాశ్రయించుచుండును ఇదియే 'ప్రేత్యభావము' ఆత్మశరీరముల కీసంబంధము మోక్షపర్యంతము నను వర్తింపక తప్పదు. 'ఫలంబన' నసాధనం బగుసుఖదుఃఖంబుల యనుభవంబు.

ఈసూత్రంబునఁ బ్రమేయగణమున దుఃఖమునుమాత్రము చేర్చి సుఖమును జేర్పకుండుటవలన సాంసారికసుఖము బొత్తుగా లేదని తలంపరాదు. అదియున్నను దఱుచుగ దుఃఖమిశ్రితమగుచునే యుండునుగాన నదియు దుఃఖమే యని భావింపవలయు ననుతలంపున నయ్యది వేఱుగ నిరూపింపఁబడదయ్యె. ఇట్టిభావనచే సుఖమందును దత్సాధనంబులగువస్తువులందును ననాదరముగలుగును. దానింబట్టి వైరాగ్యము స్థిరపడును.అద్దాన జననమరణప్రవాహ ముచ్ఛిన్నంబగును. తదుచ్ఛేదంబున సకలదుఃఖాత్యంతికవినాశరూపంబగు నపవర్గంబు సిద్ధించును.

ఏపదార్థంబుల మిథ్యాజ్ఞానంబుచే సంసారంబును వేనితత్త్వజ్ఞానంబున నిశ్శ్రేయసంబును బ్రాప్తంబులగునో యయ్యవి మాత్రమే యిటఁ బ్రమేయములుగ నిరూపింపఁబడినవి. అసంఖ్యాకభేదంబులుగల యితరంబులగు ద్రవ్యగుణకర్మసామాన్య

విశేషసమవాయంబులు ప్రమేయంబులయ్యును వానిమిథ్యాజ్ఞానతత్త్వజ్ఞానంబులు సంసారాపవర్గంబులకుఁ బ్రాపకంబులు గాకుండుటచే నిట నుపేక్షింపఁబడినవని యెఱుంగవలయును.

ఆత్మను బ్రత్యక్షమువలన స్పష్టముగఁ దెలిసికొనఁ జాలము. అయినను నాప్తోపదేశంబువలనను ననుమానప్రమాణంబువలనను దెలియవచ్చును.

**సూ:—ఇచ్ఛాద్వేషప్రయత్నసుఖదుఃఖజ్ఞానంబు లాత్మసత్తాజ్ఞాపకంబులు—౧౦**

**ఆత్మనిరూపణము.**

మనుజుఁడు లోకమున నేవస్తువువలనఁ దాను సుఖము ననుభవించెనో యట్టిదానిని మరలఁ జూచినపుడు దానిని స్వీకరింప నభిలషించును. ఇట్టి యభిలాషవలన నిప్పటివస్తువును జూచునదియుఁ బూర్వ మనుభవింపఁబడినదానిని స్మరించునదియు నేదో యొకస్థిరమగుపదార్థ ముండితీఱవలయునని తెలియఁగలము

**నాస్తికమతము.**

నాస్తికులు స్థిరమగునాత్మ లేదనియుఁ, బృథివ్యప్తేజోవాయువులు శరీరరూపముగఁ బరిణతములయినపుడు కొన్నివస్తువుల సమ్మేళనమువలన విలక్షణశక్తి, యుద్భవించునట్లు జ్ఞాన ముదయించుననియు, నయ్యది క్షణికమనియుఁ, బూర్వపూర్వవిజ్ఞానములవలన నుత్తరోత్తరవిజ్ఞానములు పుట్టి లయ(మరణ)పర్యం

తము ధారారూపముగ ననువర్తించుచుండుననియు, నిట్టిక్షణికవిజ్ఞానమే యాత్మ యనియు నిరూపించియుండిరి.

ఖండనము. వారిమతమున స్థిరమగునాత్మ లేకుండుటచే నిపుడొక వస్తువును జూచి కాలాంతరానుభూతమగు తత్తుల్యమును స్మరించుట పొసంగనేరదు. లోకంబున ననుభవస్మరణంబులు తప్పక యేకకర్తృకంబులే యగునుగాన నొకఁ డనుభవించిన వస్తువును వేఱొకఁడు స్మరించుట సంభవింపనేరదు.

పూర్వపక్షము. నాస్తికమతమున స్థిరమగునాత్మ లేకున్నను మడుఁగు దోవతుల దొంతరలో నడుగుదోవతియందలి పరిమళముపయి దోవతులన్నిటియందును, మృత్తునందలి నునుపుఘటమునందును సంక్రమించినటులఁ గారణమగు పూర్వవిజ్ఞానమునందలి సంస్కారములు కార్యమగు నుత్తరవిజ్ఞానమునందు సంక్రమించుటచే స్మరణము సంభవింపరాదా యని శంకింపవలదు.

సమాధానము. వారిమతమున నుత్తరవిజ్ఞానముదయించునప్పటికిఁ బూర్వవిజ్ఞానము నశించుటచే దొంతిలోనిదోవతులకువలెను మృద్ఘటములకువలెను నీపూర్వోత్తరవిజ్ఞానములకు సంబంధములేకుండుటచేఁ బరిమళము, నునుపు, సంక్రమించునటుల సంస్కారసంక్రమణము సంభవింపదు.

పూర్వపక్షము. సంస్కారములు సంక్రమింపకున్నను బూర్వవిజ్ఞానము వలన నుదయించెడియుత్తరవిజ్ఞానము కాలాంతరానుభూతవస్తువును స్మరించుటకుఁ దగిన శక్తిగలదిగనే యుదయింపరాదా యనియు శంకింప వలనుపడదు.

సమాధానము. లోకమున సంబంధములేనివస్తువులకుఁ గార్యకారణభావము దుర్ఘటముగానఁ బూర్వవిజ్ఞానముచే నుత్తరవిజ్ఞానముదయించుటకే యవకాశము గానరాదు. దీనిచే క్షణికవిజ్ఞానమే యాత్మయను (నాస్తిక)మతము నిరాకరింపఁబడినది. ఈ క్షణభంగవాదము నితరములగు దేహాత్మవాదము స్వభావవాదము శూన్యవాదము మున్నగు నాస్తికవాదములెల్ల మున్ముందు (అధ్యా 3-ఆహ్ని 1) విపులముగ విమర్శింపఁబడును.

కావున మనుజుఁ డొకవస్తువుఁ జూచి యది సుఖసాధనమని తత్తుల్యస్మరణముచే నెఱింగి దాని నిచ్ఛయించుచుండుటచే స్థిరమగునాత్మ యుండకతప్పదని తేలుచున్నది. ఇట్లే యొకవస్తువును జూచి యది దుఃఖసాధనమని తత్తుల్యస్మరణముచేఁ దెలిసికొని దానిని ద్వేషించును. ఇటు లిచ్ఛయించి సుఖసాధనమును బరిగ్రహించుటకును ద్వేషించి దుఃఖసాధనమును బరిత్యజించుటకును బ్రయత్నించును. ఇట్లు యత్నించి సుఖసాధనపరిగ్రహముచే సుఖమును బొందును. దుఃఖసాధనమని యొకదాని నెఱింగియు నద్దానఁ గలుగుసుఖలేశము

నాసించి మోహితుఁడై తానున్న దుఃఖమును గణింపక దానిని బరిగ్రహించినచో దుఃఖము నొందును. మఱియు నేదే నొక వస్తువును దెలిసికొనఁదలఁచి దానిని విమర్శించి తత్స్వరూప మును దెలిసికొనును. కాఁగా మనుజునికిఁగల యిచ్ఛ, ద్వేషము, ప్రయత్నము, సుఖము, దుఃఖము, జ్ఞానము ననునివి యన్నియు స్థిరమగునాత్మ గలదని స్థాపింపఁజాలియున్నవి

**సూ:—** చేష్టేంద్రియార్థాశ్రయంబు శరీరంబు—౧౧

చేష్ట. మనుజుఁడు దనకిష్టమగువస్తువును స్వీకరింపఁదలంచినను ననిష్టమగువస్తువును బరిహరింపఁదలంచినను దేహమున నొకవిధమగుచలనంబు గలుగును. ఆచలనంబునకే చేష్ట యని వ్యవహారము

ఇంద్రియములు. దేహముండునంతవఱకు దాని నాశ్రయించి పదార్థములను గ్రహించుచు దేహము నశించిన తోడనే నిష్ఫలంబులగునవి యింద్రియంబులు.

అర్థములు. లోకంబునఁ బదార్థంబులెల్ల దేహముండినపుడే సుఖదుఃఖజనకంబు లగుచుండును. కాఁగా నింద్రియంబులు పదార్థంబుల గ్రహింపవలయు నన్నను బదార్థంబులవలన సుఖదుఃఖంబులు గలుగవలయునన్నను శరీర ముండియే తీఱవలయును. దీనిం

బట్టి చేష్టలకుఁగాని, యింద్రియంబులకుఁగాని, యర్థంబులకుఁ గాని యాశ్రయంబు శరీరంబని విశదమగును.

**సూ:—ఘ్రాణ, రసన, చక్షు, స్త్వక్, శ్రోత్రంబు లింద్రియంబులు భూతంబులవలనం గలిగెడును—౧౨**

**సూ:—పృథివ్య ప్తేజోవాయ్వాకాశంబులు భూతంబులు—౧౩**

గంధమును దెలుపునది ఘ్రాణము. రుచులను దెలుపునది రసనము. రూపమును దెలుపునది చక్షువు. స్పర్శను దెలుపునది త్వక్కు. శబ్దమును దెలుపునది శ్రోత్రము. ఈయింద్రియము లయిదిటిలో ఘ్రాణము పృథివినుండియు, రసనము జలమునుండియుఁ, జక్షుస్సు తేజస్సునుండియుఁ, త్వక్కు వాయువునుండియుఁ బుట్టును. శ్రోత్ర మాకాశమువలన నేర్పడును.

ఇంద్రియములన్నియు నహంకారమువలననే పుట్టుననియుఁ గారణంబగునహంకారంబునకును గార్యంబులగునింద్రియంబులకును నభేదమనియు సాంఖ్యులసిద్ధాంతము. వారిమతమున 'ఘ్రాణము గంధమునే గ్రహించు'ననియు 'శ్రోత్రము శబ్దమునే గ్రహించు'ననియు నిట్టి నియమంబున కుపపత్తి గానరాదు. కారణంబగునహంకారము సర్వగ్రాహకంబగుటచేఁ దత్కార్యంబులై తదభిన్నంబులగు ఘ్రాణాదులును సర్వగ్రాహకంబులు గావలసియుండును.

న్యాయమతమునఁ బృథివీజన్యమగు ఘ్రాణము పృథివికసాధారణధర్మమగు గంధమునుమాత్రము గ్రహించుటయు

నిటులే యాకాశమువలన నేర్పడిన శ్రోత్రేంద్రియ మాకాశమున కసాధారణధర్మంబగుశబ్దమునుమాత్రము గ్రహించుటయు నిట్టినియమం బుపపన్నమగుచుండుటంజేసి యింద్రియంబులకు భూతజన్యత్వమే యంగీకరింపఁబడినది.

**సూ:—గంధరసరూపస్పర్శశబ్దంబులు పృథివ్యాదుల గుణంబులు ఘ్రాణాదులవిషయంబులు—౧౪**

స్పష్టము.—

**సూ:—బుద్ధ్యుపలబ్ధిజ్ఞానంబు లభిన్నంబులు—౧౫**

లోకంబున బుద్ధి, యుపలబ్ధి, జ్ఞానంబు ననుశబ్దంబులు సమానార్థకంబులు. ఉపలబ్ధిజ్ఞానశబ్దంబులు బుద్ధినే ముఖ్యముగ బోధించుచుండుటచే నసాధారణంబులు గాన నివియే బుద్ధికి లక్షణంబులుగ నెఱుంగవలయును. బుద్ధికి సర్వవ్యవహారహేతుత్వమును లక్షణంబుగ నిరూపించుట కవకాశ ముండినను నిట సాంఖ్యమతనిరాకరణంబుగూడ వివక్షితమగుటంజేసి పర్యాయశబ్దంబులే లక్షణములుగ నిర్దేశింపఁబడినవి.

సాంఖ్యులు బుద్ధి యన నచేతనమగు నంతఃకరణమనియు, 'అయం ఘటః' అనుజ్ఞానము బుద్ధిధర్మమనియు, 'ఘటమహం జానామి' అను నుపలబ్ధి (అనువ్యవసాయము) యాత్మధర్మమనియు నిరూపించియుండిరి.

లోకంబున బుద్ధిజ్ఞానశబ్దంబులు ఘటకలశపదంబులుంబోలెఁ (బుద్ధిహీన=జ్ఞానశూన్య) బర్యాయంబులగుటచే నభిన్నం

బులగు బుద్ధిజ్ఞానంబులకు ధర్మిధర్మభావకల్పన మసంగతము. ఇవి గాక జ్ఞానము బుద్ధిధర్మమనునెడ బుద్ధి చేతన మనవలసియుండును. అట్లన్నచో నొకదేహమున బుద్ధియు నాత్మయు నను రెండు చేతనము లున్నట్లంగీకరింపవలసివచ్చును. అటు లంగీకరించినను బుద్ధికిఁ గలిగినజ్ఞానమును నాత్మ యనుసంధించుట పొసంగదు ఒక చేతనమునకుఁ గలిగినజ్ఞానమును వేఱొక చేతన మనుసంధించుట యసంభవముగదా!

**సూ:—జ్ఞానంబులయుగపదనుత్పత్తి మనసస్త్త్వాజ్ఞాపకంబు—౧౬**

ఘ్రాణేంద్రియమునకు గంధముతోడను, రసనేంద్రియమునకు రసముతోడను, చక్షురింద్రియమునకు రూపముతోడను సంబంధ మొకేక్షణమునఁ గలిగినను గంధ, రస, రూపజ్ఞానంబులు మూఁడును నొక్కక్షణమునఁ గలుగనేరవు. ఆమూఁడును వేర్వేఱుక్షణములందే యుదయించును. అయినను నిట్టిజ్ఞానములు పుట్టుటకుఁ గలకాలవ్యవధాన మత్యల్పమగుటచే మనము దానిని గుఱుతింపఁజాలముగాన నీజ్ఞానములొకేసారి యుదయించుచున్నటులు భ్రాంతిపడుచుందుము. కలువతేకులదొంతరపయిని సూదిగ్రుచ్చినచో తేకులన్నింటను రంధ్రము లేర్పడును. అందుఁ బయితేకునకు రంధ్ర మేర్పడిన కాలమునకును రెండవతేకున రంధ్ర మేర్పడినకాలమునకును నేకొంతయో వ్యవధి యుండకతీఱదు. ఆసూక్ష్మవ్యవధానము మనకు దుర్గ్రాహము. ఇటులే విభిన్నక్షణోత్పన్నములగుజ్ఞాన

ముల కాలభేదము దుర్లక్షమయి యుండును. ఇట్లు జ్ఞానంబులకు యుగపదుత్పత్తి లేకుండుటకు నింద్రియముల కనేకములకు మనస్సుతో యుగపత్సంబంధము లేకుండుటయే కారణము. అణుపరిమాణం బగుమనస్సున కింద్రియములు పెక్కిటితో నొక్కమాఱు సంబంధము దుర్ఘటము. ఇంద్రియార్థసన్నికర్షమున్నను జ్ఞానంబులయుగపదనుత్పత్తిచే బాహ్యేంద్రియాతిరిక్తమగు నంతరింద్రియ మొకటిగలదని యూహింపవచ్చును. అదియే మనస్సని యెఱుంగునది.

మఱియు నాత్మకు బాహ్యప్రత్యక్షము లుదయించునెడఁ జక్షురాదిబాహ్యేంద్రియము లెట్లు సాధనములగుచుండునో యటులే బాహ్యేంద్రియనిరపేక్షంబులగు సుఖదుఃఖాదిప్రత్యక్షంబులకును, స్వాప్నికజ్ఞానంబులకును, స్మృత్యాదులకును సాధనంబుగ నొకయంతరింద్రియము నంగీకరింపకతీఱదు.

మతాంతరములు. మనస్సు పద్మమువలె సంకోచవికాసశాలియగువస్తువనియు నయ్యది సంకుచితమగునపు డొక్కొక యింద్రియముతో మాత్రమే సంబంధించుటకనువుపడునుగాన నట్టియెడ జ్ఞానంబులకుఁ గ్రమికోత్పత్తి యనియు, వికసితమగునపు డనేకేంద్రియములతో నొక్కమాఱుగ సంబంధించుట కవకాశ ముండునుగాన నట్టియెడ జ్ఞానంబుల యుగపదుత్పత్తి సంభవించుననియుఁ గొందఱమతము. మనస్సు ఘృతాదులంబోలి ద్రవించుటకును ఘనీభవించుటకును దగినస్వభావము గలపదార్థమని మఱి

కొందఱమతము. ఈమతంబులందు స్వాప్నికజ్ఞానాదులే మనస్సత్త్వాజ్ఞాపకంబులని యెఱుంగవలయు.

**సూ:—మనోవాక్కాయంబులవ్యాపారంబు ప్రవృత్తినాఁబడు—౧౭.**

మనస్సు, వాక్కు, శరీరము ననువీనివలనఁ గలుగు వ్యాపారంబునకుఁ బ్రవృత్తి యని వ్యవహారము. ఈప్రవృత్తి వలననే పుణ్యపాపంబులు గలుగుచుండును. మానసికములు, వాచికములు, శారీరకములునగు పుణ్యపాపప్రవృత్తులస్వరూపంబు ద్వితీయసూత్రంబున వివరింపఁబడినది.

**సూ:—దోషంబులు ప్రవర్తకంబులు—౧౮.**

రాగద్వేషాదులు పురుషునిఁ బుణ్యపాపంబులఁ బ్రవర్తింపఁజేయును. ఇయ్యవి మిథ్యాజ్ఞానమూలకంబులు. రాగద్వేషాదులు ప్రవృత్తిహేతువులని సర్వవిదితంబయినను వీనిని దోషంబులుగ లోకంబు భావింపదుగాన నయ్యవి దోషంబులని బోధించుట కీలక్షణము నిరూపింపఁబడినది.

**సూ:—పునరుత్పత్తి ప్రేత్యభావంబు—౧౯.**

కర్మవశమున నాత్మ, దేహేంద్రియాదులఁ బరిగ్రహించి యొకచోఁ గొంత కాలము సుఖదుఃఖముల ననుభవించి యాదేహేంద్రియాదులఁ బరిత్యజించి వేఱొకచో మరల దేహాదులఁ బరిగ్రహించుచుండును. ఈజననమరణప్రవాహమున కాది గానరాదు. మోక్షపర్యంతము నిది యనువర్తించును.

**సూ:—ప్రవృత్తి, దోషప్రాప్తంబు సుఖాదికంబు ఫలం బనాఁబడు—౨౦.**

సుఖదుఃఖంబులు ప్రవృత్తి(కర్మ)వలనఁ గలుగుచుండును. కావున నివి ప్రవృత్తిఫలంబులు. శరీరము, నింద్రియములు, నింద్రియార్థములు, బుద్ధియు లేకున్నచో సుఖదుఃఖానుభవము గలుగనేరదు. కావున శరీరాదులు సుఖాద్యనుభవసాధనంబు లయ్యును జన్మాంతరములందలి ప్రవృత్తివలనఁ బుట్టినవే యగుటంజేసి యివియును బ్రవృత్తిఫలంబులుగనే పరిగణింపఁ దగును. పురుషుఁడు ప్రవృత్తిఫలంబులగు శరీరాదులఁ బరిగ్రహించుచును బరిత్యజించుచునే యుండును. కావున, నవిచ్ఛిన్నంబులగు శరీరాదిపరిగ్రహపరిత్యాగములతో లోకంబు నిండియుండును రాగద్వేషాదిదోషంబులు ప్రవృత్తిమాత్రమును గలిగించి విరమింపక ఫలోత్పత్తిపర్యంతము పురుషు ననువర్తించుచునే యుండును. కావుననే సుఖాదికము ప్రవృత్తికేగాక దోషంబులకును ఫలంబుగ సూత్రంబున నిరూపింపఁ బడినది.

**సూ:—బాధ దుఃఖంబనాఁబడు—౨౧.**

దుఃఖమును బాధ యని గాని పీడ యని గాని తాప మని గాని వ్యవహరింతురు.

లోకంబున సుఖాదికమెల్ల దుఃఖసంమిశ్రితమే యగుటచే దుఃఖముగనే దానిని భావింపవలయును. ఇట్లు భావించి

నచోఁ బురుషుఁడు దనజన్మంబు సేవగించుకొనును. పిమ్మట విరక్తుఁడగును. విరక్తిచే నపవర్గంబు సిద్ధించును.

**సూ:—దుఃఖాత్యంతికవినాశంబె యపవర్గంబు—౨౨.**

ఉపాత్తమగు దేహమును బరిత్యజించి దేహాంతరమును స్వీకరింపకుండుటయే జన్మరాహిత్యము దీనివలననే దుఃఖము నిశ్శేషముగ నశించును. ఇట్టిదుఃఖవినాశంబే యపవర్గంబు. ఇదియే శాశ్వతంబనియుఁ బరమపురుషార్థంబనియు నిరుపమ కల్యాణంబనియు మోక్షతత్త్వవేత్తలు బోధించియుండిరి.

జీవునకుఁ గలిగెడినిత్యసుఖాభివ్యక్తియే యపవర్గంబని కొందఱ (మీమాంసకుల) మతము. కాని యిట్లు నిత్యసుఖాభివ్యక్తి మోక్షావస్థయందుఁ గలుగుననుటకుఁ దగినప్రమాణము గానరాదు. నిత్యసుఖాభివ్యక్తి యన నిత్యమగుసుఖము ననుభవించుటగదా! ఇట సుఖము నిత్యమనుటకుఁ బ్రమాణ మగపడదు. దుఃఖాదులవలె ననిత్యమనుటకుమాత్ర మవకాశము గలదు. సుఖము నిత్యమని యెట్టటో సమ్మతించినను దదనుభవము గలుగుటకు హేతువును నిరూపింపవలసియుండును. అనుభవముగూడ జన్యముకాక సుఖంబువలె నిత్యమే యగు నన్నచో సంసారమోక్షములకు భేదము దుర్నిరూపమగును. సుఖంబువలెఁ దదనుభవంబుగూడ నిత్యమే యనునెడ మోక్షావస్థయందువలె సంసారమునందును నట్టి నిత్యసుఖానుభవముం డియేతీఱవలయుఁగదా! ఉండునన్నచో సాంసారికదుఃఖాను

భవముతో నీ నిత్యసుఖానుభవమునకు సాహచర్యము (కలి యక) నంగీకరింపవలసివచ్చును. అయ్యది యనుభవవిరుద్ధము. కావున నీసుఖానుభవము నిత్యమనుట సంగతముగాకుండు టచే హేతునిరూపణ మావశ్యకమై యున్నది. యోగాభ్యాస జన్యంబగుపుణ్యంబే యీనిత్యసుఖానుభవంబునకుఁ గారణ మన్నచో నప్పుణ్యంబు గొంతకాలంబునకు నశించెడిదగుటం జేసి యది నశించినవెనుక ముక్తుండు మరల సంసారివోలె నిత్య సుఖానుభవశూన్యుండు గావలసివచ్చును. ముక్తావస్థ యాఱు ననుట కెవ్వరును సమ్మతింపరుగదా! యోగజంబగుపుణ్యంబు నశింపదనుటకుఁ బ్రమాణంబు దుర్లభంబు. ఇతరపుణ్యంబులెల్లఁ గాలక్రమంబున నశించుటంబట్టి యిదియును నశ్వరమే యను టకుమాత్ర మవకాశము గలదు. ఇఁక సుఖమువోలె నను భవంబుగూడ నిత్యంబయినను సంసారావస్థయందలి శరీరసం బంధ మాయనుభవంబునకుఁ బ్రతిబంధకమగుచుండుటచే నయ్యది భాసిల్లనేరదని తలంపరాదా యనియు శంకింపఁజనదు. శరీరసంబంధము నిఖిలసుఖదుఃఖానుభవంబునకు సాధనంబే యగుంగాని ప్రతిబంధకము కాఁజాలదు. ఇది యిటుండ మోక్షావస్థయందు శరీరసంబంధవిరహితం బగునాత్మకు సుఖాను భవము గలుగుననుటయుఁ బొసంగదు. ఆత్మకు సుఖదుఃఖా ద్యనుభవము గలుగవలయునన్న శరీరసంబంధము తప్పదుగదా! ఇఁక మోక్షావస్థయందు సుఖానుభవంబే పొసంగదన్నచో జీవుండు ముక్తికయి యత్నింపనేల యని శంకింపఁదగదు. సాం

సారికదుఃఖము నిశ్శేషముగఁ దొలంగుటకే జీవునియత్నము గాని మోక్షమున నపూర్వంబగుసుఖంబు ననుభవించుటకుఁ గాదు. అదియునుంగాక మోక్షావస్థయందు నిత్యసుఖాభివ్యక్తి గలుగుననియు దానికొఱకే జీవుండు యత్నించుననియు నంగీకరించినచో నట్టిసుఖానుభవమునకు సాధనముగ నిత్యశరీరాదులనుగూడఁ గల్పింపవలసియుండును. శరీరమునకు నిత్యత్వము నిఖిలప్రమాణవిరుద్ధముగదా ! ముక్తునికి సుఖానుభవంబే లేదన్నచో "ముక్తస్సుఖీ భవతి" యనునాగమంబునకు విరోధము సంభవింపదా యనియు శంకింపరాదు. ఇట్టియెడ సుఖశబ్దము దుఃఖాభావమునే బోధించునని యెఱుంగవలయును లోకంబున నేదే నొకబరువుమోయువాఁడు దనబరువును దించినతోడనే "నే నిపుడు సుఖపడితి" నని చెప్పును. అపుడు వానికి బరువుమోయుటవలనఁ గలిగినదుఃఖము నశించినదే గాని వేఱొండుసుఖ ముదయింపలేదు. కాఁగా నిట్టియెడ సుఖశబ్దము దుఃఖాభావపరమగుటయే సుప్రసిద్ధము. మఱియు మోక్షమున నిత్యసుఖానుభవ ముండునన్నచో ముముక్షువునకు నిత్యసుఖమునందు రాగముండుననియు నంగీకరింపవలయును. సుఖరాగముండినపక్షమున ముముక్షువు రాగబద్ధుఁడగును. రాగబంధన మున్నయెడ నయ్యది యొకప్పుడు పురుషుని వైషయిక సుఖంబులందును బ్రవర్తింపఁజేయఁగలుగును. దానంజేసి వైరాగ్యమునకు భంగమువాటిల్లును. కాఁగా ముముక్షువునకు మోక్షమే దూరమగును. దుఃఖాత్యంతికవినాశమే మోక్ష

మను పక్షమున ముముక్షువునకు దేనియెడను రక్తియుండఁ బనిలేదు. ఆతఁడు సాంసారికదుఃఖమును ద్వేషించి యద్దానిని దొలఁగించుకొనుటకుమాత్రము యత్నించును. ఇట్టియెడ నాతనికి దుఃఖద్వేష ముండినను నయ్యది సుఖరాగమువలె వైరాగ్య భంజకము గానేరదు. అంతియగాక విరక్తినే మఱింత బలపఱుచుచుండును.

## ప్రమేయప్రకరణము

సమాప్తము.

---

**సూ:—సమానధర్మోపపత్తి, యనేకధర్మోపపత్తి, విప్రతిపత్తి, యుపలబ్ధ్యవ్యవస్థ, యనుపలబ్ధ్యవ్యవస్థ, యను వీనివలనఁ గలిగెడివిశేషాపేక్షం బగువిమర్శంబు సంశయంబు—౨3.**

పురుషుఁ డేదయిన నొకవస్తువును జూచి దానిస్వరూపంబు నిర్ణయింపఁజాలనియవస్థయందుఁ గలిగెడి యనిశ్చయాత్మకమగుజ్ఞానము సంశయ మనంబడును.

ఒకానొకయెడ ననేకవస్తువులకు సమాన (సాధారణ) మగుధర్మ మగపడినచో సంశయ ముదయించును. స్థాణువునకును బురుషునకును నౌన్నత్యాదులు

**సమానధర్మోపపత్తి.** సమానధర్మములు. ఒకవస్తువును దూరమునుండి చూచినపుడు, దానియౌన్నత్యంబు

గనుంగొని, యావస్తువునకుఁ గలవిశేషధర్మము తెలియకుండుటచే నయ్యది స్థాణుపురుషులలో నెయ్యదియో నిర్ణయింపఁజాలనిమనుజుఁడు తనయెదుటివస్తువు స్థాణువా పురుషుఁడా యని సంశయించును ఇది సమానధర్మోపపత్తి (సాధారణధర్మవత్త్వాజ్ఞానము) వలనఁ గలిగెడిసంశయము.

**అనేకధర్మోపపత్తి.**

ఒకొ్కకపుడు రెండువస్తువులకుఁ గలయసాధారణధర్మమునుబట్టియు సంశయ ముదయింపవచ్చును. స్థాణుపురుషసాధారణమగునౌన్నత్యము తదితరములగు ఘటాదులకు లేదు. కావున నీధర్మము స్థాణుపురుషులకు నసాధారణమగుచున్నది. మనుజుఁ డొకయున్నతవస్తువును దూరమునుండి చూచినపుడు దాని యౌన్నత్యంబు గనుంగొని యీయౌన్నత్యము స్థాణుపురుషులకుఁదప్ప నితరములకు లేదని తలంచి స్థాణుపురుషులకుఁగల విశేషధర్మములలో నొక్కదానినయిన నావస్తువునందు గుఱుతింపలేక యది స్థాణువా పురుషుఁడా యని సంశయించును. ఇది యనేకధర్మోపపత్తి (అనేకస్మాత్, వ్యావర్తకస్య=అసాధారణస్య, ధర్మస్య, ఉపపత్తిః=జ్ఞానమ్=అసాధారణధర్మవత్త్వాజ్ఞానము) వలనఁ గలిగెడిసంశయము.

విప్రతిపత్తియన విరుద్ధార్థబోధకమగు వాక్యద్వయము. ఆత్మగలదని కొందఱును లేదని కొందఱును జెప్పుదురు. ఇటు

నాత్మగలదనియో లేదనియో నిర్ణయించు
విప్రతిపత్తి. టకుఁ దగినహేతువు దెలియనపుడు పయి
వాక్యములనుబట్టి యాత్మగలదా లేదా
యని పురుషుఁడు సంశయించును. ఇది విప్రతిపత్తిజన్యమగు
సంశయము.

చక్షురింద్రియము తటాకాదులందును మరుమరీచికలందును జలమును గ్రహించును. ఇందుఁ దటాకాదులందలి జలము సత్తు. అనఁగా సత్యము (ఉన్నది) మరీచికలం దగపడు
జల మసత్తు. అనఁగా నసత్యము (లేనిది).
ఉపలబ్ధ్యవ్యవస్థ. ఇట్లు చక్షురింద్రియము సదసత్పదార్థముల
రెంటిని గ్రహించుటచే వస్తుగ్రహణ మవ్యవ
స్థితమగుచున్నది. కాఁగాఁ బురుషుఁడు దూరమునుండి జలమును జూచునపుడు దనయింద్రియమువలనఁ గలిగెడియవ్యవస్థితజ్ఞానమును విశ్వసింప వలనుపడక, యచటిజలము సత్యమో యసత్యమో నిర్ణయించుటకుఁ దగినప్రమాణము లభింపక యీయుదకము సత్యమా యసత్యమా యని సంశయించును. ఇది యుపలబ్ధ్యవ్యవస్థవలనఁ (తెలియుట యవ్యవస్థితమగుట వలన) గలిగెడిసంశయము.

మఱియు భూమిపయిని జలములేనిచో మన కగపడదు. ఉన్నను దృణాదులచే నాచ్ఛాదితమగునపుడును గానరాదు. ఇటుఁ జక్షురింద్రియ మొకచో సత్యమగుజలాభావమును వే

అలోకచో నసత్యమగు జలాభావమును గ్రహిం
అనుపలబ్ధ్యవ్యవస్థ. చు చుండుటచే నిట ననుపలబ్ధి (జల మగపడ
కుండుట) యవ్యవస్థిత మగుచున్నది. కావునఁ
బురుషునికిఁ దృణాద్యావృతస్థలములందు జల మగపడనపుడు, నిజముగా నిట జలములేక యగపడలేదా? ఉండియుఁ దృణాద్యావృతమగుటచే నగపడలేదా? యని యాతఁడు సంశయించును. ఇది యనుపలబ్ధ్యవ్యవస్థవలనఁ (తెలియకుండుట యవ్యవస్థిత మగుటవలన) గలిగెడిసంశయము.

పయిని నిరూపింపఁబడిన సంశయహేతువులయిదును జ్ఞాతృనిష్ఠములు. ఇందు సమానధర్మోపపత్తి యన సాధారణధర్మసంబంధమనియు, ననేకధర్మోపపత్తి యన నసాధారణధర్మసంబంధమనియుఁ గావుననే యారెండును జ్ఞేయనిష్ఠములే యనియుఁ గొందఱందురు. కాని సంశయవిషయమగు నెదుటివస్తువునకు స్థాణుపురుషసాధారణమగు నౌన్నత్యసంబంధముండినను నది యున్నటులు మనుజునకుఁ దెలిసినంగాని సంశయ ముదయింపనేరదు. కావున సాధారణాదిధర్మసంబంధముగాక తద్జ్ఞానమే సంశయహేతువని చెప్పవలసియుండును. కాఁగా సాధారణధర్మజ్ఞానము (సమానధర్మోపపత్తియు)ను నిటులే యసాధారణధర్మజ్ఞానము (అనేకధర్మోపపత్తియు)ను జ్ఞాతృనిష్ఠములే యగుచుండును.

సూ:—దేనికై యత్నంబో యయ్యది ప్రయోజనంబు.—౨౪.

లోకంబున మనుజుఁ డొకవస్తువును బొందవలయునని గాని యొకదానిని విడువవలయునని గాని యత్నించును. అట్లు పొందఁదలంచినదానిని బొందుటయు విడువఁదలంచినదానిని విడుచుటయుఁ బ్రయోజనంబులని యెఱుంగవలయును.

**సూ:—లౌకికపరీక్షకులకు దేనియెడ బుద్ధిసామ్యంబు గలుగునో యయ్యది దృష్టాంతంబు—౨౫.**

సహజంబుగఁగాని శాస్త్రాభ్యాసంబువలనఁగాని జ్ఞానాతిశయంబు నొందనిపామరు లిట లౌకికు లనఁబడుదురు. బుద్ధికౌశలంబుగలవిమర్శకులు పరీక్షకులు. ఏవస్తువును బామరులును విమర్శకులును నొకేరీతిగా గ్రహింతురో యది దృష్టాంతంబు.

పుణ్యపాపంబులు గాలక్రమంబున నశించునా నశింపవా యని మనుజుఁడు సంశయింపవచ్చును. ఇట సదసత్ప్రవృత్తిజన్యంబులగుటచేఁ బుణ్యపాపంబులు నశించునని నిరూపింపవలసినపుడు శరీరము దృష్టాంతముగ గ్రహింపఁబడును. శరీరము పుట్టునదియు నశించునదియు ననునెడఁ బామరులకును విమర్శకులకును నభిప్రాయభేద మెన్నఁటికి నుండనేరదు. కావున నీశరీరదృష్టాంతముచే జన్యములగువస్తువు లెల్ల నశింపకతీఱదని సాధింపవచ్చును.

దృష్టాంతవిరోధముచేఁ బ్రతివాదిపక్షము నిరాకరింపఁబడును. దృష్టాంతానుకూల్యముచే స్వపక్షము స్థాపితమగును.

కావుననే యీదృష్టాంతము న్యాయావయవంబులందు నేక దేశముగ గ్రహింపఁబడు చుండును.

న్యాయావయవంబులు ముస్ముందు వివరింపఁబడును.

న్యాయపూర్వాంగ ప్రకరణము

సమాప్తము.

---

**సూ:—తంత్రసిద్ధార్థంబుల తత్త్వనిర్ణయంబు సిద్ధాంతంబు—౨౬**

తంత్రమనఁ బ్రమాణభూతంబగుశాస్త్రంబు. అట్టిశాస్త్రములందుఁ బదార్థంబులతత్త్వంబును విమర్శించి నిర్ణయించుట సిద్ధాంత మనఁబడును.

**సూ:—అయ్యది సర్వతంత్రసిద్ధాంతంబు, ప్రతితంత్రసిద్ధాంతంబు, నధికరణసిద్ధాంతంబు, నభ్యుపగమసిద్ధాంతంబు నని చతుర్విధంబు—౨౭.**

స్పష్టము.

**సూ:—శాస్త్రనిరూపితంబయి సర్వతంత్రావిరుద్ధంబగునది సర్వతంత్రసిద్ధాంతంబు—౨౮.**

ఘ్రాణాదు లింద్రియంబులనియుఁ బృథివ్యాదులు భూతంబులనియు న్యాయశాస్త్రంబు నిరూపించియున్నది. ఈవిషయంబున నితరశాస్త్రంబులకు వైరుధ్యంబు లేకుండుటచే నియ్యవి సర్వతంత్రసిద్ధాంతంబులు.

**సూ:—సమానతంత్రసిద్ధంబుఁ బరతంత్రాసిద్ధంబు నగునది ప్రతితంత్రసిద్ధాంతంబు—౨౯.**

కొన్ని శాస్త్రంబులందుమాత్రము నిరూపింపఁబడి మఱికొన్ని శాస్త్రములకు సమ్మతంబుగాకున్నచో నయ్యది ప్రతితంత్రసిద్ధాంతము.

ఆత్మ నిర్గుణంబనియుఁ, జైతన్యరూపంబనియుఁ, గర్తృత్వమాత్మధర్మంబు గాదనియు సాంఖ్యులసిద్ధాంతము ఆత్మ సగుణంబనియుఁ, జైతన్యరూపంబుగాక చైతన్యాశ్రయమనియుఁ, గర్తృత్వ మాత్మధర్మమే యనియు నైయాయికుల సిద్ధాంతము. ఇట్టివి ప్రతితంత్రసిద్ధాంతములని వ్యవహరింపఁబడును.

**సూ:—దేనిసాధించునెడ నితరంబును సిద్ధించునో యయ్యది యధికరణసిద్ధాంతంబు—౩౦.**

మనమొకదానిని సాధించునపుడు దానితోపాటుగ మఱికొన్ని యంశములుగూడ నప్రయత్నముగ సిద్ధించుచుండును. అవి యటులు సిద్ధింపకుండ మొదటియంశము సిద్ధింపనేరదు. ఇట్టిది యధికరణసిద్ధాంతము. చక్షురింద్రియమువలనను ద్వగింద్రియమువలనను గలిగెడిజ్ఞానములను "యోఽహమద్రాక్షం సోఽహం స్పృశామి" అని యాత్మయొక్కటే యనుసంధించుచుండుటచే నింద్రియములకంటె వేఱుగ నాత్మగలదని నిరూపించునెడ నప్రయత్నముగ నింద్రియముల యనేకత్వమును, విషయనియమమును, జ్ఞానసాధనత్వమును సిద్ధించును. ఈయంశములు

సిద్ధింపనిచో నాత్మ యింద్రియాతిరిక్తమనెడి ప్రకృతార్థము సిద్ధింప నేరదు. ఈరీతి నాత్మ యింద్రియాతిరిక్తమని నిరూపించుటయే యధికరణసిద్ధాంతము. ఇట స్పష్టతకై వేఱొకలౌకికోదాహరణము చూపఁబడుచున్నది. మనుజుఁడు తిలలనుండి తైలము దీయునపుడు పృథగ్యత్నము లేకుండఁగనే తిలపిష్టము సిద్ధించును. ఇది సిద్ధింపనిచోఁ దైలము సిద్ధింపదు!

**సూ:—విశేషపరీక్షణంబువలని యపరీక్షితాభ్యుపగమం బభ్యుపగమసిద్ధాంతంబు—3౧.**

ఒకయంశము శాస్త్రమున సాక్షాత్తుగ నిరూపింపఁబడకున్నను దానిని సంబంధించిన మఱికొన్ని విశేషవిషయముల నిరూపించుటంబట్టి యాయంశ మాశాస్త్రమునకు సమ్మతమే యని మనము గ్రహింపవలసియుండును. శాస్త్రంబున (సూత్రంబులందు) మనస్సున కింద్రియత్వముగలదని సాక్షాత్తుగ నిరూపింపఁబడియుండ లేదు. అయినను మనస్సు జ్ఞానోత్పత్తిసాధనమని యచ్చటచ్చటఁ బ్రతిపాదింపఁబడియున్నది. దీనింబట్టి చక్షురాదులకువలె జ్ఞానోత్పత్తిసాధనమగు మనస్సునకును నింద్రియత్వము సూత్రకారసమ్మతమని తేలుచున్నది. ఇట్టిది యభ్యుపగమసిద్ధాంతము.

సిద్ధాంతప్రకరణము

సమాప్తము.

**సూ:—ప్రతిజ్ఞాహేతూదాహరణోపనయనిగమనంబు లవయవంబులు—32.**

ప్రతిజ్ఞ, హేతువు, నుదాహరణము, నుపనయము, నిగమనము ననుసీయైదును న్యాయంబున కవయవంబులు. ఈ యైదింటిసముదాయంబే న్యాయ మనఁబడును

**సూ:—సాధ్యనిర్దేశంబు ప్రతిజ్ఞనాఁబడు—33.**

దేనియందు దేనిని సాధింపఁదలంతుమో వానిని జెర్కొనుట ప్రతిజ్ఞ యనఁబడును. పర్వతమున వహ్ని యున్నటులు పరునికి బోధింపఁదలంచి 'పర్వతోవహ్నిమాఞ్' అని ప్రయోగింతుము. ఈవాక్యమే ప్రతిజ్ఞ యని వ్యవహరింపఁబడును.

**సూ:—సాధ్యసాధకంబు హేతువనంబడు—34.**

దేనినిబట్టి మన మొకదానిసి సాధింతుమో దానిని బోధించుశబ్దము హేతువాక్యమని వ్యవహరింపఁబడును. "పర్వతోవహ్నిమాన్"అని మనము బోధింపఁగనే శ్రోత 'కుతః' అని హేతువు నాకాంక్షించును. అపుడు మనము హేతు బోధకమగు 'ధూమాత్' అనుశబ్దమును బ్రయోగింతుము. ఇదియే హేతువాక్యము.

**సూ—అయ్యది యుదాహరణసాధర్మ్యవైధర్మ్యంబుల సాధ్యసాధకంబయ్యెడిని—35.**

పురుషుఁడు మహానసమున వహ్నిధూమముల నియత సంబంధము (వ్యాప్తి) గ్రహించియుండును. అనఁగా ధూమమున్నచో వహ్ని యుండక తీఱదని తెలిసికొనుననుట. ఇట.

మహానసము దాహరణముగ గ్రహింపఁబడును. పర్వతమునందు ధూమముగలదని తెలిసినతోడనే "యత్ర

సాధర్మ్యము.

ధూమ స్తత్రాగ్నిః యథా మహానసః" అని మహానససాధర్మ్య(సామ్య)ము నీపర్వతమున స్థిరపఱుచుకొని మహానసమందువలెనే యిటఁగూడ వహ్నియుండక తప్పదని నిశ్చయించుకొనును. ఇట్టియెడ హేతు వుదాహరణసాధర్మ్యంబున (అన్వయవ్యాప్తిచే) సాధ్యమును సాధించుచుండునని యెఱుంగవలయును.

ఇటులే పురుషుఁడు హ్రదము(మడుగు)న ధూమాభావవహ్న్యభావముల నియతసంబంధము (వ్యాప్తి) గ్రహించియుండును. అనఁగా వహ్ని లేనియెడ ధూమమును నుండదని తెలిసికొనుననుట ఇట హ్రద ముదాహరణము. పర్వతమునందు ధూమ మున్నదని తెలిసినతోడనే

వైధర్మ్యము.

"యత్ర వహ్నిర్నాస్తి తత్ర ధూమోఽపి నాస్తి, యథా హ్రదః" అను హ్రదసామ్యమిట లేకుండుట (వైధర్మ్యము)ను స్థిరపఱిచికొని ధూమము లేని హ్రదమందువలెఁగాక యీపర్వతమునందు వహ్నియుండక తీఱదని నిశ్చయించుకొనును. ఇట్టియెడ హేతు వుదాహరణవైధర్మ్యమున (వ్యతిరేకవ్యాప్తిచే) సాధ్యమును సాధించును.

**సూ:—నిశ్చితంబులగుసాధ్యహేతువులుగాని సాధ్యాభావహేత్వభావములుగాని గలదృష్టాంతంబుదాహరణంబు —౩౬, ౩౭.**

అన్వయదృష్టాంతమనియు వ్యతిరేకదృష్టాంతమనియు దృష్టాంతంబు ద్వివిధంబు. దేనియందు సాధ్యమును హేతువును నున్నటులు నిశ్చయింపఁబడునో యయ్యది యన్వయదృష్టాంతము పర్వతమున ధూమముచే వహ్నిని సాధించునెడ

అన్వయ దృష్టాంతము.

"యత్ర ధూమ స్తత్రాగ్నిః, యథా మహానసః" అని మహానసమును దృష్టాంతముగ గ్రహింతుము. ఇట సాధ్యమగువహ్నియు సాధనమగుధూమమును మహానసమున నియతసంబంధముతో నున్నవని నిశ్చయింపఁబడుటచే నిది యన్వయదృష్టాంతము. ఇట నన్వయదృష్టాంతమగు మహానసముతోఁ బర్వతమునకుఁగల సాధర్మ్యమువలన హేతువు సాధ్యసాధకమగుచుండును.

దేనియందు సాధ్యాభావహేత్వభావములు నిశ్చయింపఁబడునో యయ్యది వ్యతిరేకదృష్టాంతము. పర్వతమున ధూమముచే వహ్నిని సాధించునెడ 'యత్ర వహ్ని

వ్యతిరేక దృష్టాంతము.

ర్నాస్తి తత్ర ధూమోపినాస్తి,యథా హ్రదః' అని హ్రదమును దృష్టాంతముగ గ్రహింతుము. ఇట హ్రదమున సాధ్యమగువహ్ని లేకుండుటయు హేతువగుధూమము లేకుండుటయు నిశ్చయింపఁబడుటచే హ్రదము వ్యతిరేకదృష్టాంతమగుచున్నది. ఇట వ్యతిరేకదృష్టాంతమగు హ్రదముతోఁ బర్వతమునకుఁగల వైధర్మ్యమువలన హేతువు సాధ్యసాధకమగుచున్నది.

అనఁగా మహానసమందువలెఁ బర్వతమున ధూమ మగపడుటవలనను వహ్ని నిశ్చయింపఁగలము. మఱియుఁ బర్వతమునందు హ్రదమందువలె ధూమము లేకుండుట (ధూమాభావము) లేదుగాన వహ్ని లేకుండుట సంభవింపదనియు వహ్ని నిశ్చయింపఁగలము.

ఇట్టి దృష్టాంతములబోధించువాక్యము లుదాహరణములని వ్యవహరింపఁబడును.

**సూ:—ఉదాహరణాధీనంబగు నుపసంహారం బుపనయంబు —3౮.**

అన్వయదృష్టాంతమగు మహానసాదికమున నిశ్చితమగు వ్యాప్యవ్యాపకభావముగల హేతువునకుఁ బర్వతాదికమగు పక్షముతోడిసంబంధమును బోధించు "తథా చాయమ్" (మహానసమువలె నీపర్వతముగూడ ధూమసంబంధముగలది) అనువాక్యమే యుపనయమని వ్యవహరింపఁబడును.

ఇటులే వ్యతిరేకదృష్టాంతమగుహ్రదాదికమున వ్యాప్యవ్యాపకభావముగల హేత్వభావమునకుఁ బర్వతాదికమగుపక్షముతో సంబంధము లేకుండుటను బోధించు 'న తథా చాయమ్' (హ్రదమువలె నీపర్వతము ధూమము లేనిదిగాదు) అనువాక్యమును నుపనయంబని వ్యవహరింతురు.

పెక్కుచోటులనుండునది వ్యాపకము.

తక్కువచోటులనుండునది వ్యాప్యము.

మనుష్యత్వము సర్వమానవసాధారణమగుటచే వ్యాపకము.

క్షత్రియత్వము కతిపయమానవమాత్రనిష్ఠమగుటచే వ్యాప్యము.

పదార్థస్వరూపపరిశీలనంబున నీవ్యాప్యవ్యాపకభావమును సుదూరంబుగను సుసూక్ష్మంబుగను బరికింపవలసియుండును.

**సూ:—సహేతుకసాధ్యనిర్దేశంబు నిగమనంబు—3౫.**

ఉదాహరణంబునుబట్టి **సాధ్యముతో** నియతసంబంధము గలదిగను నుపనయంబునుబట్టి పక్షమునందుండునదిగను నిశ్చయింపఁబడినహేతువుతోఁగలిపి 'తస్మాత్తథా' (=తస్మాద్వహ్నిమాన్) యని తిరిగి నిర్దేశించుట నిగమనంబని వ్యవహరింపఁబడును.

పక్షదృష్టాంతములకుఁగల సాధర్మ్యవైధర్మ్యములచే నుదాహరణంబును నుపనయంబును మాఱుచుండినను నిగమనంబునకు మార్పుగలుగదు. సాధర్మ్యమున్నయెడ 'పర్వతో వహ్నిమాన్' అని ప్రతిజ్ఞయు, 'ధూమాత్' అని హేతువును "యత్ర యత్ర ధూమస్తత్ర తత్రాగ్నిః యథా మహానసః" అని యుదాహరణంబును 'తథాచాయమ్' అని యుపనయంబును 'తస్మాద్వహ్నిమాన్'అని నిగమనంబును బంచావయవంబులుగ గ్రహింపఁబడును

వైధర్మ్యస్థలంబున 'పర్వతో వహ్నిమాన్' అని ప్రతిజ్ఞయు, 'ధూమాత్' అని హేతువును, 'యత్ర వహ్నిర్నాస్తి తత్ర ధూమోపినాస్తి, యథా హ్రదః'అని యుదాహరణంబును, 'న తథాచాయమ్' అని యుపనయంబును 'తస్మాద్వహ్నిమాన్' అని నిగమనంబును బంచావయవంబులు.

ప్రతిజ్ఞాదులగునవయవంబులు నాలుగిటికిఁ బరస్పరసంబంధమున్నటులు బోధించునుగాన 'తస్మాద్వహ్నిమాన్' (వహ్నివ్యాప్యమగుధూమ మిట నగపడుటచే నీపర్వతమున వహ్ని గలదు) అను వాక్యమునకు నిగమనమని వ్యవహారము. (నిగమ్యన్తే సంబధ్యన్తే ప్రతిజ్ఞాహేతూదాహరణోపనయాః అనేనేతి నిగమనమ్).

ఈ ప్రతిజ్ఞాద్యవయవసముదాయంబే న్యాయమని వ్యవహరింపఁబడును. న్యాయంబునఁ బ్రత్యక్షాది ప్రమాణంబులు పరస్పరసంబద్ధములయి సాధ్యసాధకము లగుచుండును. 'పర్వతో వహ్నిమాన్' అను ప్రతిజ్ఞావాక్యము శబ్దప్రమాణంబు. ఈ వాక్యమువలనఁ బర్వతమున వహ్నియున్నటులు దెలియుచున్నను నియ్యది ఋషివాక్యము గాకుండుటచే దీనివిషయమున నింకను బరిశీలింపవలయునని శ్రోతకు సంకల్పముగలుగుట సహజంబు. కావున ననుమానప్రమాణమగు 'ధూమాత్'అను హేతువాక్య మపేక్షితమగుచున్నది. దీనివలన హేతువు దెలిసినను హేతువగుధూమమునకు వహ్నితో నియతసంబంధము గలదా యనియు నట్టిధూమ మాపర్వతముననున్నదా యనియు

శ్రోతకు మరల శంక లుదయించును. ఈసంశయములు నివర్తిం చుటకు 'యత్ర ధూమస్తత్రాగ్నిః యథా మహానసః' అను ప్రత్యక్ష ప్రమాణంబగు నుదాహరణంబును 'తథాచాయమ్' (మహానసమువలెఁ బర్వతముగూడ ధూమముగలది) అని యుప మాన ప్రమాణమగు నుపనయంబును నావశ్యకంబులు వక్త యిన్నివిధములబోధించినను నిట ధూమము నిర్దుష్టమగు హేతు వగునో కాదో యని యింకను సంశయ ముదయింపవచ్చును. కావున 'తస్మాత్తథా' అను నిగమనవాక్యము హేతువు నిర్దుష్ట మని దృఢపఱచుట కావశ్యకమగుచుండును. ప్రతిజ్ఞాదులకుఁ బయిరీతిని బరస్పరసంబంధము నెలుంగునది.

దృష్టాంతమున సాధ్యహేతువులకు వ్యాప్యవ్యాపక భావము నిర్ణయింపఁబడనిచోఁ గేవల సాధర్మ్యమునుబట్టిగాని కేవల వైధర్మ్యమునుబట్టిగాని జాతి, నిగ్రహస్థానము మున్నగు దూషణములు ప్రవర్తిల్లును పయినిజూపినతీఱున దృష్టాంత మున సాధ్యహేతువులకు వ్యాప్యవ్యాపకభావము నిశ్చిత మయి హేతుదృష్టాంతములు పరిశుద్ధములయినచో నట్టిదూషణ ముల కవకాశము గలుగనేరదు.

స్వార్థానుమానమనియుఁ బరార్థానుమానమనియు నను మానము రెండువిధములుగ నుండును. స్వార్థానుమానమన హేతువునుబట్టి సాధ్యమును స్వయముగఁ దెలిసికొనుటకుఁ దగినయనుమానము. స్వార్థానుమానంబున న్యాయావయ వంబుల కావశ్యకత లేదు. పరార్థానుమానంబనఁ దనకుఁ దెలిసిన

దానిని బరునికి బోధించుట కుపయోగింపఁబడు న్యాయమును బట్టి పరునికిఁగలిగెడి యనుమాన ప్రమాణము. ఇందే న్యాయావయవంబులకుఁ బ్రవేశముండును.

## పరార్థానుమానపద్ధతి.

వక్త.—పర్వతమున వహ్నిగలదు. (1 ప్రతిజ్ఞ)

శ్రోత —నీవెటులు తెలిసికొంటివి?

వ.—ధూమ ముండుటవలన. (2 హేతువు)

శ్రో.—ధూమముండిన వహ్నియుండవలయునా?

వ.—వహ్ని లేనిచో ధూమ ముండనేరదు. కావున ధూమ మున్నయెడ వహ్ని యుండకతీఱదు. వహ్ని యున్నపుడే ధూమ ముండుటయు, వహ్ని లేనపుడు ధూమము లేకుండుటయు మహానసమున నీవును జూచియుంటివి గదా! (3 ఉదాహరణము)

శ్రో.—పర్వతమున ధూమమును నీవు చూచితివా?

వ.—మహానసమునందువలెఁ బర్వతమునందును ధూమ మెగయుటవలననే యట్లు చెప్పితిని (4 ఉపనయము)

శ్రో —ఆయెగయుచున్నది. ధూమమగునో! కాదో! ధూమమే యయినను నట వహ్ని గలదో! లేదో!

వ —అది తప్పక ధూమమే కన్నులారఁ జూచితిని అదియున్నచోట వహ్ని యుండకయుఁ దప్పదు. నీవొకింతయు సంశయింపవలదు (5 నిగమనము)

న్యాయమునకుఁ బయిని నిరూపింపఁబడిన ప్రతిజ్ఞాదిపంచావయవంబులేగాక సంశయము, జిజ్ఞాస, శక్యప్రాప్తి, ప్రయోజనము, సంశయవ్యుదాసమునను మఱియైదవయవంబులును గలవని కొందఱు తార్కికులమతము. కాని యీసంశయాదులు ప్రతిజ్ఞాదులవలె న్యాయాంగములు గానేరవు. న్యాయోపకారకములుమాత్ర మగుచుండును.

సంశయము జిజ్ఞాసనుగలిగించి వస్తుతత్త్వపరిశీలనమునఁ బురుషుని బ్రవర్తింపఁజేయునేగాని వస్తుతత్త్వనిర్ణయమునకు సాధనము కాఁజాలదు. జిజ్ఞాస యనఁ దెలియనిదానిని దెలిసికొనఁగలంచుట. ఈతలంపువలనఁ బురుషుఁడు వస్తుతత్త్వమును దెలిసికొని యద్దానిని బరిగ్రహించుటకో పరిత్యజించుటకో యుపేక్షించుటకో యత్నించును. కావున నిట్టిజిజ్ఞాసవస్తుతత్త్వమును దెలిసికొనుటకుఁ బురుషుని బ్రవర్తింపఁజేయునదేగాని వస్తుతత్త్వమును నిర్ణయించునదిగాదు. కాఁగా నిదియు న్యాయావయవము కానేరదు. శక్యప్రాప్తియనఁ బ్రమాతకును బ్రమాణములకును గలసామర్థ్యము. అనఁగాఁ దెలియఁగోరు పురుషుఁడు బుద్ధిశాలియగుటయుఁ బ్రమాణములు నిర్దుష్టములగుటయు నగుట. ఈసామర్థ్యము వస్తుతత్త్వపరిశీలనమునకుపకరించుచుఁ దత్త్వనిర్ణయమునకుఁ బ్రయోజకమగును గాని సాధకముమాత్రము గానేరదు. పరంపరయాసాధనమగునది ప్రయోజకమనియు సాక్షాత్సాధనమగునది సాధకమనియు వ్యవహరింపఁబడును. ప్రయోజనంబనఁ దత్త్వనిర్ణయము. ఇది

న్యాయమునకు ఫలమగునుగాని యంగము కానేరదు. సంశయవ్యుదాసంబనఁ బ్రతిపక్షనిరాకరణము. పర్వతమున ధూమముచే వహ్ని గలదని యూహించునెడఁ "బర్వతమున వహ్ని లేకున్నచో ధూమమును నుండకపోవలసివచ్చును." అని నిరూపింతుము. ఇదియే ప్రతిపక్షనిరాకరణము. తర్కరూపంబగు నిది న్యాయమునకు సహకారియగుచుండునుగాని యంగము కానేరదు. కాఁగాఁ బ్రతిజ్ఞాదుల యిదే న్యాయావయవములని యెఱుంగవలయును. ప్రతిజ్ఞాహేతువులు రెండు మాత్రమే న్యాయాంగములని బౌద్ధమతము. ప్రతిజ్ఞాహేతూదాహరణంబులు మూఁడుగాని యుదాహరణోపనయనిగమనంబులు మూఁడుగాని న్యాయావయవంబులని మీమాంసకుల మతము.

న్యాయప్రకరణము

సమాప్తము.

---

**సూ:—కారణోపపత్తిమూలకంబయి యవిజ్ఞాతవస్తు తత్త్వనిర్ణాయకంబగునూహ తర్కంబనాఁబడు—౪౦.**

లోకమునఁ బురుషుఁడు దనకు స్పష్టముగఁ దెలియనివస్తు తత్త్వమును రూఢిగఁ దెలిసికొనఁగోరుచుండును. ఆకోరికతోఁ దాను దెలిసికొనఁదలంచినవస్తువునందుఁ దనకు గోచరించు విరుద్ధధర్మములలో నెయ్యది సయుక్తికమును బ్రామాణికమునగునో యని పరిశీలించును. ఆత్మ 'నిత్యమా? యనిత్యమా?'

యనుసంశయముగలపురుషుఁ డాత్మతత్త్వపరిశీలనమున కారంభించును. అట్టియెడ "నాత్మశరీరముతోడనే పుట్టి దీనితోపాటుగనే నశించెడిదగుచో దీనికిఁ బూర్వజన్మమును నుత్తరజన్మమును సంభవింపనేరవుగదా! కావున నీసంసారము పూర్వజన్మమున నాచరింపఁబడినకర్మములకు ఫలరూపంబగుటయు, నుత్తర జన్మ సుఖంబునుగోరి యిపుడు సత్కర్మముల నాచరించుటయుఁ బొసంగవుగదా! కాఁగా నాత్మనిత్యమనుటయే సమంజసంబని తోఁచుచున్నయది" యని యూహించును. ఈయూహాకే తర్కమని వ్యవహారము.

ఇత్యాది యూహామాత్రమేగాని నిశ్చయరూపంబగు తత్త్వజ్ఞానంబు గానేరదు. ఇట్టియూహాలు పుట్టినపిదపఁ బురుషుఁడు ప్రమాణంబులంబట్టి తత్త్వంబు నిర్ణయించుకొనును. కాఁగాఁ దత్త్వనిర్ణాయకములగు ప్రమాణములకుఁ దర్కము సహకారియగుచుండును. కావుననే యీతర్కము ప్రమాణములతోపాటుగ వాదకథయందుపయోగింపఁబడుచుండును.

**సూ:—పక్షప్రతిపక్షవిమర్శసిద్ధంబగు తత్త్వనిశ్చయంబు నిర్ణయంబు—౪౧.**

ఇటఁ బక్షమన సాధకహేతువు. ప్రతిపక్షమన బాధకహేతువు. విమర్శంబన సంశయంబు. ఆత్మ 'నిత్యమా? యనిత్యమా?' యని సంశయించి తత్త్వము దెలియఁగోరి పురుషుఁడు దనసంశయమును బండితులకుఁ దెలుపును. అట్టియెడ నిత్య

మనుటకుఁ గొందఱొక హేతువును ననిత్యమనుటకు మఱి కొందఱు మఱొక హేతువును నిరూపింతురు. ఇట నొక హేతువును బక్షముఁగ గ్రహించినచో రెండవది ప్రతిపక్షమగు చుండును. పరస్పరవిరుద్ధములగు నీపక్షప్రతిపక్షములు రెండును దత్త్వనిశ్చయమున కుపకరించుచుండును.

"ఆత్మనిత్యతావాదులు నిత్యత్వసాధకమగు హేతువును నిరూపించుటయగాక యనిత్యత్వసాధక హేతువును దూషింతురు. అనిత్యతావాదులు తమ హేతువునందుఁ బయివారు నిరూపించినదోషముల వారించి నిత్యత్వ

పూర్వపక్షము. సాధక హేతువును దూషింతురు తుదికీ హేతువులలో నేదో యొక్కటియే తత్త్వ సాధకమగునుగాని రెండును గాఁజాలవుగదా! కావునఁ బక్ష ప్రతిపక్షంబులు రెండును దత్త్వసాధకములనుట యెట్లు పొసంగు" నని శంకించుట కిట నవకాశము గలదు

కాని యొక హేతు వుపపన్నమనియు రెండవది యనుపపన్నమనియు స్పష్టముగఁ దెలిసినంగాని సంశయనివర్తకంబగు తత్త్వనిశ్చయంబు గలుగనేరదు. కావున

సమాధానము. నుపపన్నంబగు హేతువువలెననుపపన్నంబగు రెండవ హేతువును దత్త్వనిశ్చయంబునకుఁ దోడ్పడునని యెఱుంగవలయును.

సంశయముండినంగాని యిట్టిపక్షప్రతిపక్షపరిశీలనమున కావశ్యకత గలుగదు. అట్టి పరిశీలనమువలనఁగాని నిర్ణయము

సిద్ధింపదు. కావున నిర్ణయము విమర్శసిద్ధంబని సూత్రమున నిరూపింపఁబడినది. కాని యీనిర్ణయ ముదయించుచోటులం దెల్ల సంశయమును బక్షప్రతిపక్షపరిశీలనంబునునుండియే తీఱవలయు నను నిర్బంధములేదు. మనము సాక్షాత్తుగ ఘటమునుజూచి నపు డియ్యది ఘట మగునా కాదా యనుసంశయమును బరిశీలనమును లేకుండఁగనే యిది ఘటమని నిర్ణయింతుముగదా! మఱియు నిటులే "సత్కర్మములు స్వర్గ(సుఖ)సాధనము"లను శాస్త్రమును జూచినపుడు దానియెడఁ బ్రామాణ్యబుద్ధిచే సత్కర్మముల నాచరించుటవలన స్వర్గము లభించునో లేదో యని సంశయింపము. కాన నిట్టి శాస్త్రీయనిర్ణయంబులవిషయమునను సంశయ, పక్షప్రతిపక్షపరిశీలనంబుల కావశ్యకత లేదు.

నిర్ణయము మూఁడువిధములుగ నుండును.

(1) ఆత్మ నిత్యమా యనిత్యమా యని యొకధర్మియందు విరుద్ధధర్మములు సంశయవిషయము లగునపుడు పక్షప్రతిపక్షపరిశీలనంబున నిత్యత్వానిత్యత్వములలో నేదో యొక్కటియే నిశ్చయింపఁబడవలసియుండును. ఇది యొకవిధమగునిర్ణయము.

(2) ద్రవ్యములు సక్రియములా నిష్క్రియములా యని సంశయించునెడఁ బక్షప్రతిపక్షపరిశీలనంబునఁ గొన్ని ద్రవ్యంబులు (శరీరాదులు) సక్రియంబులనియుఁ గొన్ని ద్రవ్యంబులు (ఆకాశాదులు) నిష్క్రియంబులనియు నిశ్చయము తేలుచుండును. ఇది యొకవిధమగునిర్ణయము.

(3) మఱియు జాగ్రదవస్థలో శరీరమునకు సక్రియత్వ మును సుషుప్తియందు నిష్క్రియత్వమును నుండునట్లుగ నొకే ద్రవ్యమునకుఁ గాలభేదమునుబట్టి విరుద్ధధర్మము లుండవచ్చు ననియు నిశ్చయింపవచ్చును. ఇది యొకవిధమగునిర్ణయంబు.

న్యాయోత్తరాంగప్రకరణము

స మా ప్త ము.

ఆంధ్రన్యాయదర్శనంబునఁ బ్రథమాధ్యాయంబునఁ

బ్రథమాహ్నికంబు

సమాప్తంబు.

శివాయ గురవే నమః.

# న్యాయదర్శనము

## ప్రథమాధ్యాయము.

---

### ద్వితీయాహ్నికము.

**సూ:—ప్రమాణతర్కసాధనోపాలంభంబును, సిద్ధాంతావిరుద్ధంబును, బంచావయవోపపన్నంబును, నగు పక్షప్రతిపక్షపరిగ్రహంబు వాదంబు—౧**

వాదమనియు జల్పమనియు వితండయనియుఁ గథ మూఁడువిధములుగ నుండును. కథ యన స్వపక్షస్థాపనంబునకుఁగాని పరపక్షనిరాకరణంబునకుఁగాని వాదిప్రతివాదులు ప్రయోగించువాక్యసందర్భము. ఒకవస్తువునందు వాదిప్రతివాదులు గ్రహించినవిరుద్ధధర్మములు పక్షప్రతిపక్షములు. ఆత్మ కలదని కొందఱును లేదని కొందఱును గ్రహింతురు. ఇట నాత్మయందు విరుద్ధములయిన యస్తిత్వానాస్తిత్వములు పక్షప్రతిపక్షములు. ఇట్టి పక్షప్రతిపక్షములఁ బరిగ్రహించి ప్రసంగించుటయే వాదంబు. ఈవాదమున నొకపక్షమువారు ప్రమాణములను దర్కమును బట్టి యాత్మగలదని సాధింతురు. వేఱొకపక్షమువారు ప్రమాణతర్కముల ననుసరించియే మొదటిపక్షమును దూషింతురు. ఇట్లు గొంతవఱకు సాధన

**ప్రమాణతర్కసాధనోపాలంభంబు.**

దూషణంబులు సాగినపిదప నీరెంటిలో నేదియో యొకపక్షము స్థిరపడును. అయ్యది తత్త్వంబని యుభయపక్షములవారును నిర్ణయింతురు. ఈవాదము సిద్ధాంతావిరుద్ధముగ నుండవలయును.

**సిద్ధాంతావిరుద్ధము.**

అనఁగా సిద్ధాంతమున కుపకరించెడి ప్రసంగములతోఁగూడియుండవలయుననుట. ఇట్లనుటంజేసి జల్పాదులందుఁ బ్రతివాదిసామర్థ్యపరీక్షణమాత్రమున కుపకరించెడి ఛలజాతులకుఁ గొన్ని నిగ్రహస్థానంబులకును నిందుఁ బ్రవేశము లేదని యెఱుంగునది. హేత్వాభాసములును నపసిద్ధాంతోద్భావనంబును నిరనుయోజ్యానుయోగంబును నిగ్రహస్థానంబును సిద్ధాంతమున కుపకరించునవగుటచే నిట్టిదూషణములుమాత్రమే యీవాదకథయందుఁ బ్రవర్తిల్లును ఛలజాతి నిగ్రహస్థానంబుల స్వరూపంబు మున్ముం దీయాహ్నికంబుననే వివరింపఁబడును. మఱియు నీవాదకథయందుఁ దఱుచుగఁ బ్రతిజ్ఞాదిపంచావయవంబు లుపయోగింపఁబడుచుండునని తెలుపుటకయి

**పంచావయవోపపన్నంబు.**

సూత్రమునఁ బంచావయవోపపన్నం బను పదము గ్రహింపఁబడినది. ఒక్కొకయెడ నీవాదంబున నొకయవయవము తగ్గినను నొకటి హెచ్చినను దోషముగాదు. అట్టి న్యూనాధికోక్తులు జల్పాదులందు దోషంబులగును. మఱియు నీవాదంబు గొన్నియెడలఁ బ్రత్యక్షాదిప్రమాణములను దర్కమునుబట్టియే ప్రవర్తిల్లవచ్చును. అట్టియెడఁ బంచావయవంబులకుఁ బ్రసక్తియుండదు.

పంచావయవంబులుగలవాదంబునఁ బ్రమాణతర్కంబులంబట్టి సాధనోపాలంభములుమాత్ర ముండక తీఱదు.

**సూః—ప్రమాణ, తర్క, చ్ఛల, జాతి, నిగ్రహస్థాన సాధనోపాలంభంబగు పక్షప్రతిపక్షపరిగ్రహంబు జల్పంబు—౨.**

వాదమునఁ బ్రమాణతర్కములనుబట్టియే సాధనోపాలంభములు ప్రవర్తిల్లును. జల్పమున నొకయర్థమును సాధించుటకుఁగాని దూషించుటకుఁగాని ఛలజాతినిగ్రహస్థానంబులు గూడ నుపయోగింపఁబడును. ఇదియే వాదజల్పములకుఁ గల ప్రధానభేదము. మఱియు వాదమున వాదిప్రతివాదులు తత్త్వబుభుత్సువులయి యుందురు. జల్పమున నట్లుగాక పరస్పరజిగీషతోఁ బ్రవర్తింతురు.

ప్రమాణములు, తర్కము, ఛలము, జాతి, నిగ్రహస్థానము ననువీనినిబట్టి యొకయర్థమును సాధించుచు నొకయర్థమును దూషించుచు నిట్లు పక్షప్రతిపక్షములఁ బరిగ్రహించుట జల్ప మనఁబడును ఇందుఁ బ్రమాణతర్కములు స్వతంత్రముగ నొకదానిని సాధించుటకుఁగాని యొకదానిని దూషించుటకుఁగాని సమర్థములై యుండును. ఛలజాతినిగ్రహస్థానంబులు స్వతంత్రముగ నొకయర్థమును దూషింపఁజాలునేగాని సాధింపనేరవు. అయినను నివ్వి ప్రమాణతర్కములకు సహకారులై పరపక్షనిరాకరణద్వారముననే యర్థసాధకములగుచుండునని యెఱుంగునది.

**సూ:—ప్రతిపక్షస్థాపనాహీనంబగు జల్పంబు వితండ యనంబడు—3.**

ప్రతిపక్షంబనఁ బ్రతివాదిపక్షము. ప్రతివాది తనపక్షమును స్థాపింప యత్నింపక పరపక్షమును దూషించుటకు మాత్రమే చేయుప్రసంగము వితండ యని వ్యవహరింపఁబడును. వైతండికుఁడగు ప్రతివాది తనకొకపక్షమున్నను దానిని స్థాపించుకొనుటకుమాత్రము వేఱుగ యత్నింపఁడు. కావుననే వితండ ప్రతిపక్షస్థాపనాహీనంబుగాని ప్రతిపక్షహీనంబు గాదు.

కథాలక్షణప్రకరణము

సమాప్తము.

---

**సూ:—సవ్యభిచార, విరుద్ధ, ప్రకరణసమ, సాధ్యసమ, కాలాతీతంబులు హేత్వాభాసంబులు—౪.**

సద్ధేతువులు కాకుండియు నట్లు భాసిల్లునవి హేత్వాభాసములు. అనఁగా దుష్టహేతువులని భావము. ఇయ్యవి సవ్యభిచారము, విరుద్ధము, ప్రకరణసమము, సాధ్యసమము, కాలాతీతము నని యైదువిధములుగ నుండును.

**సూ:—అనైకాంతికంబు సవ్యభిచారంబు—౫.**

ఒకదానితో నియతముగఁ గలిసియుండునది యేకాంతికము అటులుండనిది యనైకాంతికము. సాధ్యముతోఁగాని

సాధ్యాభావముతోఁగాని నియతసంబంధము లేనిది యనైకాంతికమని భావము. ఇదియే సవ్యభిచారహేతువు. వ్యభిచారమన నవ్యవస్థ. అవ్యవస్థితమగు హేతువు సవ్యభిచారమనఁబడును.

స్పర్శగలఘట మనిత్యమగుటవలనను స్పర్శలేనియాత్మ నిత్యమగుటవలనను 'నిత్యశ్శబ్దః అస్పర్శత్వాత్' స్పర్శలేనిదగుటచే శబ్దము నిత్యమని యెవరేని సాధింపఁదలంతురు. ఇట నిత్యత్వము సాధ్యము. అస్పర్శత్వము హేతువు. స్పర్శగలపరమాణువు నిత్యముగను స్పర్శలేనిబుద్ధి యనిత్యముగను నిర్ణయింపఁబడియుండుటవలన నీయస్పర్శత్వరూపహేతువు నిత్యత్వముతోఁగాని యనిత్యత్వముతోఁగాని నియతసంబంధము లేనిదగుటచే నవ్యవస్థితమై సవ్యభిచారమని వ్యవహరింపఁబడుచుండును. అనఁగా స్పర్శవత్త్వ మనిత్యత్వమునకుఁగాని యస్పర్శత్వము నిత్యత్వమునకుఁగాని సాధకములనుట పొసఁగ నేరదని భావము.

ధూమమున్నచోటులందెల్ల వహ్ని యుండకతీఱదు. వహ్నియున్న తావులందెల్ల ధూమముండునని నిరూపించుటకు మాత్రము వలనుపడదు. అయోగోళకము (ఎఱ్ఱఁగాఁ గాలినయినుముగుండు)న వహ్నియున్నను ధూమము గానరాదుగదా! కావున ధూమమునుబట్టి వహ్ని నూహింపవచ్చునేగాని వహ్నినిబట్టి ధూమము నూహింపరాదు. అట్లు వహ్నిని హేతువుగ గ్రహించినచో నయ్యది సవ్యభిచారమగును.

**సూ:—అభ్యుపగతసిద్ధాంతవిరోధి విరుద్ధంబు—౬.**

ఏహేతువు తమశాస్త్రమున నంగీకరింపఁబడినసిద్ధాంతమునకుఁ బ్రతికూలమగునో యది విరుద్ధహేతు వనఁబడును. "వికారః వ్యక్తేరపైతి; నిత్యత్వప్రతిషేధాత్; అపేతోప్యస్తి వినాశప్రతిషేధాత్" పాంచభౌతికమగులోకమంతయు వికారమని కొందఱుదార్శనికులు నిరూపించియుండిరి. ఈలోకము, నిత్యత్వనిషేధము (నిత్యముగాదనుట)వలన సర్వదా యభివ్యక్తముగాదనియు, నభివ్యక్తముగాకున్నను వినాశప్రతిషేధము (నశింపదనుట)వలన దానిస్వరూపమే లేదనుటకు వలనుపడదనియు యోగదర్శనసిద్ధాంతము. ఇట నిత్యత్వనిషేధమువలన లోకము నశించెడిదని తేలుచున్నది. ఈవినాశసిద్ధాంతమునకు లోకమున కస్తిత్వమును సాధించుటకు హేతువుగ గ్రహింపఁబడిన వినాశప్రతిషేధము ప్రతికూలమగుచున్నది. ఇటులే వినాశప్రతిషేధమువలన లోకము నిత్యమని సిద్ధించుచున్నది. సర్వదా లోకాభివ్యక్తిలేదని సాధించుటకు హేతువుగ గ్రహింపఁబడిన నిత్యత్వనిషేధము. పూర్వోక్తమగు నిత్యత్వసిద్ధాంతమునకుఁ బ్రతికూలమగుచున్నది. కావున నిట నీరెండు హేతువులును విరుద్ధము లనఁబడును.

ఏహేతువుచే దేనిని సాధింపఁదలంతుమో యాసాధ్యమునకే యది ప్రతికూలమగునెడ నట్టిహేతువు విరుద్ధంబని నవ్యతార్కికులందురు. "నిత్యోఘటః జన్యత్వాత్" అని జన్యత్వమునుబట్టి నిత్యత్వమును సాధింపఁదలంచినచో నీజన్యత్వ

హేతువు నిత్యత్వమును సాధింపకుండుటయగాక తద్విరుద్ధ మయిన యనిత్యత్వమును సాధించుచుండును. పుట్టినదెల్ల నశించునదే యనుట సర్వసమ్మతంబుగదా! కాన నిట్టిది విరుద్ధ హేతు వందురు.

అపసిద్ధాంతమునకును విరుద్ధహేతువునకును గలభేదము ముస్ముందు (౫-౨-౨౪) వివరింపఁబడును.

**సూ:—ప్రకరణచింతాప్రవర్తకంబగు హేతువు ప్రక రణసమంబు—౭.**

ఇటఁ బ్రకరణంబన, సంశయవిషయములై యనిశ్చితంబు లగు పప్రతిపక్షములు. సంశయ ముదయించినది మొదలు నిర్ణయము తేలువఱకును బురుషునికిఁ గలుగుసమాలోచన మే చింత యనఁబడును. అదియే జిజ్ఞాస. ఇట్టిజిజ్ఞాస దేనివలన నేర్పడి బలపడునో యద్దానినే తత్త్వనిర్ణయమునకు హేతువుగ గ్రహించినచో నాహేతువు ప్రకరణసమమని వ్యవహరింపఁ బడును.

పృథివి నిత్యమా యనిత్యమా యని సంశయించి పురుషుఁ డాలోచించును. ఆయాలోచనమున నిత్యమనిగాని యనిత్య మనిగాని సాధింపఁగలధర్మము లాతనికి లభింపనపుడు తనజిజ్ఞాస నివర్తింపక యితరులఁ బ్రశ్నించును. అపుడు వారు "అనిత్యా పృథివీ, నిత్యధర్మానుపలబ్ధేః" 'నిత్యమనుటకుఁ దగినధర్మములు పృథివియం దగపడకుండుటచే నయ్యది యనిత్య' మని బోధిం

తురు. ఇట నిత్యధర్మానుపలబ్ధియే పురుషునిజిజ్ఞాస (ప్రకరణ చింత)కుఁ దొలుతఁ బ్రవర్తకము. అదియే మరలఁ దత్త్వనిర్ణయమునకై హేతువుగ గ్రహింపఁబడినది. ఈ హేతువు జిజ్ఞాస (ప్రకరణచింత)కు విషమము (నివర్తకము) గాకుండుట చేఁ బ్రకరణసమంబగుచున్నది. ఇదియే సత్ప్రతిపక్షమని నవ్యతార్కికులు వ్యవహరింతురు.

ఒకయున్నతవస్తువును జూచి స్థాణువా పురుషుఁడా యని సంశయించునెడ, నుభయసాధారణమగు నౌన్నత్యము సంశయహేతువగుచుండును. ఈసంశయము నివర్తించుటకు 'అయం పురుషః, ఉన్నతత్వాత్' అని నిరూపించినచో నీ హేతువు స్థాణుపురుషసంశయమునకు విషమ (నివర్తక)ము గాకుండుటచే సంశయసమ మనఁదగును. ఇచటి హేతువు స్థాణుపురుషోభయసాధారణము. పయిని బ్రకరణసమముగ నిరూపింపఁబడిన 'నిత్యధర్మానుపలబ్ధి' యను హేతువు నిత్యానిత్యోభయసాధారణము గానేరదు. నిత్యవస్తువునం దొకపుడేని నిత్యధర్మోపలబ్ధిగలుగునుగదా! ఇదియే ప్రకరణసమసంశయసమములకుఁ గలభేదము. ఈసంశయసమము సవ్యభిచారమగుచుండును. (సూ.—౧-౨-౫).

**సూ:—సాధ్యావిశిష్టంబు సాధ్యసమంబు—౮.**

లోకంబునఁ బురుషుండు సంశయవిషయంబగు దానిని నిర్ణయింప నెంచును. ఆనిర్ణయంబు సిద్ధమగు హేతువుచే నుదయించును గాని యసిద్ధమగు హేతువుచే నుదయింపదు. అనఁగా

నొకదానిని సాధించుటకు గ్రహింపఁబడినహేతువుగూడ నిపుడు సాధింపఁబడవలసినదే యయినచో నట్టిదానివలన నిర్ణయము గలుగనేరదని భావము. ఈహేతువుగూడ సాధ్యముతోపాటుగ సాధింపఁదగినదే యగుటం జేసి సాధ్యతుల్యమై సాధ్యసమంబని వ్యవహరింపఁబడును. ఇదియే యసిద్ధహేతువు. ఇయ్యది స్వరూపాసిద్ధమనియు, నాశ్రయాసిద్ధమనియు, నన్యథాసిద్ధమనియుఁ ద్రివిధంబు.

స్వరూపాసిద్ధము.

(1) 'ఛాయా ద్రవ్యమ్, గతిమత్త్వాత్.' ఛాయ(నీడ) గమనముగలదగుటవలన ద్రవ్యమగునని యూహింతురు. ఇట ఛాయయందు ద్రవ్యత్వమువలె గమనము గూడ సాధింపఁబడవలసియే యున్నదిగాని సిద్ధించియుండదయ్యె. కావున నీగమనరూపంబగుహేతువు స్వరూపాసిద్ధ మనఁబడును.

ఆశ్రయాసిద్ధము.

(2) మఱియు నిచ్చోటనే ఛాయకు గమనమును సాధించుటకు 'ఛాయా గతిమతీ, దేశాన్తరేదర్శనాత్' 'ఒకచో నగపడుఛాయ కొంతతడవునకు వేఱొకతావున నగపడుచుండుటచే నియ్యది గమనముగలది'యని యూహింతురు. ఏదయిన నొకటి వేర్వేఱుతావుల నగపడవలయునన్నచో నయ్యది స్వతంత్ర వస్తువయి యుండవలయును. ఇట ఛాయ స్వతంత్రవస్తువని నిశ్చయింపఁబడకుండుటచే దేశాంతరదర్శనార్థముగ ఛాయ

(ఆశ్రయము) సిద్ధింపకుండుటవలన నిచటిహేతు వాశ్రయా సిద్ధ మనఁబడును.

మఱియు నిట ఛాయ స్వతంత్రవస్తువు గాకున్నచో వేర్వేఱుతావుల నగపడుట సంభవింపదుగావుననే యయ్యది స్వతంత్రవస్తువని నిర్ణయింపరాదా యని శంక పొడమును. కాని బాగుగఁ బరిశీలించినచో ఛాయ స్వతంత్రవస్తువు గానేరదు. ఎండలోఁగాని వెన్నెలలోఁగాని దీపములయొద్దఁగాని పురుషుఁడు నడచునపు డాయాభూభాగములఁ బ్రసరింపవలసిన తేజఃకణములు పురుషశరీరముచే నడ్డగింపఁబడును అట్టి యెడఁ దేజోవిహీనమగు నాయాప్రదేశ

అన్యథాసిద్ధము.

మునే ఛాయ యని మనము గ్రహించుచుందుము. కావున వేర్వేఱుతావుల నగపడునది తేజోవిహీనమగు భూభాగమేగాని ఛాయయను వేఱొక వస్తువుగాదు. ఈరీతిని భిన్నస్థలముల నగపడుట కుపపత్తియుండుటచే దేశాంతరదర్శనమాత్రమున ఛాయకు స్వతంత్రవస్తుత్వము నంగీకరింపఁబనిలేదు. కాఁగా నిచటిదేశాంతరదర్శనరూపంబగుహేతు వన్యథా సిద్ధ మనఁబడును. దీనినే నవ్యతార్కికులు వ్యాప్యత్వాసిద్ధమని వ్యవహరింతురు.

సూ:—కాలాత్యయాపదిష్టంబు కాలాతీతంబు—౯.

ఏహేతువునందు రెండుభాగము లుండునపు డందలి మొదటిభాగము రెండవదానికాలమువఱకు ననువర్తింపక

నశించునో యట్టిహేతువు కాలాతీతమని వ్యవహరింపఁబడును. "నిత్యశ్శబ్దః సంయోగవ్యఙ్గ్యత్వాత్, రూపవత్" "పటము నంగలి శుక్లనీలాదిరూపములు తేజస్సంయోగదశయందు మన కభివ్యక్తములగుచుండును. ఈ తేజస్సంయోగము లేనపు డా రూపములు మన కభివ్యక్తములు గాకున్నను బటమునం దుండకపోవు. ఇటులే భేరీదండసంయోగమువలన, దూరమున నున్నను మనకు శబ్ద మభివ్యక్త మగుచుండును. భేరికి దండ సంయోగము లేనపుడు మన కభివ్యక్తము గాకున్నను నాకస మున నుండియే తీఱును. కావున శబ్దము నిత్యమే" యనియు "దాని యభివ్యక్తిమాత్రము రూపాభివ్యక్తివలె సంయోగము వలనఁ గలుగుచుండు" ననియుఁ గొందఱూహింతురు. ఇట దృష్టాంతమున రూపాభివ్యక్తికాలమునఁ దేజస్సంయోగము దప్పక యుండవలయును. దూరస్థుఁ డగుపురుషునకు శబ్దాభి వ్యక్తి గలుగుకాలమున భేరీదండసంయోగం బుండనక్కఱ లేదు. రూపాభివ్యక్తి తేజస్సంయోగమును దప్పక యపేక్షించి నట్లు శబ్దాభివ్యక్తి భేరీదండసంయోగము నపేక్షింపదని భావము. దండముతో భేరినిగొట్టి యటనుండి దండమును దీసివైచినను మనకు శబ్దము స్పష్టముగ వినఁబడునుగదా! రూపాభివ్యక్తికిఁ దేజస్సంయోగమువలె శబ్దాభివ్యక్తికి దండసంయోగమే కారణ మగునన్నచో సంయోగములేనపుడు శబ్దము వినఁబడకుండవల యునుగదా! ప్రకృతమున హేతువుగ గ్రహింపఁబడిన 'సంయోగవ్యంగ్యత్వ'మున సంయోగము నభివ్యక్తి యను

రెండుభాగములు గలవు. అందభివ్యక్తికాలమునకు సంయోగ మతీత (వినష్ట) మగుటచే నిది కాలాతీత మనఁబడును.

"పంచావయవంబులలోఁ బ్రతిజ్ఞానమనంతరమే హేతువును నిరూపించుట సంప్రదాయము అట్లుగాక యుదాహరణాదులఁ జూపినవెనుక హేతువు నుపన్యసించినచో నయ్యది కాలాతీతం బని" కొందఱు ప్రకృతసూత్రమున కర్థాంతరము గల్పింతురు. కాని యయ్యది సమంజసముగాదు. పరస్పర సంబంధముగల యర్థములు దూరముగనున్నను నొకదానితో నొకటి యన్వయించుచునే యుండును. అసంబద్ధములయినచో సమీపముననున్నను బరస్పరాన్వితములు గానేరవు. కావున హేతువు దూరముగనున్నను నయ్యది ప్రతిజ్ఞావాక్యార్థముతోడనే యన్వయించి సాధ్యసాధక మగుచుండును. కావున నవయవోపన్యాసమునందలి పౌర్వాపర్యవిపర్యయమాత్రంబున హేతువు దుష్టమనరాదు. అవయవంబులను విపర్యస్తముగ నిర్దేశించుట 'యప్రాప్తకాలం' బనునిగ్రహస్థానం బని ముందు (౫-౨-౧౧) నిరూపింపఁబడును.

హేత్వాభాసప్రకరణము
సమాప్తము.

---

**సూ:—అర్థాంతరకల్పనఁబున వచనవిఘాతం ఛలంబు బునాఁబడు—౧౦.**

విజిగీషువులగువాదిప్రతివాదులు ప్రసంగించునెడఁ బ్రతిపక్షునివాక్యము నాక్షేపింపఁదగిన సదుక్తి స్ఫురింపనపు డా

వాక్యమున కర్థాంతరంబు గల్పించి ప్రతివాది నాక్షేపించుట ఛలమని వ్యవహరింపఁబడును. ఉదాహరణంబు మీఁద స్పష్టమగును.

**సూ:—వాక్ఛలంబు, సామాన్యచ్ఛలంబు, నుపచారచ్ఛలంబు నని యయ్యది త్రివిధంబు—౧౧.**

స్పష్టము.

**సూ:—సామాన్యాభిహితం బగువాక్యంబున కర్థాంతరకల్పనంబు వాక్ఛలంబు—౧౨.**

వాది యనేకార్థబోధకమగు సామాన్యవాక్యమును బ్రయోగించినపుడు వాదికి సమ్మతమగునర్థమును విడిచి వేఱొక యర్థము నావాక్యమునకుఁ గల్పించి దానింబట్టి వాదివాక్యము నాక్షేపించుట వాక్ఛల మనఁబడును.

వటువు నూతనమగుకంబలముగలవాఁ డనునభిప్రాయముతో "నవకమ్బలోఽయం మాణవకః" అని వాది ప్రయోగించును. నవకంబలశబ్దమునకుఁ దొమ్మిదికంబలములు గలవాఁ డనియునర్థము గలదు. వాది కనభిమతమగు నీరెండవయర్థమునే ప్రతివాది యిట గ్రహించి "న నవకమ్బలోఽయమ్" (ఒక్కటియగాని యాతనియొద్దఁ దొమ్మిదికంబలములు లేవు) అని వాది వాక్యమును నిషేధించును. ఇదియే వాక్ఛలము. ఇయ్యది దూషణాభాసంబుగాని దూషణము గానేరదు. ఇట్టి యాక్షేపణమును వారింపఁజాలక యుపేక్షించినచో వాది

నిగృహీతుం డగును. సమర్థుఁడగు వాది, పై యాక్షేపమును బరిహరించుకొనును. ఎట్లన;—

"నానార్థకశబ్దములు ప్రకరణా (సందర్భా) దులనుబట్టి యర్థవిశేషమునే బోధించును గాని తమకుఁ గలయర్థము లన్నిటిని నెల్లతావుల బోధింపవు. హరిశబ్దమునకు 'విష్ణువు, సింహము, పాము, కప్పు' మున్నగునర్థము లెన్నియో యున్నను "హరిం భజ" యనునెడ హరిశబ్దము విష్ణువునే బోధించునుగాని యితరములగుసింహాదుల బోధింపదుగదా! ఇటులే ప్రకృతమున నవశబ్దము మాణవకునివిషయమున సముచితమగు నూతనమను నర్థమునే బోధించునుగాని సంఖ్యావాచకంబు గా నేరదు. కావున నీదూషణంబు చెల్ల"దని వాది ప్రత్యవస్థాన మొనరించును. ఇట్టి ప్రత్యవస్థానముచేఁ బ్రతివాది పరాజితుం డగుచుండును.

సూ:—సంభవదర్థంబున కతిసామాన్యయోగంబున నసంభవత్త్వకల్పనంబు సామాన్యచ్ఛలంబు—౧3.

జాతిని సామాన్యమందురు. వివక్షితార్థము నతిక్రమించినజాతి యతిసామాన్యంబు. అట్టి యతిసామాన్యసంబంధమునుబట్టి యుపపన్నమగునర్థమును సయితము సిద్ధింపదని దూషించుట సామాన్యచ్ఛలంబని వ్యవహరింపఁబడును. "బ్రాహ్మణుఁడు విద్యాచారసంపన్నుఁ"డని యొకఁడు ప్రతిపాదించును. అదివిని వేఱొకఁడు బ్రాహ్మణత్వజాతినిబట్టి విద్యాచారసంపత్తిని సాధించుచున్నటులు పయివాక్యమును సమన్వయించి

"వ్రాత్యుఁడగు బ్రాహ్మణునియందు బ్రాహ్మణత్వమున్నను విద్యాచారసంపత్తి యుండదుగదా! కావున బ్రాహ్మణత్వ మతి సామాన్య మగుచున్నది ఇట్లగుటంబట్టి శిష్టవ్రాత్యోభయ సాధారణం బగు బ్రాహ్మణత్వము విద్యాచారసంపత్తిసాధకంబుగా గానేర"దని యాక్షేపించును

ఈయాక్షేపము విని, వాది "బ్రాహ్మణత్వము విద్యాచారసంపత్తి సాధకంబనుతలంపునఁ బయివాక్యమును బ్రయోగింపలేదనియుఁ, గావున బ్రాహ్మణులెల్లరును విద్యాచారసంపన్నులే యని పయిదాని కర్థముగాదనియు, వారిలోఁ బలువురట్టివారగుటచేఁ దత్ప్రశంసకయి యటులు ప్రయోగించితిననియుఁ, బ్రశంసలకయి యిట్టిప్రయోగములు లోకమునఁగలవనియు, "భూమియందు సస్యములు ఫలించును" అనువాక్యమునకు బీజావాపాదుల నపేక్షింపకయే భూమియం దెల్లచోటులను సస్యములు తమంతనే యుత్పన్నములై ఫలించు ననునర్థమును గ్రహించుట యుక్తముగాదనియుఁ, బ్రత్యవస్థాన మొనరింపవలసియుండును.

**సూ:—లక్షకప్రయోగంబుల ముఖ్యార్థగ్రహణంబున దూషించుట యుపచారచ్ఛలంబు—౧౪.**

అర్థంబు వాచ్యమనియు లక్ష్యమనియు ద్వివిధంబు. దానిని బోధించుశబ్దములును వాచకములనియు లక్షకములనియు రెండువిధములుగ నుండును. ఈద్వివిధశబ్దంబులకును లోకవ్యవహారంబు సుప్రసిద్ధంబు. "అఱపలపయినుండి పురుషు లఱచు

చున్నారు. అనుతాత్పర్యంబున "మఞ్చాః క్రోశన్తి" యని యొకఁడు ప్రయోగించును. ఇట మంచశబ్దమునకు మంచె (అటుప) యనునది వాచ్యార్థము. కాని యటుపలటుచుట సంభవింపదుగాన నిట మంచశబ్దము తత్రత్యులగుపురుషులను బోధించును. ఆపురుషులే యిట లక్ష్యార్థము. ఇట్టిలక్ష్యార్థమును గ్రహింపక పయివాక్యమునకు ముఖ్యార్థమునుమాత్రము గ్రహించి యటుపటుచునా యని యాక్షేపించుట యుపచారచ్ఛలంబు.

కాని యిట్టియెడ వక్తృతాత్పర్యానుసారంబుగ నర్థముల గ్రహింపవలయునేగాని తమయిచ్చవచ్చినచొప్పున వక్తకనభిమతమగునర్థమును గ్రహించి తద్వాక్యము నాక్షేపించుట దూషణాభాసంబుగాని దూషణంబు గానేరదు.

### సూ:—అర్థభేదంబున వాక్ఛలోపచారచ్ఛలంబులు భిన్నంబులు—౧౫, ౧౬, ౧౭.

ఇట వాక్ఛలంబునను నుపచారచ్ఛలంబునను వాదివాక్యమును దూషించుటలో నర్థాంతరకల్పనంబు దుల్యంబెగావున రెంటిని వేఱుగ నిరూపింప నేల యని శంక పొడమవచ్చును. కాని వాక్ఛలంబున "నవకమ్బలోయం మాణవకః" అనునెడ మాణవకునికి నవకంబలవత్త్వము విధేయమయియున్నది. ఆ విధేయమున నవత్వము విశేషణ మగుచున్నది. నవత్వమన నవీనత్వమని వాదితాత్పర్యము. ప్రతివాది నవత్వమన నవసంఖ్యావత్త్వమని గ్రహించి ప్రకృతవిధేయమునం దీవిశేషణ ముప

పన్నముగాదని దూషించెను. కాఁగా నిట నర్థాంతరకల్పనచే దూషితమగునది విధేయమున విశేషణంబు.

ఉపచారచ్ఛలంబున 'మఞ్చాః క్రోశన్తి' యనుచో మంచస్థపురుషులకు నాక్రోశనకర్తృత్వము విధేయమయియున్నది. ఇట మంచపదమునకు మంచస్థపురుషులని వాదితాత్పర్యము. ప్రతివాది మంచపదమునకు మంచెలను వాచ్యార్థమునే గ్రహించి వాని కాక్రోశనకర్తృత్వము సంభవింపదని దూషించెను. కాఁగా నిట నర్థాంతరకల్పనచే దూషితమగునది విధేయమే యగుచున్నది.

ఈరీతిని వాక్ఛలంబున దూషితంబు విధేయమున విశేషణంబును నుపచారచ్ఛలంబున దూషితంబు విధేయంబును నగుచుండుటచే రెంటికిని భేదము సుస్పష్టమని యెఱుంగవలయును.

మఱియు నిట్టిభేదముండినను నర్థాంతరకల్పనారూపసామ్యమునుబట్టి రెంటిని వేఱుపఱుపక యొక్కటిగనే నిరూపింపఁదలంచినయెడ దూషణసామ్యంబునుబట్టి సామాన్యచ్ఛలంబును సయితము పృథక్కరింపక ఛలమెల్ల నేకరూపంబె యని విభాగశూన్యముగఁ బ్రతిపాదింపవలసియుండును. పదార్థములకుఁ బరస్పరసామ్యమున్నను నవాంతరభేదములఁ బరికించి వానిని వేర్వేఱుగ శాస్త్రమున నిరూపించుట యావశ్యకంబు గదా!

ఛ ల ప్ర క ర ణ ము

స మా ప్త ము.

**సూ:—సాధర్మ్యవైధర్మ్యంబులఁ బ్రత్యవస్థానంబు జాతి యనంబడు—౧౮.**

వాది యొకయర్థమును నిరూపించునెడఁ బ్రతివాది కొన్నియుక్తుల నుపన్యసించి యద్దాని నాక్షేపించినచో వాది యుచితములగు ప్రతియుక్తులు దనకు స్ఫురింపనియెడ మధ్యస్థులకుఁ దనయందప్రామాణ్యజ్ఞానము గలుగకుండుటకయి సాధర్మ్య(సామ్య)మునుబట్టిగాని వైధర్మ్య(వైషమ్య)మునుబట్టిగాని ప్రతివాద్యుపన్యస్తములగుయుక్తులను ఖండించుట కుపయోగించెడిదూషణాభాసంబు జాతి యని వ్యవహరింపఁబడును. ఇటఁ బ్రతివాద్యుపన్యస్తమగుయుక్తి సాధర్మ్యమూలకమగుచో వైధర్మ్యమునుబట్టియు వైధర్మ్యమూలకమగుచో సాధర్మ్యమునుబట్టియు వాది ప్రత్యవస్థాన మొనరించుచుండును

"ఆత్మ యనిత్య" మని నాస్తికుఁ డుపన్యసించును. అట్టియెడఁ బ్రతివాది "గగనమువలె సర్వవ్యాపకము గావున నాత్మ నిత్య మనవలయు" నని గగనసాధర్మ్యంబున నాస్తికమతమును దూషించును. దానికిఁ దగినప్రతియుక్తి స్ఫురింపక నాస్తికుఁడు "సర్వవ్యాపకత్వరూపమగు గగనసాధర్మ్యంబున నాత్మ నిత్యమన్నచోఁ జేతనత్వరూపమగు గగనవైధర్మ్యంబును బట్టి 'యాత్మ యనిత్య' మని యేల యనరా" దని ప్రత్యవస్థాన మొనర్చును.

మఱియు నియ్యెడనే ప్రతివాది "యనిత్యములగుఘటాదులకులేని సర్వవ్యాపకత్వముండుటచే నాత్మ నిత్య మన

వలయు" నని ఘటాదివైధర్మ్యమునుబట్టి నాస్తికమతమును దూషించును. దీనికిఁ దగిన ప్రతియుక్తి స్ఫురింపక నాస్తికుఁడు "ఘటవైధర్మ్యంబున నాత్మ నిత్యమన్నచోఁ బదార్థత్వరూపమగు ఘటసాధర్మ్యమునుబట్టి యనిత్యమని యేల యనరా" దని ప్రత్యవస్థాన మొనరించును.

ప్రతివాద్యుపన్యస్తమగుయుక్తిని ఖండించుటకు నుద్భవించినదగుటచే జాతి యని దీనికి వ్యవహారము.

**సూ:—విప్రతిపత్తియు నప్రతిపత్తియు నిగ్రహస్థానంబులు—౧౯.**

సూక్ష్మవిషయమునుగాని స్థూలవిషయమునుగాని విపరీతముగ గ్రహించుట విప్రతిపత్తి. అప్రతిపత్తి యనఁ బరుని యుక్తి పయిఁ బ్రసంగించుపద్ధతి నెఱుంగకుండుట. అనఁగాఁ బరోక్తమును దూషింపఁజాలకుండుటయుఁ బరదూషితంబును ఖండింపఁజాలకుండుటయు నని తాత్పర్యము. ఈనిగ్రహస్థానంబులు పరాజయకారణంబులు.

**సూ:—తద్భేదంబుల జాతినిగ్రహస్థానంబులు బహుళంబులు—౨౦.**

సాధర్మ్యవైధర్మ్యంబులును విప్రతిపత్త్యప్రతిపత్తులును నానావిధంబులగుటచేఁ దద్భేదంబులంబట్టి జాతినిగ్రహస్థానంబులును ననేకవిధంబులని యెఱుంగునది. ఈయవాంతరభేదంబులెల్లఁ బంచమాధ్యాయంబున విపులముగ వివరింపఁబడును.

ఇట్లీఱంగున నీయధ్యాయంబు ననుద్దిష్టము లగు ప్రమాణాదిపదార్థములకెల్ల లక్షణంబులు వివరింపఁబడియె. ఆలక్షణములయుపపత్తి యిటమీఁదఁ బరీక్షింపఁబడును.

ఆంధ్రన్యాయదర్శనమునఁ బ్రథమాధ్యాయమున
ద్వితీయాహ్నికము
సమాప్తము.

శివాయ గురవే నమః.

# న్యాయ దర్శనము
## ద్వితీయాధ్యాయము.

---

### ప్రథమాహ్నికము.

**సూ:—సమానధర్మోపపత్త్యాదులంబట్టి సంశయంబు దుర్ఘటంబు—౧-౨-3-౪-౫.**

సమానధర్మోపపత్తి మున్నగువానివలన సంశయ ముదయించునని పూర్వము (౧-౧-౨3) నిరూపింపఁబడియె. ఆసంశయలక్షణము లెల్ల నిటఁ బరీక్షింపఁబడును.

I. సమానధర్మోపపత్తి యనుచో నుపపత్తిపదమునకు స్థితి(సత్త)మాత్రమే యర్థమనునెడ సమానధర్మసత్తామాత్రంబున సంశయ ముదయింపనేరదు. పురోవర్తివస్తువునం దట్టి సమానధర్మమున్నను నదియున్నటులు దెలిసినంగాని సంశయము గలుగనేరదుగదా! మఱియు సత్తగాక జ్ఞాన మర్థమన్నను "స్థాణుపురుషసమానధర్మ మిటఁ గలదు." అని తెలిసినవానికి ధర్మధర్మిజ్ఞానము స్పష్టముగ నుండుటచే సంశయ ముదయించుటెట్లు? ఇదిగాక స్థాణువా పురుషుఁడా యనుసంశయమునకు సమానధర్మజ్ఞానము కారణమగుట సంభవింపదు. ఏకపదార్థజ్ఞాన మపరపదార్థసంశయమునకుఁ గారణముగాదుగదా!

అదియునుగాక సమానధర్మనిశ్చయమువలన సంశయ ముద యించు టెట్లు? కార్యకారణముల కానురూప్యము సహజము గదా! మఱియు "స్థాణుధర్మసమానధర్మవానయమ్" అను జ్ఞానమువలనఁగాని "పురుషధర్మసమానధర్మవానయమ్" అను జ్ఞానమువలనఁగాని ప్రత్యేకముగ సంశయ ముదయించుట యనుభవవిరుద్ధము. "స్థాణుధర్మపురుషధర్మాన్యతరసమానధర్మ వానయమ్" అనుజ్ఞానమువలన సంశయ ముదయింపవచ్చునను టకు సయితము వలనుపడదు. సామ్యము భేదఘటితముగానఁ బురోవర్తివస్తువు స్థాణుధర్మములతోను బురుషధర్మములతోను సమానమగుధర్మముగలది యని తలంచువానికి నా రెండింటి ధర్మములకంటెను దీనిధర్మములు భిన్నములనియు నా రెండిటి కంటె నిది భిన్నమనియుఁ దెలియక దీఱదుగాన నిఁక సంశ యము గలుగు టెట్లు? ఇట్లే యనేకధర్మోపపత్తి యనునెడను బ్రశ్నము లూహించునది.

II. మఱియు విప్రతిపత్తిగాని యవ్యవస్థగాని జ్ఞాత ములు గాకుండ నవియున్నంతమాత్రమున సంశయము జనిం పదు. విప్రతిపత్తిమాత్రంబుగాక తద్జ్ఞానంబును నిటులే యవ్యవస్థాజ్ఞానంబును సంశయజనకంబు లగుననుటయుఁ బొసం గదు. ఏలయన నాత్మగలదని యాస్తికమతమనియు లేదని నాస్తికమతమనియు నెఱింగినవాఁ డాస్తికుఁడయినచో నాత్మ గలదనిగాని నాస్తికుఁడయినచో నాత్మలేదనిగాని యిటు లేదో యొకనిశ్చయమే గలిగియుండునుగదా! అట్టివాని కిఁక సంశయ

మెట్లుదయించును? ఇటులే యుపలబ్ధియు ననుపలబ్ధియు నవ్యవస్థితములని నిశ్చయముండునపుడు సంశయము సంభవించు టెట్లు?

III మఱియు విప్రతిపత్తి యన విరుద్ధార్థబోధకములగు రెండువాక్యములు. వీనింబట్టి యాస్తికపక్షమున నాత్మ గలదనియు, నాస్తికపక్షమున నాత్మ లేదనియు నిట్టిజ్ఞానములు రెండును నిశ్చయాత్మకములయి యుదయించును. ఈజ్ఞానముల కును విప్రతిపత్తి యనియే వ్యవహారము ఇట్టిజ్ఞానములవలన సంశయము గలుగునన్నచో సంప్రతిపత్తి (నిశ్చయము) వలననే సంశయము గలుగునన్నటులు పర్యవసితమగుచున్నవి. సంప్రతిపత్తివలన సంశయము గలుగుట యసంభవముగదా!

IV. మఱియు నవ్యవస్థ తనయందుఁ దాను వ్యవస్థితమగుచో నది వ్యవస్థయే గావలయునుగాని యవ్యవస్థ యగు టెట్లు? అది తనయందుఁ దాను వ్యవస్థితముగానిచోఁ దనయందు వ్యవస్థితముగాని పదార్థమునకుఁ బ్రపంచమున స్వరూపసిద్ధియే లేదుగావున నెట్లును నవ్యవస్థయనునది సిద్ధించుటయే దుర్ఘటము ఇట్లసిద్ధంబగు నవ్యవస్థవలన సంశయము సంభవించునా?

V. ఇవియన్నియుంగాక సమానధర్మోపపత్త్యాదులవలన సంశయ ముదయించునన్నచోఁ బురుషుఁడు దనకు సంశయము తొలఁగి నిశ్చయముగలిగినదని తలంచుసమయమున సయితము సంశయముండియే తీఱవలయును. ఏలయన మనుజుఁడు దూరస్థమగు నున్నతవస్తువును జూచినపు డయ్యది స్థాణువా పురు

షుఁడా యని సంశయించుట స్థాణుపురుషసాధారణమగు నౌన్నత్యమునుబట్టియేగదా! పిదప నాతఁడా వస్తువును సమీపించి స్థాణువనియో పురుషుఁడనియో నిశ్చయించిన పిమ్మటఁ గూడఁ దొలుతటిసంశయకారణమగు నౌన్నత్య మాస్యక్తియం దగపడుచునే యుండునుగదా! దానింబట్టి యామనుజుఁడా వ్యక్తిని జూచుచున్నంతకాల మాసంశయ ముండియేతీఱ వలయుఁగదా! కావున సంశయముదొలంగుటకు మార్గమే గానరాకున్నది.

అని యీరీతిని సంశయలక్షణవివేచనంబున నాక్షేపంబు లనేకంబులు పొడమవచ్చును. కాని యీక్రిందిరీతిని దత్పరి హారంబు లెఱుంగునది.

సూ:—విశేషాపేక్షం బగుసాధారణధర్మాధ్యవసా యంబున సంశయంబు సుఘటంబు—౬-౨.

I. సమానధర్మోపపత్తి యనుచో నుపపత్తిపదమును సత్తార్థకంబుగ గ్రహించినచో నట్టిసత్తామాత్రంబున సంశయోత్పత్తి దుర్ఘటంబే యగును. కావున నట నుపపత్తిశబ్దము జ్ఞానార్థకమనియే గ్రహింపవలయును. ఈయర్థము ప్రకృత సూత్రంబున "సాధారణధర్మాధ్యవసాయంబున" ననుపదముచే విశదపఱుపఁబడినది. "స్థాణుపురుషసమానధర్మ మిటఁగల" దని తెలిసినవానికి ధర్మధర్మిజ్ఞానముండినను స్థాణువందుం డెడివిశేష ధర్మమగుకోటరాదికము (తొఱ్ఱ మున్నగునది) గాని పురుషుని

విశేషధర్మమగు కరచరణాదికంబుగాని తెలియునంతదనుక సంశయముదయించుటఁ యనుభవవిరుద్ధంబుగాదు. ఇదిగాక యిట దేనియందు సాధారణధర్మజ్ఞానముగలిగినదో యావస్తువునం దే సంశయముదయించుచున్నదిగాని వేఱొకవస్తువునం దుదయించుటలేదు మఱియుఁ గార్యకారణముల కానురూప్యముండవలయుననుట సర్వసమ్మతంబు. వాని కానురూప్యమనఁ గారణముండునపుడు గార్య ముదయించుటయు నదిలేనపుడుదయింపకుండుటయుఁగదా! ఇట్టి యానురూప్యం బిట సంశయమునకును దత్కారణంబునకును స్పష్టముగ గోచరించుచునే యున్నది.

II మఱియు విప్రతిపత్త్యధ్యవసాయంబునను నుపలబ్ధ్యనుపలబ్ధ్యవ్యవస్థాధ్యవసాయంబునను సంశయము సంభవింపదనుటయుఁ బొసఁగదు. ఆత్మగలదని యాస్తికమతమనియు లేదని నాస్తికమతమనియుఁ బురుషునికి నిశ్చయముండినను నా రెండుమతములలో నొకటి యథార్థమనుటకుఁ దగినవిశేషము దెలియునందాఁక సంశయమే గలుగుచుండునుగాని తన్నివృత్తి సంభవింపనేరదు. ఇటులే యవ్యవస్థాధ్యవసాయంబునను సంశయోత్పత్తి యుపపన్నంబని యెఱుంగునది.

III. మఱియు సంశయకారణమగు విప్రతిపత్త్యధ్యవసాయమునకు సంప్రతిపత్తియనునామాంతరమును గల్పించినను నట్టికల్పనము మందబుద్ధులకు భ్రాంతియొదవించుటకు మూర

మగునేగాని యంతమాత్రమున దానికిఁ గలసంశయకారణ త్వము నివర్తింపనేరదు.

IV. అవ్యవస్థ తనయందుఁ దాను వ్యవస్థితమయినను విష యాంతరమున నవ్యవస్థితమే యగుచుండుటచే నయ్యది విష యాంతరమున సంశయమును గలిగించుట విరుద్ధము గానేరదు.

V. సమానధర్మోపపత్తియు విశేషాపేక్షయు సంశయోత్ప త్తికిఁ గారణంబులుగాని కేవల సమానధర్మోపపత్తి కారణంబు గాదు. కాఁగా నిశ్చయ ముదయించినపిదప విశేషాపేక్ష నశిం చునుగాన సమానధర్మోపపత్తియుండినను నద్దాన మరల సంశయ ముదయింపనేరదు.

శాస్త్రమునందుఁగాని వాదకథయందుఁగాని సంశయ పూర్వకపరీక్షయందుఁ బ్రతివాదిచే సంశయము ప్రతిషిద్ధమగు నపుడు పూర్వోక్తరీతిని సంశయోపపత్తిని నిరూపించునది. సంశయము సర్వపరీక్షావ్యాపకంబగుటచే నయ్యది ముందుగఁ బరిశీలింపఁబడినది.

సంశయపరీక్షాప్రకరణము

స మా ప్త ము.

**సూ:—కాలత్రయాసిద్ధింబట్టి ప్రత్యక్షాదులకుఁ బ్రమాణత్వంబు దుర్ఘటంబు—౨-౧-౧౦-౧౧.**

ప్రత్యక్షాది ప్రమాణములు ఘటాది ప్రమేయములకంటెఁ బూర్వకాలసిద్ధంబులో పరకాలసిద్ధంబులో సమకాలసిద్ధంబులో

యగుచు నర్థసాధకములు కావలయుఁగదా! ఇం దేపక్షము నంగీకరింతమన్నను నుపపత్తి గానరాకున్నయది. ఏలయనఁ, బ్రమాణమనఁగాఁ బ్రమాకరణము. జ్ఞానసాధనమని తాత్పర్యము. జ్ఞానమును గలిగించునపుడే ప్రత్యక్షాదులు ప్రమాణము లగుచుండును. ఇట్టి ప్రమాణము పూర్వసిద్ధమను మొదటిపక్షమున జ్ఞానరూపమగు ప్రమయుఁ బ్రమాణముతోపాటు ప్రమేయము కంటెఁ బూర్వమే సిద్ధించియుండవలయుఁగదా! అట్లయినచో "ఇంద్రియార్థసన్నికర్షోత్పన్నంబగుజ్ఞానంబు (ప్రమ) ప్రత్యక్షంబు" అనుసిద్ధాంతమునకు భంగము వాటిల్లును. ప్రమేయము కంటెఁ బూర్వమే సిద్ధించియున్న ప్రమను నింద్రియార్థసన్నికర్ష జన్యమనుట యుపపన్నము గాదుగదా!

మఱియుఁ బ్రమాణము ప్రమేయముకంటెఁ బరకాలమున సిద్ధించునను రెండవపక్షమున "మానాధీనా మేయసిద్ధిః" (ప్రమేయసిద్ధి ప్రమాణాధీనంబు) అనుసిద్ధాంతమునకు భంగము వాటిల్లును వస్తుజాలమెల్లఁ బ్రమేయమని వ్యవహరింపఁబడుట ప్రమాణమునుబట్టి సిద్ధించుటవలననేగదా! ప్రమాణముకంటె ముందుగనే సిద్ధించినవస్తువునకుఁ బ్రమేయమనువ్యవహార మెట్లు పొసంగును? మఱియుఁ బ్రమేయము పూర్వమే సిద్ధమగునెడఁ దదనంతరకాలికంబగు ప్రమాణంబునకుఁ బ్రయోజనం బేమి?

ఇఁకఁ బ్రమాణప్రమేయములు రెండును సమకాలసిద్ధంబులను మూఁడవపక్షమున జ్ఞానంబుల క్రమికోత్పత్తిసిద్ధాంతము

భగ్నమగును. ఏయే ప్రమేయములకుఁ బ్రత్యక్షము (చక్షురాదికము) ప్రమాణమగుచుండునో యాయాఘటపటాది ప్రమేయంబులును దత్ప్రమాణంబును బ్రమాణఘటకంబు లగుతద్ఘటపటాదిజ్ఞానంబులును నొక్కమాఱుగ నుదయించునని యీపక్షమున నంగీకరింపవలయుఁగదా!

ఈరీతిని బ్రమాణములకుఁ బ్రమేయములకంటెఁ బూర్వాపరకాలసిద్ధియు రెంటికిని సమకాలసిద్ధియుఁ బొసంగకుండుటచేఁ బ్రత్యక్షాదులకుఁ బ్రమాణత్వమును వస్తువులకుఁ బ్రమేయత్వమును సిద్ధింపకున్నదే యనుశంక గలుగవచ్చును. కాని

**సూ:—కాలత్రయాసిద్ధింబట్టి ప్రతిషేధంబును దుర్ఘటంబయగు—౧౨.**

ఏవస్తువునకయినను బ్రతిషేధకవాక్య ముండినపుడే ప్రతిషేధ్యమనువ్యవహారము ప్రవర్తిలుచుండును. ఇటులే యేవాక్యమునకైనను బ్రతిషేధ్య ముండినపుడే ప్రతిషేధకమనువ్యవహారము ప్రవర్తిల్లును. ఈరీతిని బ్రతిషేధ్యప్రతిషేధకవ్యవహారము పరస్పరసాపేక్ష మగుచుండును. కాఁగాఁ బ్రమాణప్రమేయములకు నాక్షేపకులొనర్చిన పూర్వాపరసహభావపరీక్షవలె నాక్షేపకుల ప్రతిషేధవాక్యమునకును బ్రతిషేధ్యమగు ప్రమాణత్వమునకును బూర్వాపరసహభావపరీక్ష ప్రసక్తమగుచున్నది. ప్రతిషేధ్యము సిద్ధింపకుండఁ బ్రతిషేధము సంభవింపదు

గానఁ 'బ్రతిషేధము పూర్వసిద్ధ' మనుట పొసంగదు. ప్రతిషేధ ము లేనపుడు వస్తువునకుఁ బ్రతిషేధ్యత్వము సంభవింపదు గానఁ 'బ్రతిషేధ్యము పూర్వసిద్ధమనియుఁ బ్రతిషేధము పశ్చాత్సిద్ధ మనియు' ననుటకు వలనుపడదు. ప్రతిషేధ్య ప్రతిషేధకములు సమకాలసిద్ధములగుచున్న చోఁ బ్రతిషేధ్యసిద్ధి నాక్షేపకులే యంగీకరించుచుండుటచేఁ బ్రతిషేధము వ్యర్థమగును. ఈరీతిని బ్రతిషేధవాక్య మనుపపన్నమగుటచేఁ బూర్వోక్తులయాక్షేప మునకే యవకాశము గానరాదు. మఱియు,

**సూ:—సర్వప్రమాణప్రతిషేధంబున నిషేధంబును ననుపపన్నంబయగు—౧౩.**

ప్రత్యక్షాదులకుఁ బ్రామాణ్యము దుర్ఘటంబనునాక్షేప మునఁ ద్రైకాల్యాసిద్ధి హేతువుగ గ్రహింపఁబడినది ఈ హేతువు సాధకమగుట కుదాహరణప్రదర్శన మావశ్యకము. ఇట దేని నుదాహరణముగఁ జూపినను నయ్యది ప్రత్యక్షమై యుండును గదా! ప్రత్యక్షాదులకుఁ బ్రమాణత్వము నంగీకరింపనిపక్షమున నప్రమాణమగును దాహరణము నిష్ప్రయోజనముగదా! ఉదా హరణము ప్రమాణమే యన్నచో నీహేతువు విరుద్ధమగు చున్నది. ఎట్లన; "ప్రత్యక్షాదులు ప్రమాణములు గానేరవు" అనునది యాక్షేపకులసిద్ధాంతముగదా! ఈసిద్ధాంతమునకు విరు ద్ధముగఁ బ్రత్యక్షమునకుఁ బ్రామాణ్యము నంగీకరించి యుదా హరణముం జూపి యన్స్థలమునఁ ద్రైకాల్యాసిద్ధిరూపమగు హేతు వుచే నీసిద్ధాంతమును సాధించినచోఁ బ్రకృతహేతువు విరు

ద్ధము (౧-౨-౬) గాకతీఱదు. ఈరీతి నుదాహరణసామాన్యమును దుష్టమును నగు హేతువునుబట్టి ప్రత్యక్షాదులకుఁ బ్రామాణ్యనిషేధ మెట్లు పొసంగును? ఇదియుఁగాక

**సూ:—తత్ప్రామాణ్యంబున సర్వప్రామాణ్యంబు సిద్ధంబు—౧౪.**

ప్రత్యక్షాదులకుఁ బ్రామాణ్యమును నిషేధించువాక్యార్థమున కనుకూలముగఁ జూపఁదలఁచిన యుదాహరణము మాత్రము ప్రమాణమందురని తుల్యన్యాయంబున సర్వప్రమాణములకును బ్రమాణత్వము సిద్ధింపకతీఱదు. మఱియుఁ దొలుతఁ బ్రత్యక్షాదిసర్వప్రమాణములకును బ్రమాణత్వమును నిషేధించి తత్పరిశీలనావసరంబునఁ బ్రత్యక్షవిశేషమగు నుదాహరణమునకుఁ బ్రామాణ్యము నంగీకరించినయెడఁ బ్రతిజ్ఞాహాని యనుదోషమును సంభవించును. ఇవన్నియు నిటులుండ,

**సూ:—త్రైకాల్యాసిద్ధి యనుద్భావ్యంబు—౧౫.**

లోకమున జ్ఞానసాధనమగు ప్రమాణమునకును జ్ఞానవిషయమగు ప్రమేయము (వస్తువు)నకును బూర్వసిద్ధత్వముగాని పరకాలసిద్ధిగాని సమకాలికత్వముగాని నియతమగుటకు వలను పడదు. అప్పటికపు డుద్భవించువస్తువు నంతకుమునుపే సిద్ధమయియుండిన సూర్యకాంతివలనఁ దెలిసికొనఁగలము గాన నిట్టియెడఁ బ్రమేయముకంటెఁ బ్రమాణము పూర్వసిద్ధమగుచుండునుగదా! మఱియు నావఱకుఁ జీఁకటిలోనుండినవస్తువు

లను దీపమువలనఁ దెలియఁగలుగుదుముగాన నిట్టియెడఁ బ్రమేయముకంటెఁ బ్రమాణము పరకాలసిద్ధమగుచుండును గదా! ఇదియుఁగాక ధూమమునుబట్టి వహ్నియున్నటులు దెలిసికొనునెడఁ బ్రమాణప్రమేయములు సమకాలసిద్ధములగుచుండునుగదా! ఈరీతిని బ్రమాణప్రమేయములకుఁ బూర్వాపరసహభావనియమము గానరాకుండుటచే, నట్టినియమము నొకదానిఁ గల్పించుటయు, దానింబట్టి ప్రమాణములకుఁ బ్రమాణత్వమును వస్తువులకుఁ బ్రమేయత్వమును సిద్ధింపవని నిషేధించుటయు సమంజసంబుగాదు మఱియు వస్తువులను దెలుపకుండునంతదనుక బ్రత్యక్షాదులకుఁ బ్రమాణములను వ్యవహారమును, బ్రమాణమును దద్ఘటకమగు ప్రమయుఁ బూర్వసిద్ధంబులు గాకున్నచో వస్తువులకుఁ బ్రమేయములను వ్యవహారమును బొసంగుటెట్లనియు సంశయింపఁ బనిలేదు. ఏలయనఁ జక్షురాదులకు జ్ఞానజనకత్వయోగ్యతయు ఘటాదులకు జ్ఞానవిషయత్వయోగ్యతయు సార్వకాలికములు. ఇట్టి యోగ్యతను బట్టియే చక్షురాదులు ప్రకృతమున జ్ఞానజనకములుగాకున్నను నటులే ఘటాదులు ప్రకృతమున జ్ఞానవిషయములుగాకున్నను వానికిఁ బ్రమాణములనియుఁ బ్రమేయములనియు వ్యవహారము ప్రవర్తిలుచున్నది. లోకంబున నిట్టియోగ్యతనుబట్టి వ్యవహృతంబులగుశబ్దము లనేకములు ప్రసిద్ధముగఁ గన్పట్టును. "వంటకయి పాచకుని బిలువుము" అని ప్రయోగింతురు. ఇట్టి యెడ నామనుజుఁడువచ్చి యింకను వంటచేయకుండఁగనే

యాతనికిఁ గలపాకక్రియాయోగ్యతనుబట్టి పాచకుఁ డనువ్యవహారము తొలుతనే సిద్ధించుచున్నది. ఈరీతిని ప్రమాణప్రమేయములను వ్యవహారమున కెట్టియనుపపత్తియుఁ గానరాదు.

ఇది యిటులుండ "కాలత్రయాసిద్ధింబట్టి ప్రత్యక్షాదులకుఁ బ్రమాణత్వంబు దుర్ఘటంబు" అను నీయాక్షేపవాక్యంబు ప్రత్యక్షాదులకు సిద్ధమయినప్రమాణత్వమును దొలఁగించునా? లేక ప్రత్యక్షాదులకుఁ బ్రమాణత్వమే సిద్ధింపదని బోధించునా? యని విమర్శింపవలసియున్నది. ప్రత్యక్షాదులకుఁ బ్రమాణత్వము సిద్ధమే యైయుండినయెడ నట్టిదానిని దొలఁగించుట కీవాక్యము సమర్థము గానేరదు. కావున నీవాక్యము ప్రత్యక్షాదులకుఁ బ్రమాణత్వము సిద్ధింపదని బోధించుననియే యనవలసియుండును ఇట్లు బోధించుటవలననే యీవాక్యము ప్రమాణము కావలయుఁగదా! ఈరీతి నొకయంశమును దెలుపుచుండుట వలన నీవాక్య మెట్లు ప్రమాణమగునో యటులే ఘటాదివస్తువులను దెలుపుప్రత్యక్షాదులును బ్రమాణములగుచుండును ఒకదానిని దెలుపుచున్నను నయ్యవి ప్రమాణములు గావని నచో నీవాక్యమునయితము ప్రమాణము గాకపోవలసియుండును.

**సూ:—తులవోలెఁ బ్రమాణంబులును బ్రమేయంబులగుచుండు—౧౬.**

లోకమున నొకేవస్తువునకు నిమిత్తభేదములంబట్టి వ్యవహారములు మాఱుచుండును. శ్రీరాముఁడు దశరథునకుఁ

బుట్టుటచేఁ గుమారుఁడనియుఁ గుశలవులను గనుటచేఁ దండ్రి యనియు వ్యవహరింపఁబడునుగదా! ఒంటెసిబ్బితక్కెడ (తున కాలు)ను గ్రొత్తగా సరిపుచ్చునపుడు వీసెటాయి మున్నగు వానితోఁ బడిగట్టి పిదప వస్తువులన్నియు దానితోఁ దూఁచు కొనువాడుక గలదు. మొదటఁ బడిగట్టునపుడు తక్కెడను బ్రమేయమనియు నితరవస్తువులను దూఁచునపుడు ప్రమాణ మనియు వ్యవహరింతుము. ఈరీతిగనే ప్రత్యక్షాదులును నొక చోఁ బ్రమాణములనియు వేఱొకచోఁ బ్రమేయములనియు వ్యవహరింపఁబడుచుండును. ఎట్లన; చక్షురింద్రియము (ప్రత్యక్ష ప్రమాణము) ఘటాదులను దెలుపుటచేఁ బ్రమాణమనియుఁ దానున్నటులు మనకుఁ దెలియుటచేఁ బ్రమేయమనియు వ్యవ హరింపఁబడును. ధూమము (అనుమానప్రమాణము) వహ్నిని దెలుపుటచేఁ బ్రమాణమనియు మనకుఁ దెలియుటచేఁ బ్రమేయ మనియు వాడఁబడుచుండును మఱియు శబ్దప్రమాణ మర్థ మును బోధించుటచేఁ బ్రమాణమనియు మనకు వినవచ్చుటచేఁ బ్రమేయమనియు వ్యవహరింపఁబడుచున్నది. ఇటులే యాత్మ, జ్ఞానవిషయమగుటచేఁ బ్రమేయమనియు జ్ఞానాశ్రయమగు టచేఁ బ్రమాతయనియు వ్యవహరింపఁబడును ఒకజ్ఞానము వేఱొకజ్ఞానమునకు సాధనమగునపుడు ప్రమాణమనియువిషయ మగునపుడు ప్రమేయమనియు నట్లును గానపుడు ప్రమితి యనియు వాడఁబడుచుండును.

పూర్వోక్తరీతిని బ్రత్యక్షాదులు ప్రమేయము లగుచుండుటంబట్టియు "దీనిని బ్రత్యక్షముచేఁ దెలిసికొంటిని దీని ననుమానముచేఁ దెలిసికొంటిని" యున్నగు లోకవ్యవహారములంబట్టియుఁ బ్రత్యక్షాదిప్రమాణములు జ్ఞానవిషయములని సిద్ధమగుచున్నది. కాఁగాఁ బ్రమాణజ్ఞానము ప్రమాణాంతరజన్యమా లేక స్వతస్సిద్ధమా యని పరిశీలింపవలసియున్నది.

**సూ:—ప్రమాణాంతరసిద్ధిప్రమాణవైయర్థ్యప్రసంగంబులఁ బ్రమాణసిద్ధిదుర్ఘటంబు—౧౭,౧౮.**

ప్రత్యక్షాదిప్రమాణములు వేఱొకప్రమాణముచే సిద్ధించు నన్నయెడఁ బ్రత్యక్షానుమానోపమానశబ్దంబులు నాలుగే ప్రమాణములను సిద్ధాంతమునకు భంగము వాటిల్లును. మఱియుఁ బ్రత్యక్షాదులు వేఱొకప్రమాణమువల్లను నయ్యది యింకొకప్రమాణమువల్లను నయ్యది మఱొక్కదానివల్లను సిద్ధించుననుటలో ననవస్థయు సంభవించును. ఇట్లుగాక ప్రమాణములు స్వతస్సిద్ధములగునన్నచో నట్లె ప్రమేయమును స్వతస్సిద్ధమే యగును గావునఁ దత్సిద్ధికయి ప్రమాణముల నంగీకరింపనేల? అనుశంక గలుగవచ్చును. కాని,

**సూ:—ప్రదీపప్రకాశంబువోలెఁ దత్సిద్ధియు సుఘటంబు—౧౯.**

దీపకాంతి చీఁకటిలోనివస్తువులను మనకుఁ దెలుపుచుఁ జక్షురింద్రియమునకు సహకారియగుచుండుటచే నిదియుఁ

ప్రత్యక్ష ప్రమాణ మగుచుండును. ఇట్టి దీపకాంతిని మనము చక్షురింద్రియముచేఁ దెలిసికొందుము. కాఁగా నొక ప్రత్యక్ష ప్రమాణము వేఱొక ప్రత్యక్షముచే గృహీతమగునటులు దేలుచున్నది. మనకుఁ గలుగు ఘటాదివస్తుజ్ఞానమువలనఁ జక్షురాదీంద్రియములు మనకుఁ గలవనియుఁ జక్షురాదులకును దత్తద్వస్తువులకును సన్నికర్షముగలదనియు నూహింతుము. కాఁగా నీరెండు ప్రత్యక్షములును ననుమాన ప్రమాణముచే సిద్ధించునని తేలుచున్నది ఈరీతిని బ్రత్యక్షాదులు ప్రమాణచతుష్టయములో నేదో యొకదానివలన సిద్ధించుచుండునేగాని వీనికై యతిరిక్తమగు ప్రమాణము నంగీకరింపఁబనిలేదు. ఇయ్యవి స్వతస్సిద్ధములును గావు

ఈయిరీతిని నొక ప్రత్యక్షము వేఱొక ప్రత్యక్షముచే గృహీతమగుచుండునుగానఁ దనచేఁ దాను గృహీతమగుట విరుద్ధమగుటకును నవకాశము గానరాదు. మఱియుఁ బరిశీలింపఁ గొన్నియెడలఁ దనచేఁ దాను గృహీతమగుటయు ననుభవవిరుద్ధముగాదు ఎట్లన; "నేను సుఖముగలవాఁడను. నేను దుఃఖముగలవాఁడను" అనునెడఁ దనచేఁ (ఆత్మచే) దానును (ఆత్మయు) దనసుఖదుఃఖములును గ్రహింపఁబడుట యనుభవసిద్ధముగదా! ఇటులే "నామనస్సు స్వస్థముగలేదు" అనుచో మనసుచే మనస్సు గ్రహింపఁబడుటయు ననుభవసిద్ధమే యగుచుండును ఇట్టియెడ మనస్సహకారముచే నాత్మయు నాత్మసహకారముచే మనస్సును దన్నుఁదాను గ్రహించురీతిగ సన్నికర్ష

సహకారంబునఁ బ్రత్యక్షము ప్రత్యక్షమును గ్రహించుచుండును.

సదసద్రూపమగు సకలప్రపంచమును బ్రత్యక్షాది ప్రమాణచతుష్టయము చేతనే గృహీతమగుచుండునుగాన నతిరిక్తప్రమాణము నంగీకరింపఁబనిలేదు.

క్రింద ఱేట "దీపము ఘటాదిప్రకాశకమయ్యు స్వప్రకాశమునఁ బ్రకాశాంతరనిరపేక్షమగునటులు ప్రమాణములు ఘటాదిప్రమేయసాధకములయ్యును స్వసిద్ధిని బ్రమాణాంతరనిరపేక్షములే యగుచుండు" నని తగినహేతువును జూపకయే ప్రదీపదృష్టాంతమాత్రంబునఁ బ్రమాణములస్వతస్సిద్ధిని సాధింపఁజూతురు. కాని వీరిమతమున విశేషహేతూపన్యాసములేని యీదృష్టాంతము ప్రమాణములకు స్వతస్సిద్ధిని సాధింపఁగలిగిన యెడ నిటులే ప్రమేయములకును స్వతస్సిద్ధి నేల సాధింపరాదు? కాఁగా దీసింబట్టి ప్రమేయసాధకముగఁ బ్రమాణములనుసయితమంగీకరింపఁబనిలేదని తేలుచున్నది. మఱియు హేతుశూన్యమగుదృష్టాంతమాత్రమున నిట్టియంశమును సాధింపఁగడంగినచో మఱియొకదృష్టాంతము చే విరుద్ధమగు మఱొకయంశముసయితము సిద్ధింపవలసియుండును. ఎట్లన; ఘటములేకున్నచో ఘటరూపము మనకుఁ దెలియదుగాన ఘటరూపమునకు ఘటము ప్రకాశకమని తేలుచున్నది. మఱియు నంధకారమున ఘటముండినను దద్రూపమును దీపములేనిచో గ్రహియింపఁజాలము. కాఁగా ఘటరూపప్రకాశకమగుఘటము

దీపము నపేక్షించినటులు ప్రమేయసాధకములగు ప్రమాణములు ప్రమాణాంతరసాపేక్షములను నీవిరుద్ధాంశముసయితము సిద్ధింపవచ్చునుగదా! కావున సహేతుకమగుదృష్టాంతమే యెల్లయెడల సాధ్యసాధకమగునుగాని హేతురహితమగుదృష్టాంతమెట్టియంశమును సాధింపఁజాలదని తేలుచున్నది.

పయిరీతిని బ్రత్యక్షాదిప్రమాణములు స్వతస్సిద్ధములనుటకు వలనుపడదు. ఇయ్యవి యీనాలుగిటిలోనే యేదో యొకదానివలన సిద్ధించుచుండునుగావున వీనిసిద్ధికయి ప్రమాణాంతరాపేక్ష లేకుండుటచే ననవస్థయు సంభవింపదు. లోకమునఁ బురుషునికి ధర్మార్థకామమోక్షసాధనమగుజ్ఞానమును, బురుషార్థబాధకములను బరిత్యజించుట కుపకరించుజ్ఞానమును నీప్రమాణచతుష్టయంబువలననే సిద్ధించుచుండును.

ప్రమాణసామాన్యపరీక్షాప్రకరణము
స మా ప్త ము.

---

**సూ:—అసమగ్రవచనంబునఁ బ్రత్యక్షలక్షణం బనుపపన్నంబు—౨౦-౨౧-౨౨.**

ఇంద్రియార్థసన్నికర్షోత్పన్న మగుజ్ఞానము ప్రత్యక్షమని ప్రత్యక్షలక్షణంబున (౧-౧-౪) నిరూపింపఁబడియె. ఆత్మ మనస్సుతోడను మన స్సింద్రియముతోడను నింద్రియము లర్థములతోడను గలిసినంగాని ప్రత్యక్షజ్ఞాన ముదయింపదు.

కావున నాత్మమనస్సంయోగమును నింద్రియమనస్సంయోగ మును సయితము ప్రత్యక్షజ్ఞానకారణములుగ నిరూపింపవల యునుగదా! మఱియు నింద్రియార్థసన్నికర్ష మున్నపుడు ప్రత్యక్ష ముదయించుటచేఁ దత్సన్నికర్షమును గారణముగ నంగీకరించినపుడు కాలదిగాకాశము లున్నపుడే ప్రత్యక్షము గలుగునుగానఁ గాలమును దిక్కును నాకాశమును సయితము ప్రత్యక్షకారణములుగ నంగీకరించుట యుక్తముగదా! ఒక వేళఁ గాలదిగాకాశసన్నిధి తప్పనిదగుటచేఁ బ్రత్యక్షోదయ కాలమున సంభవించినను నింద్రియార్థసన్నికర్షమునకువలె నన్వయవ్యతిరేకములు లేకుండుటచేఁ గాలాదులు కారణములు గావన్నను నాత్మమనస్సంయోగమును నింద్రియమనస్సంయోగ మును గారణములుగ నిరూపింపకతీఱదుగదా! అటులు నిరూ పింపకుండుటచే నీలక్షణ ముపపన్నము గానేరదు? అనుశంక కిట నవకాశముగలదు. కాని,

**సూ:—జ్ఞానాదిలింగకమనుటంజేసి యాత్మాదికం బును సంగృహీతంబ—౨౩-౨౪-౨౫.**

జ్ఞాన మాత్మలింగమనియు, (౧-౧-౧౦) యుగపద్ జ్ఞానానుత్పత్తి మనోలింగమనియుఁ (౧-౧-౧౬) బూర్వము నిరూపించియుండుటచే నాత్మమనస్సంయోగమును నింద్రియ మనస్సంయోగమును జ్ఞానసామాన్యకారణములని యంగీకరించి నటులే తేలుచున్నది. అయినను నింద్రియార్థసన్నికర్షము

ప్రత్యక్షజ్ఞానమున విశేషకారణమగుటచేఁ దల్లక్షణమున నదియే ప్రధానముగ నిరూపింపఁబడియెనని యెఱుంగునది. తత్ప్రాధాన్యం బెట్టిదనిన;

సూ:—సుప్తవ్యాసక్తులంబట్టియు వ్యపదేశముంబట్టి యు నింద్రియార్థసన్నికర్షంబు ప్రధానంబు—౨౬-౨౭-౨౮-౨౯.

లోకమునఁ బురుషుఁడొకప్పు డొకపరిమితకాలమునకు మేలుకొన నిశ్చయించికొని నిద్రించి యటు లానిర్ణీతసమయము నకు మేల్కాంచును. ఇట్టియెడ నాత్మప్రేరితమనోవ్యాపారముచే నాతనికిఁ బ్రబోధముగలుగును. మఱియొకప్పు డాతని నిర్ణీత కాలమునకుఁ బూర్వమే తీవ్రమగుధ్వనివలననో స్పర్శవలననో మెలఁకువ గలుగుటయు సంభవించును. అట్టియెడ నాత్మ ప్రేరితమనోవ్యాపారముచేఁగాక యింద్రియార్థసన్నికర్షంబుననే ప్రబోధముగలుగును. మఱియుఁ బురుషుఁడొకప్పు డొకవిష యమును దెలిసికొన నెంచి యాత్మప్రేరితమగుమనస్సు నింద్రి యములతోఁగూర్చి తత్కాలమున నావిషయమును గ్రహించును. వేఱొకసమయమున నిస్సంకల్పుఁడై యుండునపుడుగాని విష యాంతరమును దలపోయునపుడుగాని యెదుటనుండువస్తువులు గోచరించుచుండును. అట్టియెడ నింద్రియార్థసన్నికర్షమును బట్టియే ప్రత్యక్ష ముదయించుచుండును. కాఁగా సుప్తవ్యా సక్తుల కుదయించెడిప్రత్యక్షమున నింద్రియార్థసన్నికర్షమే ప్రధానమగుట తేటపడుచున్నది.

ఇట్టిదొడసయితము జ్ఞానసామాన్య కారణ మగునాత్మ మనస్సంయోగమును నింద్రియమనస్సంయోగమును నుండియే తీఱును. కాని యిట వ్యాపృతమగుమన స్సాత్మప్రేరితముగాక యదృష్టప్రేరితమగు చుండును. అదృష్టమన సర్వకార్య కారణంబయి ధర్మాధర్మములని వ్యవహరింపఁబడుచు నాత్మయందుండెడి విశేషగుణంబు. సృష్ట్యాదిని బృథగ్భూతములగు పరమాణువులు చలనక్రియచే సంయుక్తములగుటంబట్టి ద్వ్యణుకాదిక్రమంబునఁ బృథివ్యాదిభూతంబులును నస్మదాదిశరీరంబులును నుద్భవిల్లును. ఈరీతిని జగదుత్పత్తికి మూలకారణంబగుపరమాణు చలనంబున కీయదృష్టమే నిమిత్తంబని యెఱుంగవలెను.

మఱియు లోకమునఁ జాక్షుషమనియు రాసనమనియు, నిటులే రూపజ్ఞానమనియు రసజ్ఞానమనియు నీరీతిని బ్రత్యక్షజ్ఞానముల నింద్రియార్థసంబద్ధములుగ వ్యవహరించుటంబట్టియు నింద్రియార్థసన్నికర్షంబునకుఁ బ్రాధాన్యము విదితమగుచున్నది.

**సూ:—ఏకదేశగ్రహణజం బగునుపలబ్ధింబట్టి ప్రత్యక్షంబు ననుమానంబయగు—30.**

ఇంద్రియార్థసన్నికర్షోత్పన్నంబగుజ్ఞానంబు ప్రత్యక్షంబని నిరూపింపఁబడియెఁగదా! మనుజుఁ డొకవృక్షమును గాంచునపుడు దానిమూలభాగమును జూచినంతనే యిది వృక్షమను జ్ఞాన ముదయించును. ఇచట నేకదేశగ్రహణంబునఁగలిగెడి వృక్షజ్ఞానమునకును ధూమజ్ఞానముచేఁ గలిగెడి వహ్నిజ్ఞానము

నకును భేదము గానరాదు. కావున నియ్యెడ వృక్షమనెడి ప్రత్యక్ష మనుమానంబె యనవలసియున్నది.

మనకు గోచరించెడి ప్రతివస్తువును నవయవసముదాయ రూపమే యని యొకమతమును నట్లుగాక యవయవములకూడిక చే వానికంటె వేఱుగ నేర్పడిన యవయవిరూపమని వేఱొక మతమును గలవు. ఇందు మొదటిమతమున వృక్షదర్శనమునఁ దొలుత నింద్రియముచే గ్రహింపఁబడినభాగమునందలి యవయవములకంటె నతిరిక్తములగునవయవములు గృహీత మగుచుండును. రెండవమతమునఁ బయిరీతి నతిరిక్తావయవములును వేఱుగ నేర్పడినయవయవియు గృహీతమగుచుండును. కాఁగా వహ్నిధూమములకుఁబోలె నియ్యెడను జ్ఞాప్యజ్ఞాపకములకు భేదము స్పష్టముగ గోచరించుచునే యున్నది కావున నను మానమువలననే ప్రత్యక్షము గతార్థమనరాదా యనుశంక పొడముఁదగును కాని,

**సూ:—ఏకదేశగ్రహణంబునఁ బ్రత్యక్షంబు పృథక్ప్రమాణంబయగు—౩౧.**

అవయవసముదాయమే యవయవి యనుమతమున నేక దేశగ్రహణముచేఁ దక్కినయవయవములు గృహీతములగు నపుడు వృక్షజ్ఞానము గలుగుట సంభవింపదు. చక్షురింద్రియ ముచే గృహీతమగు వృక్షైకదేశ మెటులు వృక్షము కానేరదో యటులే మిగిలినయేకదేశమును వృక్షము కాఁజాలదుగదా! ఒకప్పుడు మనకు గోచరించినవృక్షభాగమునుబట్టియు దీనిచే

నూహింపఁబడిన భాగాంతరమునుబట్టియు వృక్షజ్ఞాన ముదయించునన్నను నయ్యది యనుమితియనుటకు వలనుపడదు. ఆక్షేపకులమతముననయినను గోచరించినభాగముచే భాగాంతరమూహింపఁబడుచుండుటచే నయ్యదిమాత్రమే యనుమితియగునుగాని తదుత్తరకాలికమును దదుభయానుసంధానజన్యమును నగువృక్షజ్ఞాన మనుమితికానేరదుగదా! ఇఁక నవయవాతిరిక్తమగు నవయవిగల దను రెండవమతమునను ననుమితిగలుగవలయునన్న గోచరించుభాగమునకును నూహింపఁబడు నవయవికిఁగల నియతసంబంధము దెలియవలయుఁగదా! అది తెలియుటకు ముందుగఁ దత్సంబంధులగు నేకదేశమును నవయవియు వేర్వేఱుగ గృహీతములయి యుండవలయుఁగదా! అటులయినచో నవయవి పూర్వమే గృహీతమగుటచే నటమీఁద నీయనుమితికిఁ బ్రసక్తియేమి? ఈసంబంధులు రెండును బూర్వము గృహీతములు గావన్నచో సంబంధిజ్ఞానమూలకమగు సంబంధజ్ఞానము లేకుండుటచే ననుమితి సంభవించుటయెట్లు? కావున నేకదేశగ్రహణముచేఁ గలుగువృక్షజ్ఞాన మనుమితియనుట యెట్లును బొసంగకున్నది.

ఇది యిటులుండఁ దొలుత వృక్షైకదేశము చక్షురింద్రియముచే గ్రహింపఁబడుననియుఁ దద్జ్ఞానము ప్రత్యక్షమనియు నాక్షేపకులుసయిత మంగీకరింపకతీఱదుగదా! కావున నిట్టియెడఁ బ్రత్యక్షము పృథక్ప్రమాణమగుట సర్వసంప్రతిపన్నమగుటచేఁ

ప్రత్యక్షమెల్ల ననుమానముచే గతార్థమనుట యెట్లు పొసంగును?

మఱియు లోకమున మనుజుఁడు నియతసంబంధముగల వహ్నిధూమములను మహానసాదులందు ముందుగఁ జూచి పిదప వేఱొకతావున ధూమ మగపడినచో దానింబట్టి వహ్ని నూహించును ఈరీతి ననుమానమెల్లఁ బ్రత్యక్షపూర్వకమే యగుచుండుటచేఁ బ్రత్యక్ష మనుమానాంతర్గతమనుట మిక్కిలి యసంగతము మఱియు దూరముగఁ బరిశీలింపు;

**సూ:—అవయవిసద్భావంబున నేకదేశమాత్రోపలబ్ధియు నసంభావ్యంబు—౩౨.**

ఆక్షేపకులు నిరూపించినచొప్పున వృక్షమునుజూచిన తోడనే కొన్నియవయవములుమాత్రమే గ్రహింపఁబడుటయు సంభవింపదు. అట్టియెడ నాయవయవములతోపాటుగఁ దత్సహచరితమగునవయవియు గ్రహింపఁబడుచునే యుండును. ఒకవృక్షభాగమును జూచినంతనే యిది వృక్షమని మనము నిర్ణయింపఁగలుగుట యెల్లరకు ననుభవసిద్ధముగదా!

ఇట నిఖిలావయవపర్యాప్తమగు నవయవి కతిపయావయవగ్రహణంబున నెట్లు గృహీతమగునని శంకింపఁబనిలేదు. అవయవసముదాయపర్యాప్తమగు నవయవి ప్రత్యేకముగ నొక్కొకయవయవముతోడ సయితము సంబద్ధమగుచునే యుండును. కావున సముదాయమునందలి కొన్నియవయవ

ములు గృహీతములయినను వానిని విడిచియుండనియవయవియు గృహీతమగుట కెట్టి ప్రతిబంధకమును గానరాదు.

మఱియు నిట నవయవాతిరిక్తముగ నవయవియే లేదని కొండఱు (బౌద్ధులు) తలంతురు అది సమంజసంబుగాదు ఏల యన; వీరిమతమున వృక్షైక దేశముతోఁ జక్షురింద్రియమునకు సన్నికర్షము గలిగినపిదప వృక్షజ్ఞాన ముదయించుటకే యవకాశము గానరాదు. మూలము, స్కంధము, కొమ్మలు, ఆకులు మున్నగు వానిసముదాయముగాని లేక వీనిసంయోగముగాని వృక్షమని వీరందురు. సముదాయరూపమగు వృక్షమునందలి సకలావయవములతోఁ జక్షురింద్రియమునకు సన్నికర్షము దుర్ఘటముగానఁ దత్సముదాయగ్రహణంబుగాని తత్సంయోగగ్రహణంబుగాని సంభవింపదుగదా! కావున నతిరిక్తమగు నవయవి నంగీకరింపవలసియున్నది.

**సూ:—సర్వగ్రహణ ధారణాద్యుపపత్తింబట్టి యవయవి సిద్ధంబు—33-34-35.**

పూర్వసూత్రమున నవయవాతిరిక్తముగ నవయవియున్నటులుమాత్రము నిరూపింపఁబడెనేగాని తత్సద్భావసాధకములగు హేతువులు ప్రతిపాదింపఁబడకుండుటచే నయ్యది యెట్లు సిద్ధించునని సంశయింపవలదు. ఏలయన; లోకమున మనుజునకుఁ జక్షుస్సన్నికర్షానంతరము "ఇది ఘటము" అను జ్ఞాన ముదయించుచున్నది. అతిరిక్తముగ నవయవి లేదనియుఁ బరమాణువులుమాత్రమే సముదాయరూపంబున నుండుననియు

నంగీకరించినచో నతీంద్రియము లగుపరమాణువులు ప్రత్యక్ష గోచరములగుట యెట్లు సంభవించును? మఱియు ధారణము, (పట్టుకొనుట) ఆకర్షణము (లాగుట) మున్నగు క్రియలు పర మాణువులం దుపపన్నములు కావుగదా! కావున ఘటపటాదుల ప్రత్యక్షమునుబట్టియు ధారణాకర్షణాదులఁబట్టియు నతిరిక్త మగు నవయవి నంగీకరింపక తీఱదు.

ఇటఁ గొందఱు "అదృశ్యపరమాణుపుంజమువలన దృశ్య పరమాణుపుంజ మేర్పడుటచే వస్తుప్రత్యక్ష ముపపన్నమగును. ధారణాకర్షణము లవయవి లేకున్నను సిద్ధించును. ఎట్లన; మృత్పిండాదులగు (మట్టిముద్ద మున్నగు) కొన్ని వస్తువులందు జలసంయోగమువలనను సూక్ష్మములగు స్వర్ణశకలాదులగు (బంగారునలుసులు మున్నగు) కొన్ని వస్తువులందుఁ దేజస్సం యోగమువలనను ధారణాకర్షణములు ప్రత్యక్షసిద్ధము లగు టం జేసియు, జలాదిసంయోగము లేనియపుడు పాంసురాశి (ధూళి) మున్నగువానియందు ధారణాకర్షణయోగ్యత లేమిం జేసియు జలాదిసంయోగమే ధారణాకర్షణసాధనమని తేలు చున్నది. మఱియు విజాతీయములగు కొన్ని వస్తువులను జిగురు మున్నగువానిచే నొకదానికొకటి యదికినపుడు వేఱొకయవ యవి సిద్ధింపదుగాన నట్టియెడ ధారణాదిసాధన మవయవి యనుటకు వలనుపడదు. కాఁగాఁ బ్రత్యక్షమునుబట్టియు ధార ణాదులంబట్టియు నతిరిక్తావయవి యెట్లు సిద్ధించును." అని శంకిం తురు. కాని మన మొకవస్తువును జూచినపుడు 'ఇది యొక్కటి'

అనుష్ఠాన ముదయించును. ఈయేకత్వబుద్ధి యతిరిక్తావయవి నంగీకరింపనివారిమతమున ననుపపన్నమగుచున్నది. అనేకపరమాణువులం దేకత్వము సంభవింపదుగదా!

**సూ:—అణువుల యతీంద్రియతచే సేనావనాదిదృష్టాంతంబును దుర్ఘటంబు—౩౬.**

సేనాంగములగు హస్త్యశ్వరథపదాతులును వనాంగములగు తరులతాగుల్మాదులును దూరమునుండి వేఱువేఱుగ నగపడనపు డేనుఁగులు గుఱ్ఱములు మున్నగురీతినిగాని వృక్షములు లతలు మున్నగురీతినిగాని వ్యవహరింపక యది యొకసేన యనియు నది యొకవనమనియు వ్యవహరింతుము. ఇటులే పరమాణువులు వేఱువేఱుగ గ్రహింపఁబడనపుడు పరమాణుపుంజమునందు "ఇది యొకఘటము" మున్నగురీతిని నేకత్వవ్యవహారము పొసఁగవచ్చునని శంకింపఁజనదు. దూరముననున్నపుడు సేనాంగములును వనాంగములును బ్రత్యేకముగ గ్రహింపఁబడకున్నను సమీపించినపు డయ్యవి వేఱువేఱుగ మనకు గోచరించుట కనువుపడియుండును. ఘటాదులందలి పరమాణువులెన్నఁడును నింద్రియగోచరములు కానివగుటచే సమీపమున నున్నను వానిని వేర్వేఱుగ గుఱుతింపఁజాలము. కాఁగా దూరమునందున్నను సేనాంగములగు గజతురగాదుల పార్థక్యము గృహీతముగాకున్నను వానిస్వరూప మేదో యొకతీఱున నగపడుచునేయుండునుగాన, నట్టియెడ నౌపచారికమగు నేకత్వబుద్ధి సంభవింపఁదగును. పరమాణుస్వరూపము బొత్తిగా నగ

పడదుగాన నిట్టియెడ నేకత్వబుద్ధి యౌపచారికముగనైన సంభ
వించుట కవకాశము గానరాదు. ఈరీతి నిట దృష్టాంతదార్ష్టాం
తికములకు భేద మగపడుచున్నది. ఇంతియగాక యిట సేనావ
నాదులను దృష్టాంతముగఁ జూపుటయే ప్రాసంగదు. ఏలయన;
అవయవాతిరిక్తముగ నవయవి లేదనుమతమున సేనావనాదు
లందుసయితము గృహీతమగునది పరమాణుపుంజమే యగుటచే
నదియుఁ బ్రత్యక్షమగుట దుర్ఘటమేగానఁ బ్రకృతమగుఘటాది
బుద్ధివలె సేనావనాదిబుద్ధియు నతిరిక్తావయవి విషయకమా లేక
పరమాణుపుంజమాత్రవిషయకమా యని పరీక్షింపవలసియే
యున్నదిగదా! నిర్ణీతముగాక యింకను బరీక్షార్హమగునది
దృష్టాంత మెట్లు గానోపును?

మఱియుఁ బరమాణుపుంజమునందు నేకత్వబుద్ధి స్థాణువు
నందుఁ బురుషబుద్ధివలె నౌపచారికమనుటకేని వలనుపడదు.
లోకమునఁ బురుషునియందుఁ బురుషత్వనిశ్చయము గలిగిన
వానికే కాలాంతరమున సాదృశ్యాదిదోషవశమున స్థాణువు
నందుఁ బురుషత్వబుద్ధి యౌపచారికముగఁ గలుగవచ్చునేగాని
స్థలాంతరమున వాస్తవికమగు పురుషత్వనిశ్చయము లేనివాని
కిట్టిభ్రమ యుదయింపనేరదు. ప్రకృతమున నతిరిక్తావయవి నంగీక
రింపనిచో వాస్తవికమగు నేకత్వబుద్ధి యెచ్చటను గలుగనేరదు
గావున నిట్టియెడ నౌపచారికముగఁ గలుగు టెట్లు?

శ్రోత్రేంద్రియగోచరమగు శబ్దమునందుదయించెడి
యథార్థమగు నేకత్వబుద్ధిచేఁ బ్రకృతమునఁ బరమాణుపుంజము

నందు నేకత్వబుద్ధి యౌపచారికముగఁ గలుగు ననరాదా యను
టయు సమంజసముగాదు. ఇటఁ బ్రకృతము లగుఘటాదులందు
నేకత్వబుద్ధి యౌపచారికమనుటకుఁ బ్రతివాదులు స్థాణుపురుష
బుద్ధిని దృష్టాంతముగను శబ్దైకత్వబుద్ధిని సాధకముగను జూపు
చున్నారు. కాని విశేష హేతువును నిరూపింపరయిరి. కావున
ఘటాదులందలి యేకత్వబుద్ధి స్థాణుపురుషబుద్ధివలె నౌపచారి
కమా శబ్దైకత్వబుద్ధివలె వాస్తవికమా యని యిట సంశయము
గలుగునేగాని యౌపచారికమని నిశ్చయముగలుగు టెట్లు ?
మఱియుఁ బ్రతివాదిమతమున ఘటాదు లెట్లు పరమాణుపుంజ
రూపములో యటులే శబ్దాదులును నవయవసముదాయరూపం
బులే యగుటంజేసి శబ్దాదులందలి యేకత్వబుద్ధియు యథార్థ
మనుటకు వలనుపడదు.

పరిశీలింపఁగా "ఏకమిదం మహత్" (ఇది, యొక్కటి,
పెద్దది) అని మహత్పరిమాణమును నేకత్వమును వస్తువునందు
గృహీతములగుచుండును. దీనింబట్టి యీమహత్త్వైకత్వముల
కాశ్రయమగు నొకప్రత్యేకావయవి యుండితీఱవలయును. అతి
రిక్తావయవి నంగీకరింపనిపక్షమునఁ బరమాణుపుంజమున కీమహ
త్త్వాశ్రయత్వము దుర్ఘటముగదా! శబ్దమునందు నుదయించెడి.
వాస్తవికమగు మహత్త్వబుద్ధినిబట్టి పరమాణుపుంజమునందే
యౌపచారికముగ మహత్త్వబుద్ధి గలుగరాదా యనియు శం
కింపఁజనదు. లోకమున ఘటాదివస్తువులపరిమితిని మనము
గ్రహించినటులు శబ్ద (ధ్వని) పరిమితిని 'ఇంత, అంత' యని

గ్రహింపఁజాలము. ఒకధ్వని వినఁబడినపుడు వాడుకచొప్పునఁ బెద్దదనియోం చిన్నదనియో వ్యవహరించుచుందుమే గాని దాని పరిమితి యింతయని స్పష్టముగఁ దెలిసికొని వ్యవహరించుట లేదు. కావున నట వ్యవహృతములగు మహత్త్వాదు లౌపచారికము లనఁదగును. ఇట్టి మహత్త్వజ్ఞానమునుబట్టి ఘటాదులందుదయించెడిమహత్త్వజ్ఞాన మౌపచారికమనుట యెట్లు పొసంగును? కాఁగా నెంతదూరము పరికించినను ఘటాదులందుదయించెడి యేకత్వమహత్త్వబుద్ధులు యథార్థము లేయగుచున్నవి గాని యౌపచారికములనుటకు మార్గము గానరాకున్నయది. దీనింబట్టి యేకత్వమహత్త్వాశ్రయమగు నతిరిక్తావయవి సిద్ధించుచున్నది.

మఱియు సంయోగమునుబట్టియు నవయవిసిద్ధి నెఱుంగవలయును రెండువస్తువులు కలిసినపుడు "ఇమే సంయుక్తే" (ఈ రెండును సంయుక్తములు.) అని వానిసంయోగమును మనము గ్రహింతుము. అనేకపరమాణువులసంయోగముగాని సమూహముగాని సముదాయమనియు నిట్టిసముదాయమే సంయోగమున కాశ్రయమనియుఁ గొందఱు నిరూపింతురు. ఈ మతమున సంయోగమే సముదాయమను మొదటిపక్షమున సంయోగమే సంయోగాశ్రయము కావలసియుండును. అది విరుద్ధముగదా! ఇఁక సమూహము సముదాయమనెడి రెండవ పక్షమున నిట సంయుక్తములయినవి పెక్కులు (బహుత్వోపేతములు) గావునఁ గలిసినవి రెండని గ్రహించుట యెట్లు సరి

పడును? అణువు లతీంద్రియములగుటచేఁ దత్సంయోగము గృహీతమగు టెట్లు? కావున నతిరిక్తావయవిరూపములగు రెండు ద్రవ్యములు సంయుక్తములయినటులే తేలుచున్నది.

ఇది యిటుండ సంయోగమను నతిరిక్తపదార్థము లేదనియు నయ్యది సంయుక్తవస్తురూపమే యనియు నట్టియ భూతవస్తువునుబట్టి యవయవిని సాధింపరాదనియు మఱికొందఱు తలంతురు. కాని లోకమునఁ గొన్ని (పసపు+సున్నము మున్నగు) వస్తువులకలయికచే విలక్షణరూపములును విలక్షణశక్తులును నేర్పడుచుండుటయు నిట్టిరూపాదులకు సంయోగమే కారణమగుటయు సర్వానుభవసిద్ధములు. మఱియు "కుణ్డలీ గురుః" అనువాక్యముచే గురువు కుండలసంయుక్తుఁడని యర్థప్రతీతి గలుగుచుండునుగదా! సంయోగ మతిరిక్తము గానిచో "కుణ్డలీ గురుః" అనువాక్యమున "కుండలములు, గురువు" అను వానికంటె నతిరిక్తమగు మతుబర్థమును బోధించు 'ఇని' ప్రత్యయమును బ్రయోగించుటయు నట్టిప్రత్యయమునుబట్టి యర్థవిశేషబోధ యుదయించుటయు నెట్లు సంభవించును? కావున సంయుక్తవస్తుభిన్నమగు సంయోగమును వేఱుగ నంగీకరింపక తప్పదు.

మఱియు వృక్షత్వాదిజాతులు వృక్షాదులఁ జూచినపుడు ప్రత్యక్షమగుచుండును. ఇట్టిజాతివిశేషములకుఁ బరమాణుపుంజమాశ్రయమనుట కవకాశము లేదు. అతీంద్రియమగు పరమాణుపుంజమందీజాతి ప్రత్యక్షమగుట సంభవింపదుగదా! అతీంద్రియ

పరమాణువులవలన దృశ్యపరమాణుపుంజ మేర్పడునని యంగీక రింతమన్నను జత్యుస్సన్నికృష్టములుకాని పరమాణుపుంజములం దీజాతులు ప్రత్యక్షమగుట యసంభవముగానఁ జత్యుస్సన్ని కృష్టములగు పరమాణుపుంజములందే యీజాతులు గృహీ తములగునని యంగీకరింపవలయును. కాఁగా వృక్షైక దేశమును జూచినపు డచ్చట నొకవృక్షత్వజాతియు వేఱొకభాగమును జూచినపు డచ్చట నింకొకవృక్షత్వజాతియు నిట్లొకవృక్షము నందే వృక్షత్వజాతు లనేకము లుండినటు లంగీకరింపవలసి వచ్చును. దీనింబట్టి యొకవృక్షమునే యనేకవృక్షములుగ వ్యవ హరింపవలసియుండును కావున నవయవాతిరిక్తమగు నవయవి నంగీకరింపక యెట్లును దప్పదు. ఈయవయవియే ప్రత్యక్షగోచర మగు చుండును.

ప్రత్యక్షపరీక్షాప్రకరణము

స మా ప్త ము.

---

**సూ:—రోధోపఘాతసాదృశ్యంబుల వ్యభిచరితం బగునను మానంబు నప్రమాణంబు—౩౭.**

అనుమానప్రామాణ్యము నిఁకఁ బరిశీలింపవలసియున్నది. కార్యలింగకమనియుఁ గారణలింగకమనియు సామాన్యదృష్ట మనియు ననుమానము త్రివిధముగ నిరూపింపఁబడినది(౧-౧-౫)

నదియందలి యుదకసమృద్ధినిబట్టి వర్షము నూహించుట
కార్యలింగకానుమానము. వర్షము గురియ
**కార్యలింగకము.** కున్నను నల్పప్రవాహముగల నదియందుఁ
బ్రవాహము నడ్డగింపఁగలకట్టు గట్టినయెడ
జల మధికమగుట సంభవించును. కాఁగా జలసమృద్ధిమాత్ర
మున వర్షానుమానము వ్యభిచరిత మగుచున్నది.

మఱియుఁ జీమలు గ్రుడ్లను నోటఁగఱచుకొని పాకు
టను జూచి వర్షము గురియునని యూహించుట కారణలింగ
కానుమానము. పుట్టలలో సర్పాదులవలన నే
**కారణలింగకము.** దేనిభయము గలిగినపుడును జీమ లిట్లు భూమి
పయి సంచరించుట సంభవించును గావున
నిట్టి పిపీలికాండసంచారమాత్రమున వర్షము నూహించుట
మిథ్యానుమాన మగుచుండును.

నెమలికూఁతలంబట్టి గగనమున మేఘమున్నటు లూ
హించుట సామాన్యదృష్టానుమానము. ఎవఁ
**సామాన్యదృష్టము.** డేని మనుజుఁడు నెమలివలెఁ గూయునపుడు
సాదృశ్యముచే నది మయూరధ్వని యని
భ్రమించి మేఘము నూహించుటయు సంభవింపనగును. కావున
నిట్టిదియు మిథ్యానుమానమే యగుచుండును. ఈరీతిగ నను
మానమెల్ల నర్థసాధకముగాకుండుటచే నిది ప్రమాణమగుట
యెట్లని శంక పొడమవచ్చును. కాని;

**సూ:—అనుమాన ప్రామాణ్యంబు లింగాభాసంబుల నప్రకంప్యంబు—3౮.**

పయినిజూపిన లింగములన్నియు నాభాసరూపంబులే గాని నిర్దుష్టములు గానేరవు.

కార్యలింగకము.

ఫేన, పర్ణ, కాష్ఠాదిబహులంబును గలుషితంబును వేగవంతము నగుపూర్ణజలప్రవాహామునుబట్టి వర్షము నూహింపవలయుఁగాని జలసమృద్ధిమాత్రమునుబట్టి యూహింపరాదు. ఫేనాదిబహులమై వేగవంతమగు కలుషితోదకప్రవాహామునుబట్టి చేయువర్షానుమానము సత్యమే యగును గాని మిథ్య గానేరదు.

కారణలింగకము.

ఇటులే, స్వాభావికమై భూమియందెల్లయెడల నగపడు పిపీలికాండసంచారముచే వర్షము గురియునని యూహింపవలయుఁగాని భయాదులచే నేదో యొక పుట్టనుండి వెలువడిన కొన్ని పిపీలికలంబట్టి వర్షానుమానము చేయరాదు.

సామాన్యదృష్టము.

మఱియుఁ బురుషుఁడనుకరించినమయూరధ్వనినిబట్టి చేయు మేఘానుమానము మిథ్యయయినను యథార్థమగు మయూరధ్వనిచేఁ జేయు ననుమానము సత్యము గాకతీఱదు.

కాఁగా లింగాభాసములచే నర్థము సిద్ధింపకున్నను సద్ధేతువులచే నర్థసిద్ధి గాక తప్పదు. కావున ననుమానము ప్రమాణమే యని యంగీకరింపవలయును.

**(పూ) సూ:—అనుపలబ్ధింబట్టి వర్తమానకాలం బనుప పన్నంబు—3౯.**

భూతకాలికమును వర్తమానకాలికమును భవిష్యత్కాలికమును ననుమానముచే గ్రహింపఁబడునని పూర్వము (౧-౧-౫) నిరూపింపఁబడియున్నది. వృక్షమునుండి ఫలము క్రిందికిఁబడునపుడు మనము చూచునెడ నయ్యది యప్పటికి జాఱిన ప్రదేశమును నిఁక జాఱఁబోవు ప్రదేశమును మనకు గోచరించును. వీనితో పాటుగ నపుడు జాఱిన ప్రదేశమునకు సంబంధించినభూతకాలమును జాఱఁబోవు ప్రదేశమునకు సంబంధించినభవిష్యత్కాలమును గృహీతములగును. పండుజాఱు నపుడు జాఱిన ప్రదేశమును జాఱఁబోవు ప్రదేశమును దప్ప 'జాఱుచున్నది' యనఁదగిన మఱియొక ప్రదేశము మనకు గోచరింపదు. కాఁగా నీరీతిని భూతభవిష్యత్కాలములు రెండు మాత్రమే గృహీతములగుచుండుటచే ననుపలభ్యమానం బగు వర్తమానకాల మెటు లుపపన్నమగుననియు వర్తమానకాలికముల ననుమానముచే గ్రహింతుమనుట యెట్లు పొసంగు ననియు శంక లుదయింపవచ్చును. కాని;

**(స) సూ:—ఏతదపేక్షం బగుతత్సిద్ధియు దుర్ఘటంబు—౪౦.**

లోకమున నేదో యొకకాలమును ముందునిర్ణయించుకొని యప్పటి కతిక్రమించినదానిని భూతకాల మనియు

రాఁబోవుదానిని భవిష్యత్కాలమనియు వ్యవహరింతుము. ఈ రీతిని భూతభావికాలములు రెండును వర్తమానకాలమును బట్టియే నిర్ణీతములగుచుండుటచే వర్తమానకాలము నంగీకరింపనిచోఁ దత్సాపేక్షములగు భూతభవిష్యత్తులు గూడ లేవనవలసి యుండును.

మఱియుఁ గాలనిర్ణయ మెప్పుడును గ్రియలనుబట్టి జరగుచుండును గాని ప్రదేశములంబట్టి యేర్పడ నేరదు. ఏలయన; ఒకప్రదేశ మొకప్పుడు భూతకాలమును సంబంధించియుండినను నయ్యదియే వేఱొకసమయమున భవిష్యత్కాలమును సంబంధించియు నుండవచ్చును. ఒకపండు భూమిపయినిబడిన పిదపఁ దత్పతనమార్గప్రదేశమెల్ల భూతకాలసంబద్ధమయినను నామార్గముననే యింకొకపండు పడుటకుఁ బ్రారంభించుతఱి, నాక్రిందిప్రదేశమెల్ల భవిష్యత్కాలసంబద్ధ మగుచుండును గదా! క్రియలన్ననో క్షణికములగుటచే భూతకాలికమగు క్రియ మరల నెన్నఁటికిని భవిష్యత్కాలసంబద్ధము గానేరదు. వృక్షమునుండి ఫలము జాఱునపుడు ఫలమునందుఁ గొన్నిపతన క్రియలు పుట్టును. అవియన్నియు సదృశములగుటచే వానిభేదమును గుఱుతింపఁజాలక యదియెల్ల నొకేక్రియ యని తలంచుచుందుము. అతిక్రమించినక్రియను సంబంధించినకాలమును భూతకాలమనియు గోచరించుచున్నక్రియను సంబంధించిన కాలమును వర్తమానకాలమనియు నింకముందు పుట్టఁబోవుక్రియను సంబంధించినకాలమును భవిష్యత్కాలమనియు వ్యవహరింప

వలయును. భూతకాలికక్రియ నశించుటవల్లను భావికాలిక క్రియపుట్టకుండుటవల్లను నారెండుకాలములందును ద్రవ్యము క్రియాశూన్యమై యుండును.

పూర్వోక్తరీతిగ వర్తమానకాల ముండిననేగాని భూత భవిష్యత్కాలములు సిద్ధింపవుగాన వర్తమానకాలము లేదనుటకు వలనుపడదు.

**సూ:—అతీతానాగతంబుల కితరేతరాపేక్షాసిద్ధియు దుర్ఘటంబు—౪౧.**

ఇటఁ గొందఱు హ్రస్వదీర్ఘములు ఛాయాతపములున్నట్టు వానివలె భూతము భవిష్యదధీనముగను భవిష్యత్తు భూతాధీనముగను వర్తమానకాల నిరపేక్షంబుగనే సిద్ధించునుగానఁ దత్సిద్ధికై వర్తమానము నంగీకరింపనేల యని శంకింతురు. కాని హేతుశూన్యమగు నీదృష్టాంతమాత్రమున నిట్టి యర్థమును సాధింపఁబూనినచోఁ రూపరసములను గంధస్పర్శములను దృష్టాంతముగఁ గైకొని వానివలెనే యతీతానాగతములును బరస్పరనిరపేక్షముగనే సిద్ధించునని యేల నిరూపింపరాదు? మఱియు భూతసిద్ధి భవిష్యదధీనమనియు భవిష్యత్సిద్ధి భూతాధీనమనియు నిరూపించినచో నన్యోన్యాశ్రయదోషము సంభవించును. ఇదియుఁగాక భూతసిద్ధి భవిష్యదధీనమగుచోఁ గార్యమగుభూతముకంటెఁ గారణమగు భవిష్యత్కాలము ముందుగ సిద్ధించియుండవలయును. అయ్యది యసంభవము

గదా! మఱియు "పతతి" (పడుచున్నది) మున్నగురీతిని వర్తమానకాలబోధకప్రత్యయాంతము లనేకములు వ్యవహరింపఁబడుటయు నట్టియెడ "వర్తమానే లట్" మున్నగురీతని బ్రత్యయములు శబ్దశాస్త్రమున సాధింపఁబడుటయు నాక్షేపకులకు విరుద్ధములగుచుండును.

**సూ:—ప్రత్యక్షానుపపత్తింబట్టి సర్వాగ్రహణంబును బ్రసక్తంబు—౪౨-౪౩.**

ప్రత్యక్ష ప్రమాణము సన్నికృష్టపదార్థములనుమాత్రము గ్రహించుచుండును వర్తమాన మొక్కటియే సన్నికృష్టమగుచుండునుగాని యతీతానాగతము లెన్నఁడును సన్నికృష్టములుగా నేరవు. కావున వర్తమానకాలమునే యంగీకరింపకున్నచోఁ బ్రత్యక్షమెల్ల ననుపపన్నము గాఁదలఁపవలసి యుండును. దీనింబట్టి ప్రత్యక్షమూలకములగు ననుమానాదులును ననుపపన్నములుగా నేరవు. ఈరీతిని సర్వప్రమాణోచ్ఛేదంబున సర్వవ్యవహారవిచ్ఛేదంబు వాటిల్లును. కావున వర్తమానకాలము నంగీకరించితీఱవలయును.

ఈవర్తమానకాలము 'ఘటోఽస్తి' ఇత్యాదులందు ఘటరూపద్రవ్యసద్భావమునుబట్టియు 'పచతి, ఛినత్తి' ఇత్యాదులందుఁ బాకచ్ఛేదాదిక్రియలనుబట్టియుఁ దెలియుచుండును లోకమునఁ గ్రియ సమూహరూపముగను నావృత్తిరూపముగను ద్వివిధమయి యుండును. పాకక్రియ స్థాల్యధిశ్రయణము

ఉదకాసేచనము, తండులావపనము, ఏధోపసర్పణము, అగ్ని జ్వాలనము, దర్వీఘట్టనము, మండస్రావణము, అధోవతారణము అనువిజాతీయములగు నవాంతరక్రియలసమూహరూపమగు చుండును. ఛేదనక్రియ, ఉద్యమననిపాతనక్రియల యావృత్తిరూప మగుచుండును. ఆవృత్తియన; సజాతీయక్రియలు పలుమాఱు ప్రవర్తిల్లుట.

'ఘటోఽస్తి' ఇత్యాదులందు ద్రవ్యసద్భావముఁబట్టి తెలియునపుడు వర్తమానకాలము భూతభవిష్యత్కాలసంబంధశూన్యమయి గృహీతమగుచుండును. 'పచతి, ఛినత్తి' ఇత్యాదులందుఁ గ్రియలనుబట్టి తెలియునపుడు భూతభవిష్యత్కాలసంబంధముగలదయి గృహీతమగును. 'పచతి'యనునెడఁ బయిని జూపినరీతిని స్థాల్యధిశ్రయణము మొదలుగ నధోవతారణము వఱకుఁ బ్రవర్తిల్లు క్రియాసమూహము విచ్ఛేదము లేకుండ భాసిల్లుచుండును ఆయవాంతరక్రియలలోఁ గొన్ని యతిక్రాంతములుగను నొకటి విద్యమానముగను గొన్ని యనాగతములుగను నుండుట సంభవించును. ఇట్టియెడ వర్తమానకాలము యథాసంభవముగ భూతభవిష్యత్కాలములతోఁ గలిసి ప్రతీయమాన మగుచుండును.

మఱియు లోకమున 'ఎపుడు వచ్చితివి?' అను ప్రశ్నమునకు 'ఇపుడే వచ్చుచున్నాను' అనియు 'ఎపుడు వచ్చెదవు?' అను ప్రశ్నమునకు 'ఇదిగో వచ్చుచున్నాను' అనియు బదులు పలుకుట యనుభవసిద్ధము. ఇట్టియెడ వర్తమానసమీపమగు

భూతమును నట్టిభవిష్యత్తును వర్తమానార్థక ప్రత్యయములచే బోధింపఁబడుచుండుటయుఁ గలదు. కాఁగాఁ బరికించినకొలఁది వర్తమానకాలము నంగీకరింపకతీఱదనియే తేలుచున్నది.

అనుమానపరీక్షాప్రకరణము

సమాప్తము.

---

**(పూ) సూ:—అత్యంతప్రాయైకదేశసాధర్మ్యంబున నుపమానసిద్ధి దుర్ఘటంబు—౪౪-౪౫.**

వస్తుతత్త్వమును దెలుపుసాధర్మ్య ముపమానప్రమాణ మని పూర్వము (౧-౧-౬) నిరూపింపఁబడియె. ఇట నత్యంత సామ్యమునుబట్టిగాని బహుళసామ్యమునుబట్టిగాని యేకదేశ సామ్యమునుబట్టిగాని వస్తుతత్త్వము దెలియుచుండునని పయి దాని కర్థమును గ్రహింపవలయుఁగదా! గోవెటులుండునను జిజ్ఞాసగలవానికి 'గోవు గోవువలె నుండు' నని చెప్పినచో నిచటి యత్యంతసామ్యముచే వానిజిజ్ఞాస తొలంగదు. మఱియు గోవు మహిషమువలె నుండుననుబహుళసామ్యనిరూపకమగు వాక్య మువలననయినను వానికి గోతత్త్వజ్ఞాన ముదయింపదు. ఇఁక నేకదేశసామ్యమున వస్తుతత్త్వము సిద్ధించుచున్నచో 'గోవు ఘటమువలె నుండును' మున్నగురీతిని నేవస్తువుతో సామ్య మును నిరూపించినను దక్కినవస్తువు లెల్లఁ దెలియవలసియుం డును. ప్రపంచంబునంగలవస్తువులన్నిటికిని నేదో యొకసామ్య ముండియేతీఱునుగదా! ఈతీఱున సామ్యమునుబట్టి యర్థసిద్ధి

పొసఁగకుండుటచే నుపమాన మెట్లు ప్రమాణమగునని శంకింతురు. కాని యాక్షేపకులు నిరూపించినరీతినిగాక 'గోసదృశో గవయః' మున్నగురీతిని సామ్యము ప్రసిద్ధమగునపుడే యర్థసాధక మగుచుండునని పూర్వమే (౧-౧-౬) నిరూపింపఁబడి యుండుటచే నిట నిట్టిశంకల కవకాశము గానరాదు.

**(పూ) సూ:—ప్రత్యక్షంబువలని యప్రత్యక్షసిద్ధిం బట్టి యుపమానం బనుమానంబ యగు—౪౬.**

మనకగపడుచున్న ధూమముచే వహ్ని నెటు లూహింతుమో యటులే ప్రత్యక్షమగుగోవునుబట్టి గవయమృగమును దెలిసికొందుముగాన నియ్యదియు ననుమానంబె యనరాదా యని శంకింపవచ్చును కాని,

**(స) సూ:—గవయ మప్రత్యక్షమగుచో నుపమానంబు నిరర్థకంబు—౪౭.**

వహ్ని మనకుఁ బ్రత్యక్షముకానియపుడే ధూమముచే నద్దాని నూహింతుము. ప్రత్యక్షమే యగునెడ ననుమానము నకుఁ బ్రసక్తియే లేదు. ప్రకృతముననన్నెనో యట్లుగాదు. మనకు గవయమృగ మగపడినపుడు దానియందలి గోసాదృశ్యమునుబట్టి 'గోసదృశోగవయః' అను నాప్తవాక్యార్థమును స్మృతికిఁదెచ్చికొని యిది గవయపదార్థమని నిర్ణయించుకొందుము. ఈరీతిని గవయమృగ మగపడినపుడే గోసాదృశ్యజ్ఞాన రూపమగు నుపమానమునకు గవయపదార్థనిర్ణయరూపమగు

ప్రయోజనముండునుగాని యది మనకుఁ బ్రత్యక్షమేగాకు న్నచో నుపమానప్రమాణము నిష్ఫలమే యగును.

మఱియు ననుమానము పూర్వము నిరూపించినరీతిని స్వార్థము పరార్థముగూడ నగుచుండును. ఉపమానము పరార్థముమాత్రమే యగుచుండును. అనఁగా శ్రోతకుమాత్రమే యుపకరించుననుట. ఇట వక్తకుఁగూడ గోసాదృశ్యజ్ఞానమున్నను నాటవికుఁడగుటచే వ్యవహారమువలననే యాతఁడు గవయపదార్థమును దెలిసికొనునుగాన నయ్యది గవయపదార్థనిర్ణయమున నాతని కావశ్యకముగాకుండుటచే నుపమాన మెన్నఁడును గాఁజాలదు మఱియు,

(స) సూ:—ఉపసంహారముంబట్టియు భేదంబు సుఘటంబు—౨౮.

"యథాగౌః, ఏవం గవయః" అని గవయమునందు గోసాదృశ్యమును స్థిరపఱిచెదము. కాఁగా నుపమానప్రమాణము దృష్టాంతరూప మగుచున్నది. దృష్టాంత మనుమానమునకుఁ గారణమని పూర్వము నిరూపింపఁబడియె. కారణమగు నుపమానమునకును గార్యమగు ననుమానమునకును భేదముండియేతీఱవలయుఁగదా! కావున నెట్లును నుపమానము పృథక్ప్రమాణమే యగునుగాని యనుమానము కానేరదు.

ఉపమానపరీక్షాప్రకరణము

సమాప్తము.

---

(పూ) సూ:—అర్థానుపలబ్ధి[1], సదృశోపలబ్ధి[2], సంబంధంబులంబట్టి[3] శబ్దం బనుమానంబ యగు—౪౯-౫౦-౫౧.

1. అప్రత్యక్షమగువహ్నిని ధూమముచే నూహించు నటులే యప్రత్యక్షమగునర్థమును శబ్దముచే గ్రహింతుము. 2. మఱియు ధూమజన్యమగువహ్నిజ్ఞాన మెట్లప్రత్యక్షవిషయకమో యటులే శబ్దముచేఁ గలుగునర్థజ్ఞానమును నప్రత్యక్షవిషయకమే యగుచుండును. 3. అనుమానంబున వహ్నిధూమముల నియతసంబంధజ్ఞానమును ధూమప్రత్యక్షమును నెటు లావశ్యకములో యటులే ప్రకృతమునఁగూడ శబ్దార్థముల నియతసంబంధజ్ఞానమును శబ్దప్రత్యక్షమును నావశ్యకము లగును. ఈరీతిని సర్వథా సామ్య మగపడుచుండుటచే శబ్దప్రమాణము ననుమానాంతర్గత మనక ప్రమాణాంతరముగ నంగీకరింపనేల? అని సంశయము గలుగవచ్చును. కాని,

(స) సూ:—ఆప్తోపదేశసామర్థ్యంబున, నర్థప్రత్యాయకం బగుశబ్దంబు ప్రమాణాంతరంబు—౫౨-౫౩-౫౪-౫౫-౫౬.

ఆప్తోచ్చరితమనియు ననాప్తోచ్చరితమనియు శబ్దము ద్వివిధముగ నుండును. 'స్వర్గే అప్సరసః, సప్తసముద్రాః' మున్నగుశబ్దము లాప్తోచ్చరితములను జ్ఞానము మనకుండుటచే వానియందలి ప్రామాణ్యమునుబట్టి తదర్థములను మనము గ్రహింతుము. ఆప్తోచ్చరితములను జ్ఞానము మనకు లేనియెడ

న్ట్రి శబ్దములు మనకు వినఁబడినను వానియెడఁ దగినప్రామాణ్యము గలుగనేరదు గావునఁ దదర్థములను మనము గ్రహింపము. కాఁగా శబ్దమువలన నర్థమును గ్రహించునపు డాప్తోచ్చరితత్వ మావశ్యకమగును. ఇది యొక్కటియగాక యోగ్యత, ఆకాంక్ష, ఆసత్తి, యనునివియు నపేక్షితము లగుచుండును. లింగ (అనుమాన) మర్థసాధకమగునెడ వ్యాప్తిపక్షధర్మతల నపేక్షించుచుండును ఇట్లు భిన్నభిన్నసామగ్రులచే నర్థబోధకములగుశబ్దానుమానము లొక్కటే యగుట యెట్లు పొసంగును?

సాధ్యహేతువులకువలె శబ్దార్థములకును నియతసంబంధముండును గాని యీరెండుతావులసంబంధములకును వైలక్షణ్యము గలదు అదెట్టిదన; సాధ్యహేతువులు సమానాధికరణములై యవినాభావసంబంధము గలిగియుండును. అనఁగా హేతువగుధూమమును సాధ్యమగువహ్నియు నొకపర్వతముననే యుండి ధూమము వహ్నినివిడువక తత్సంబద్ధమై యుండవలయునని భావము శబ్దార్థములన్ననో యట్లుగాదు. శబ్దము శ్రోత్రేంద్రియమును సంబంధించియుండును. దానియర్థము స్థలాంతరముల నుండును. దీనింబట్టి శబ్దార్థములకు సామానాధికరణ్యమును గాని యవినాభావముగాని లేదని తేలుచున్నది. శబ్దమున్నతావున నర్థముండు ననుపక్షమున నగ్నిశబ్దము నుచ్చరించినచో నోరును, వినినచోఁ గర్ణమును దహింపఁబడవలసి యుండును. ఇఁక నర్థమున్నచోట శబ్దముండుననుటయుఁ బొసం

గదు. ఘటాదివస్తువులున్నచోట శబ్దోత్పత్తిసాధనము లగు కంఠతాల్వాదులు లేకుండుటచే నటశబ్ద ముదయింపనేరదు. కంఠతాల్వాదులం దుదయించి యీశబ్దము ఘటాదివస్తువుల సమీపమునకుఁ జేరి తత్సంబద్ధమయి యుండుననుటయు సరి పడదు ఆకాశగుణమగుశబ్ద మాకాశమునుదప్ప వేఱొక వస్తువు నాశ్రయించుట యసంభవముగదా! మఱియు నొకే యింద్రియముచే గ్రహింపఁబడువస్తువులకు సంయోగము సంభవింపవచ్చునుగాని భిన్నేంద్రియగ్రాహ్యములగువస్తువుల కెన్నఁటికిని సంయోగము సంభవింపదు. కావున వహ్నిధూమములకు సంయోగము సంభవింపఁదగునుగాని శబ్దార్థములకు సంయోగము దుర్ఘటము.

ఇఁక లోకమున గొన్నిశబ్దములచేఁ గొన్ని యర్థములు మాత్రమే బోధింపఁబడునుగాని యన్నిశబ్దములవలనను నన్ని యర్థములును బోధింపఁబడవుగాన శబ్దార్థములు రెంటికిని నేదో యొకనియతమగుసంబంధ ముండియే తీఱవలయునని తెలియుచున్నది. ఆసంబంధ మెట్టిదని పరిశీలించుట యావశ్యకము.

శబ్దార్థములసంబంధము స్వాభావికమని మీమాంసకు లందురు. అనఁగా నాయాశబ్దముల కాయాయర్థములను బోధించుట స్వభావమని వారితాత్పర్యము. ఇయ్యది సమంజసంబు గాదు. ఏదయిన నొకవస్తువున కొకటి స్వభావమని మనము నిర్ణయించునెడ నయ్యది యన్నిదేశములందును నన్నికాలము

లందును నన్ని జాతులవారికిని నొకేతీఱున గోచరించుచుండ వలయును. అగ్నికి వేఁడిగానుండుట స్వభావము. ఈస్వభావము సకలదేశములందును సర్వకాలములందును నొకేవిధముగ నుండకతీఱదు. శబ్దమన్ననో యట్లుగాక యొకదేశమున నొకజాతి వారి కొకయర్థమును వేఱొకజాతివారి కింకొకయర్థమును బోధించుట గలదు. ఇటు లైకరూప్యము లేకుండుటచే శబ్దార్థ సంబంధము స్వాభావికముగాక సమయసిద్ధమగుచున్నది. సమయ మన నాయాదేశములం దాయాజాతులవారు జేసికొనిననిర్ణ యము ఈసామయికసంబంధమునకే వాచ్యవాచకభావమని వ్యవహారము. ఈసంబంధము తెలిసినంగాని శబ్దశ్రవణమాత్ర మున నర్థజ్ఞాన ముదయింపదు. ఇట్టిసంబంధము వ్యవహారము వలనఁ దెలియుచుండును. ఎట్లన; ఒకఁడు 'గోవు నిటు తీసికొని రమ్మ'ని పలుకును. రెండవవాఁడు గోవును దీసికొనివచ్చును. మరల మొదటివాఁడు 'గోవును గట్టుము అశ్వమును దీసికొని రమ్ము' అని చెప్పును. రెండవవాఁ డట్లుచేయును. ఇదంతయు వినుచుఁ జూచుచు నున్నబాలుఁడు గోవనఁగ నెట్టిదో, యశ్వ మన నెద్దియో, తీసికొనివచ్చుట కట్టుట యనఁగా నవియెట్టి క్రియలో యవియెల్ల గ్రహింపఁగలుగును. ఇట్లు గ్రహించి తానును మరల వ్యవహరింపఁగలుగును. ఇట్లు బాలుఁడు వ్యవ హారమువలనఁ గొన్నివాక్యములయర్థమును దెలిసికొని పిమ్మటఁ గావ్యకోశాదులవలన మఱికొన్నిశబ్దముల కర్థములను వ్యాకర ణమువలనఁ బ్రకృతిప్రత్యయాదులయర్థవిశేషములను గ్రహిం

చును. ఆయా యర్థములబోధించుచు లోకమువలననే సిద్ధమయినవాక్యములలో నేదో యొకతీరునఁ బదవిభజనమును బదములకుఁ బ్రకృతిప్రత్యయవిభాగాదులను గల్పించి లోకసిద్ధమగుసాధుత్వము ననువదించుచు లఘుమార్గమున భాషాస్వరూపమును బోధించుటయే వ్యాకరణములకు స్వభావంబు.

పూర్వోక్తరీతిని శబ్దప్రమాణమునకును ననుమానమునకును నెంతయో భేద మగపడుచుండుట చే శబ్ద మనుమానాంతర్గతమగుటకు వలనుపడదు అయ్యది పృథక్ప్రమాణమనియే యంగీకరించితీఱవలయును.

శబ్దసామాన్యపరీక్షాప్రకరణము

సమాప్తము.

---

**(పూ) సూ:—అనృతవ్యాఘాతపునరుక్తదోషంబుల వేదప్రామాణ్యంబు దుర్ఘటంబు—౫౭.**

శబ్దము ప్రమాణమని యీావఱకు నిరూపింపఁబడినది. ఇఁక శబ్దవిశేషమగు వేదము ప్రమాణమగునా యని పరిశీలించుట యావశ్యకమై యున్నది.

పుత్రులను బడయఁగోరువారు పుత్రకామేష్టి యను కర్మము నాచరింపవలయునని వేదమునఁ గలదు. దానిని విశ్వసించి కర్మము నాచరించినవారికిఁ బుత్రులు గలుగకుండుట లోకమునఁ గలదు. ఇట్లు వేదమునందుఁ బ్రతిపాదింపఁబడిన

అనృతము. విషయ మనృతమగుచున్నది. దీనింబట్టి జ్యోతిష్టోమముచే స్వర్గము లభించును మున్నగు వాక్యములుగూడ నసత్యములే యనవలసి యుండును.

వ్యాఘాతము. మఱియు వేదమున దేవతాప్రీతికయి సూర్యోదయమునకుఁ బూర్వ మొకహోమము చేయవలయుననియు సూర్యోదయానంతరము మఱొకహోమము చేయవలయుననియు నొకచో నిరూపింపఁబడియె. మఱియు నందే సూర్యోదయమునకుఁబూర్వమందు హోమము చేయఁబడిన ద్రవ్యమును శ్యావమనుశునకము భక్షించుననియు రెండవయాహుతిని శబలమనుశునకము భక్షించుననియు నీహోమములు రెండును దేవతాప్రీతికరములు గావనియు వేఱొకచో నిరూపింపఁబడియున్నది. ఈ వచనములు రెండును బరస్పరవిరుద్ధము లగుచున్నవి. ఇట్టి వ్యాహతవాక్యములు వేదమున నెన్నియో కన్పట్టును.

పునరుక్తి. మఱియు వేదమున నొకేమంత్రము మూఁడేసిమాఱు లుచ్చరింపఁబడుచుఁ బునరుక్తమగుచుండును.

ఈరీతిని ననృతవ్యాఘాతపునరుక్తిదోషదూషితం బగు వేదము ప్రమాణమగుట యెట్లని కొందఱు శంకింతురు. కాని,

(స) సూ:—వేదప్రామాణ్యనిరసనంబు కర్మవైగుణ్యాదులంబట్టి యనుపపన్నంబు

లోకమునఁ బుత్రకామేష్టి నాచరించినవారిలో నెవరికో సంతానముగలుగనంతమాత్రమున వేదము ప్రమాణముగాదనుట సమంజసముగాదు. సతీపురుషులకు సంతానప్రాప్తికిఁ బ్రతిబంధకముగ నేర్పడియున్న దురితములు పుత్రకామేష్టిచే నశించును. పిమ్మట దంపతులయనుకూలసంగమముచే సంతానము సిద్ధించును. ఆయాగమునఁ గర్మలోపములుగాని కర్తృదోషములుగాని తటస్థించినయెడ దురితము నశింపదు. యాగమునందలి క్రియలను యథావిధిగ నిర్వర్తింపకుండుటయు, మంత్రములను స్వరవర్ణలుప్తములుగను న్యూనాధికములుగను నుచ్చరించుటయు, దుష్టప్రతిగ్రహాదులచే నార్జించినధనమును దక్షిణగా నొసంగుటయు మున్నగునవి కర్మలోపములు. కర్మాచరణమున కావశ్యకమగుజ్ఞానము లేకుండుట, నింద్రితకృత్యములాచరించుట మున్నగునవి కర్తృదోషములు. ఇట్టిదోషములు లేనియెడఁ గర్మము తప్పక ఫలించునని వేదము నిరూపించుచున్నదేగాని దోషభూయిష్ఠములయినను గర్మములు ఫలించునని వేదము ప్రతిపాదించియుండలేదు లోకమున దారువును మథించినచో నగ్నిపుట్టు నను నాప్తవాక్యమునుబట్టి తడికట్టెను నసమర్థుఁ డొకఁడు మథించి యట నగ్నిపుట్టకుండుటచేఁ బయివాక్య మప్రమాణమనుట సంగతము కాదుగదా!

మఱియు వేదమునఁ గొన్నివాక్యములు పరస్పరవిరుద్ధములుగ స్థూలదృష్టికి గోచరించుచున్నంతమాత్రమున నయ్యవి ప్రమాణములు కావని నిరసింపరాదు. వానితాత్పర్యమును,

సూక్ష్మముగఁ బరికింపవలయును. తొలుత సూర్యోదయమునకుఁ బూర్వము హోమమునువిధించి యాహోమద్రవ్యమును శునకము భక్షించుననునిందచే నాహోమమును వేదము నిషేధించినమాట సత్యము. అయినను బురుషుఁడు మొట్టమొదట నగ్న్యాధానసమయముననే యనుదితహోమమునో యుదితహోమమునో యేదో యొకదానినే నియతముగఁ జేయుచుందునని సంకల్పింపవలయును. అట్లు సంకల్పించియుఁ బ్రమాదవశంబున సంకల్పితపూర్వమగుహోమమును విడిచి రెండవహోమమును జేసినచో నాహోమద్రవ్యమును శునకము భక్షించుననియు నయ్యది దేవతాప్రీతికరము గాదనియు వేదమతము గాని సంకల్పానుసారంబుగఁ జేయుహోమమును నిందించుట వేదమునకుఁ దాత్పర్యము గాదు. ఈరీతిగ నిట్టితావులస్ఫురించు విరోధములను బూర్వోత్తరపరిశీలనముచేఁ బరిహరించుకొనవలయును.

ఆవృత్తులు సార్థకంబులుగను నిరర్థకములుగను రెండువిధముల నుండును. అందు సార్థకావృత్తి ననువాదమనియు నిరర్థకావృత్తిని బునరుక్తమనియు వ్యవహరింతురు. వేదమునందలి మంత్రావృత్తులన్నియు సార్థకములు గానఁ బునరుక్తిదోషదూషితములనుటకు వలను పడదు. తత్తన్మంత్రావృత్తులసార్థక్యము వేదవ్యాఖ్యలయందు విపులముగ నిరూపింపఁబడియున్నది. లోకమునసయితము నర్థవిశేషములబోధింపవలసినపుడిట్టిపదావృత్తులు ప్రసిద్ధముగ నగపడుచునే యుండును. త్వరగా

వెళ్లుమని చెప్పవలసిన యవసరమున "వెళ్లువెళ్లు"మని చెప్పు దుము. ఇటుఁ బదావృత్తి త్వరితగమనమును బోధించుచు సార్థకమగుచుండును. ఇట్టివాక్యములను బునరుక్తములనిగాని యున్మత్తప్రలపితములనిగాని యెవ్వరేని పరిహసింతురా ?

కాఁగా వేదము లోకానుగ్రహార్థము ధర్మాధర్మముల బోధించుచు నర్థబోధమున కనుకూలించువిభాగములతోఁగూడి ప్రమాణమగుచున్నది. ఆవిభాగము లెట్టివన,

వేదము మంత్రమనియు బ్రాహ్మణమనియు ద్వివిధంబు. కర్మానుష్ఠానకాలమునఁ బఠింపఁబడునవిమంత్రములు. కర్మస్వరూపమును సాకల్యముగ బోధించునవి బ్రాహ్మణములు. ఈబ్రాహ్మణములు విధులు, నిషేధములు, అర్థవాదములు, అనువాదములు నని నాలుగువిధముల నుండును. ఒకక్రియను జేయవలయునని శాసించునది విధివాక్యము. ఈవిధులు నిత్యములు, నైమిత్తికములు, కామ్యములు, నిత్యకామ్యములు నని నాలుగువిధములుగ నుండును. ఒకక్రియను జేయవలదని శాసించునది నిషేధవాక్యము. ఈవిధినిషేధములను స్తుతినిందలచే బలపఱుచునవి యర్థవాదములు. ఇవి స్తుత్యర్థవాదములనియు నిందార్థవాదములనియు వ్యవహరింపఁబడుచుండును. తొలుత నొకదానిని బ్రతిపాదించి తత్సంబద్ధమగుకర్మాంతరమునుగాని స్తుతినిందలనుగాని నిరూపించుటకై పూర్వప్రతిపాదితమును మరలఁ జెప్పుట యనువాద మనఁబడును. ఇట్టి విధ్యాదులు లౌకికవ్యవహారమునఁగూడఁ గన్పట్టుచుండును. ఎట్లన;

గ్రంథము చదువవలయునని బాలకుని శాసింతుము. (=విధి) చదివినచో గొప్పలాభముండునని బోధింతుము. (=అర్థవాదము) అచిరకాలమున బాలకుఁడు ప్రవీణుఁడు గావలయునను తలంపున 'చదువుము చదువుము'ని మరల మరల హెచ్చరింతుము. (=అనువాదము)

ఈరీతిని విధ్యర్థవాదానువాదరూపము లగులౌకిక వాక్యము లెట్లు హితబోధకములై యాదరణపాత్రము లగుచుండునో యటులే వేదవాక్యములును బ్రమాణము లనవలయుంగాని నిరాకరణీయంబులనుటకు సాహసింపరాదు. మఱియు,

**సూ:—మంత్రాయుర్వేదప్రామాణ్యంబువోలె నాప్తప్రామాణ్యంబునఁ దత్ప్రామాణ్యంబు సిద్ధంబు. ౫౮**

లోకమునఁ బ్రాయికంబుగ వ్యవహారములన్నియు నాప్తోపదేశంబువలన సిద్ధించుచుండును. ఋషులు మున్నగుమహనీయులు తమవిజ్ఞానమహిమచేఁ బ్రపంచతత్త్వమును సమగ్రముగఁ దెలిసికొని భూతదయాపరులై ప్రాణికోటినెల్ల నుద్ధరింపఁదలంచి, యీపనులు చేయవలయుననియు నీవస్తువులఁ బరిగ్రహింపవలెననియు నిట్టిగుణము లవలంబింపఁదగినవనియు నీపనులు చేయరాదనియు నీవస్తువులఁ బరిగ్రహింపరాదనియు నిట్టిగుణము లవలంబింపఁదగదనియు నీరీతిని సవిశేషముగ లోకమున కుపదేశింతురు. ఇటు లుపదేశించుమహనీయులే యాప్త

లనఁబడుదురు ఇట్టియాప్తులయుపదేశములే లేకున్నచో హితాహితజ్ఞానమును దత్సాధనజ్ఞానమును శూన్యమగునుగాన హితపరిగ్రహమునకును నహితపరిహారమునకును యత్నింపనేరక మనుజులెల్లరును దుఃఖైకభాజనులై యపారంబులగు క్లేశంబుల పాలుగావలసియుండెడిది. ఈయాప్తులు సర్పవృశ్చికాదివిష సంహారకములును పిశాచాదిబాధానివారకములును నశని పాతాద్యుపద్రవనిరోధకములును నగుమంత్రములను, సకల రోగనివారకములయి పుష్టిదాయకములగు నోషధులస్వరూప మును గుణములను వినియోగప్రకారమును బోధించునాయు ర్వేదవిద్యను బ్రత్యక్షఫలకంబులగువానిని లోకమున కుప దేశించియున్నవారు. మఱియు నీరీతిని దృష్టఫలకంబులగు నైహికవిషయంబుల నుపదేశించుటయేగాక దృష్టాదృష్టఫల కంబులగు నైహికాముష్మికసుఖసాధనముల నెన్నింటినో బోధిం చువేదంబులఁ గనిపెట్టి లోకమునఁ దత్ప్రచారముగావించి స్మృత్యాదులద్వారమున వేదార్థములను సుస్పష్టముగ నుపదే శించియున్నవారు. పయినిజూపినరీతి నాప్తోపదిష్టములగుమంత్రా యుర్వేదములఫలము ప్రత్యక్షమగుచుండుటచే లోకము వాని నెల్ల విశ్వసించుచునేయున్నది. ఇటులే వేదమున నుపపాదింపఁ బడిన దృష్టఫలకములగువిషయములందును లోకమునకు విశ్వా సముగలుగకమానదు. ఇట్లాప్తులకుఁ బ్రామాణ్యము స్థిరపడు చుండుటచే వారుపదేశించినదృష్టఫలకము లెట్లు ప్రమాణము లగునో యటులే తదుపదిష్టములే యగునదృష్టఫలకములగు

విషయములును దత్ప్రతిపాదకమగు వేదమును బ్రమాణమే యని యంగీకరింపవలయుఁగాని త్రోసిపుచ్చుట యుచితంబు గాదు.

ఇటఁ గొందఱు (మీమాంసకులు) వేదమునందును మన్వాదిస్మృతులందును వేదము నిత్యమని ప్రతిపాదింపఁబడి యుండుటచే నిత్యత్వమువలననే దానికిఁ బ్రామాణ్యము సిద్ధించునుగాని యాప్తోపదిష్టత్వమువలన సిద్ధింపదనియు, నిటులే లౌకికశబ్దములును నిత్యములగుటవలననే ప్రమాణములగుననియు నాప్తోపదేశప్రామాణ్యముతోడఁ బనిలేదనియు నిరూపింతురు. కాని వాచ్యవాచకభావసంబంధమునుబట్టియే తత్తదర్థములందుఁ దత్తచ్ఛబ్దములు ప్రమాణములగుచుండును. ఆసంబంధ మాప్తోపదేశమువలననే విశదము కావలసియుండును. కాఁగా నాప్తోపదేశమే శబ్దప్రామాణ్యమునకు మూలమగుచున్నది. ఇట్లుగాక నిత్యత్వమువల్లనే శబ్దములు ప్రమాణములగునన్నచో నాక్షేపకులమతమున నన్నిశబ్దములును నిత్యములే గావున ననాప్తోచ్చరితములుసయితము ప్రమాణములు కావలసియుండును. మఱియు లోకమున మనుజులకుఁ దలిదండ్రులు సంకేతముగ నేర్పఱచినసంజ్ఞాశబ్దము లామనుజులబోధించుచుఁ బ్రమాణము లగుచుండునుగదా? ఇట్టియెడ సంజ్ఞయు, సంజ్ఞియు ననిత్యములే యగుటచే నిత్యత్వమునుబట్టి ప్రామాణ్యమును గల్పింప వలనుపడదుగదా! ఇదిగాక శ్రుతిస్మృతులందు నిరూపింపఁబడిననిత్యత్వము సంప్రదాయావిచ్ఛేదరూప

మగు ప్రవాహనిత్యత్వముగాని స్వరూపనిత్యత్వముగాదు. అనఁగా వేదమంత్రముల ప్రచారము నదీప్రవాహమువలె విచ్ఛేదములేక యెల్లకాలములందు సాగుచుండుననిగాని గగనాదులవలె వేదమునందలిశబ్దములు నిత్యములని శ్రుతిస్మృతులతాత్పర్యముగాదు.

శబ్దవిశేషపరీక్షా ప్రకరణము

సమాప్తము.

ఆంధ్రన్యాయదర్శనమునఁ ద్వితీయాధ్యాయమునఁ

బ్రథమాహ్నికము

సమాప్తము.

శివాయ గురవే నమః.

# న్యాయ దర్శనము

## ద్వితీయాధ్యాయము.

---

ద్వితీయాహ్నికము.

### (పూ) సూ:— ఐతిహ్యార్థాపత్తిసంభవాభావప్రామాణ్యంబునఁ బ్రమాణచతుష్ట్వం బనుపపన్నంబు—౧.

తొలుత నెవరుచెప్పిరో తెలియకుండ 'ఇట్లు జరిగినదఁట' మొదలగురీతిని జనులు పరంపరగాఁ జెప్పుకొనుచుండుట యైతిహ్య మనఁబడును. ఈయైతిహ్యములు గొన్ని విశ్వాసపాత్రములగుచు నర్థసాధకములై ప్రమాణములగుచుండును. ఒకవిషయము చెప్పుటవలన నింకొకవిషయము సిద్ధించుట యర్థాపత్తి (అర్థాత్+ఆపత్తిః=ప్రాప్తిః.) యనఁబడును. 'మేఘములు లేనిచో వర్షము గురియదు' అని చెప్పుటవలన మేఘము లున్నచో వర్షము గురియు ననువిషయము సిద్ధించుచుండును. ఇట మేఘములవలన వర్షము గురియుటను మేఘములు లేనపుడు వర్షము గురియకుండుటయే ప్రమాణముగుచున్నది. ఒకవస్తు వున్నదని చెప్పినచోఁ దదంతర్గతమై తదవినాభూతమగు వేఱొక వస్తువు సిద్ధించుట సంభవ మనఁబడును. ఒకనియొద్ద నూఱు గ్రంథములున్నవని చెప్పినచో నూటిలో నేఁబది యంతర్గత

మగుటచే నాతనియొద్ద నేఁబది గ్రంథము లున్నవని చెప్పకుండఁగనే తేలుచుండును. ఇట నూఱుగ్రంథములుండుట యేఁబది గ్రంథము లుండుటలో బ్రమాణ మగుచుండును. అభావ మనఁగా లేకపోవుట ఒకవస్తువు లేకపోవు టింకొకవస్తు వుండుటకు సూచకమయి ప్రమాణ మగుచుండును. గగనమున మేఘములున్నను వాయునిరోధముచే వర్షము గురియకుండుట యనుభవసిద్ధము. ఇట వర్షాభావము వాయునిరోధమును సూచించుచుఁ బ్రమాణ మగుచున్నది.

ఈరీతిని ఐతిహ్యము, అర్థాపత్తి, సంభవము, అభావము నను నీనాలుగును నర్థసాధకములై ప్రమాణములగుచుండ వీనింగూడఁ బ్రమాణములలోఁ జేర్పక ప్రత్యక్షాదులు నాలుగే ప్రమాణములనుట యెట్లు పొసంగునని కొందఱు శంకింతురు కాని,

(స) సూ:—శబ్దానుమానాంతర్భావంబునఁ బ్రమాణ చతుష్ట్వంబు సుసిద్ధంబు—౨.

ఆప్తప్రతిపాదితమని తెలిసినపుడే యైతిహ్యము విశ్వాసపాత్రమై ప్రమాణ మగుచుండును కాన నియ్యది శబ్దప్రమాణాంతర్గత మగునుగాని ప్రమాణాంతరము కానేరదు. అర్థాపత్తియు, సంభవంబును, నభావంబును ననుమానప్రమాణమున నంతర్భూతములగును. ఎట్లన; అప్రత్యక్షమగువహ్ని నూహించుటకు సాధన మగుప్రత్యక్షధూమ మనుమానముగదా! అర్థాపత్తి యన మేఘములు లేనపుడు వర్షము కురియకపోవు

టను జూచి మేఘములున్నపుడు వర్షము కురియునని యూహించుటగదా! ఇట్టి యర్థాపత్తి యనుమానాంతర్గత మే యగుచుండును. సంభవమనఁగా నేఁబదితో నియతసంబంధముఁగల నూఱును సంఖ్యను గ్రహించినచో నేఁబది యనుసంఖ్యగూడ గృహీతమగుటగదా! ఇదియు ననుమానముకంటె నెట్లు భిన్నమగును? మేఘములున్నను వర్షము గురియకుండుటచే వర్షప్రతిబంధకమగు వాయునిరోధము నూహింతుము. ఇటఁ బ్రత్యక్షమగు వర్షాభావముచే నప్రత్యక్షమగు వాయునిరోధ మూహింపఁబడుచుండుటచే నియ్యదియు ననుమానమే యనవలయును.

ఈరీతిని బయిని జూపిన యైతిహ్యాదులు నాలుగును బ్రమాణములే యగుచున్నను నయ్యవి యతిరిక్తప్రమాణములుగాక శబ్దానుమానాంతర్గతములే యగుచుండుటచేఁ బ్రమాణములు నాలుగే యనుట దృఢపడుచున్నది.

## (పూ.) సూ:—అర్థాపత్తి యనైకాంతికమగుటంజేసి యప్రమాణం బనఁజెనదు—3-౪.

తప్పక కార్యమును సాధింపఁజాలనియది యనైకాంతిక (౧-౨-౫) మనఁబడును. మేఘములు లేనపుడు వర్షము గురియకపోవుటచే మేఘము లున్నపుడు వర్షము గురియునని యూహించుట యర్థాపత్తి యని నిరూపింపఁబడినది. మేఘము లున్నపుడుసయితము వర్షము కురియకుండుట గలదు. కాన మేఘములున్నచో వర్షము గురియు ననునూహ యెట్లు సరి

పడును? ఈరీతి నర్థాపత్తి కార్యసాధకముగాకుండుటచేఁ బ్రమాణమే కానేరదని యిట మఱికొందఱు శంకింతురు. కాని యట్టిశంకల కిట నవకాశము లేదు.

మేఘములు లేనపుడు వర్షము గురియదనఁగాఁ గారణము లేనపుడు గార్యము పుట్టదనుట. దీనివలనఁ గారణ మున్నపుడు కార్యము పుట్టుననునర్థము సిద్ధించును, గాని కారణమున్నపుడెల్లఁ గార్యము పుట్టియేతీఱవలయు ననునర్థము సిద్ధింపదు. కాఁగా నిటఁ గారణమున్నపుడు కార్యము పుట్టుననునది మాత్రమే యర్థాపత్తివిషయ మగుచుండును. కారణము లేకుండఁ గార్యముపుట్టుట ప్రపంచమున నసంభవమగుటచే నీయర్థాపత్తివిషయమున నెన్నఁడును వ్యభిచారము సంభవింపదు. ప్రతిబంధకము లున్నచోఁ గార్యమును బుట్టింపఁజాలకుండుట కారణధర్మము. కాని యిది యర్థాపత్తివిషయము కానేరదు. ఇట్టిదాని నర్థాపత్తిగా భ్రమించి పూర్వోక్తరీతి నాక్షేపించుట యుక్తముగాదు. లోకమున నెటనయినఁ గారణము లేకుండఁగనే కార్యము పుట్టినటు లాక్షేపకులు చూపఁగలిగినచో నీయర్థాపత్తి యప్రమాణమగును. ఇట్లు స్వవిషయమునఁ గాక విషయాంతరమున వ్యభిచారమును జూపినచో నిది యెట్లు దుష్టమగును? ఇట్టి విషయాంతరవ్యభిచారములను జూపఁబూనినచో సర్వసమ్మతము లగు ప్రత్యక్షాదులును నప్రమాణములే కావలసివచ్చును. అటులే ప్రకృతమున నాక్షేపకుల ప్రతిషేధము నయితము విషయాంతరమున వ్యభిచరితమే

యగుచుండునుగాన నియ్యదిమాత్రము ప్రమాణమగు టెట్లు? ఆక్షేపకుల ప్రతిషేధము విషయాంతరమున వ్యభిచరితమయినను స్వవిషయమున వ్యభిచరితము కాకుండుటచేఁ బ్రమాణ మగు నందురేని యట్లే యర్థాపత్తియు స్వవిషయమున వ్యభిచరితము కాకుండుటచేఁ బ్రమాణమే యని యంగీకరింపక తప్పదు.

**సూ:—అభావంబు ప్రమేయాసిద్ధింబట్టి యప్రమాణంబనుట యసంగతంబు—౨-౧౨.**

ఉన్నవస్తువు దేనికైనఁ బ్రమాణము కాఁదగునుగాని లేకపోవుటయే స్వరూపముగాఁగల యభావము వేఱొకదానికిఁ బ్రమాణమగుట యెట్లని యిటఁ గొందఱు సామాన్యులు శంకింతురు. కాని యీశంక మిగుల దుర్బలంబు. రంగుబట్టలును రంగులేనిబట్టలునుగలసి యొకతావున నున్నపుడు రంగులేని బట్టలను దీసికొమ్మని చెప్పుదుము అందు రంగులేని వెవ్వియో గ్రహీతకు స్పష్టముగఁ దెలియునుగదా? ఇట రంగుబట్టలను దెలిసికొనుటకు రంగెటులు కారణమగుచుండునో రంగులేని బట్టలను దెలిసికొనుటకు రంగులేకపోవుటయు నటులే కారణమగుచుండునుగదా? ఈరీతిగ నభావము వస్త్వంతరవ్యావర్తకమయి జ్ఞానసాధనమగుచుఁ బ్రమాణమగుచుండుట సర్వానుభవసిద్ధము రంగువేసినబట్టలకుఁ గాలక్రమమున రంగుపోయినచో నయ్యవి రంగుపోయినవి యగునుగాని యాంతఱ కెన్నఁడును రంగుతో సంబంధములేనిబట్టలకు వర్ణాభావము (రంగు లేకుండఁబోవుట) యెట్లు సంభవించుననియు శంకింపరాదు.

అభావము ధ్వంసరూపమేగాక ప్రాగభావరూపముగను నుండును. ఒకప్పుడుండి పిమ్మట నశించుట ధ్వంసమందురు. కార్యోత్పత్తికిఁ బూర్వమందుండు నభావమును బ్రాగభావమందురు రంగులేని బట్టలందు ధ్వంసరూపమగు నభావము లేకున్నను రంగువేయ నంతవఱకుఁ బ్రాగభావ ముండియేతీఱును. గావున వర్ణాభావ మెట్లు సిద్ధించు ననుశంక కిట నవకాశమే యగపడదు.

ప్రమాణచతుష్ట్వపరీక్షా ప్రకరణము

సమాప్తము.

---

**సూ:—కారణవత్త్వంబునను, వ్యవహారంబునను నైంద్రియకత్వంబునను ననిత్యంబు శబ్దంబు—౧౩.**

కొందఱు మీమాంసకులు శబ్ద మాకాశగుణమనియు, నాకాశమువలెనే సర్వవ్యాపకమనియు, నిత్యమనియుఁ, బ్రపంచమునందలి శబ్దమెల్ల నొక్కటియే యనియు, నిమిత్తవశమున భిన్నభిన్నముగ నభివ్యక్తమగుచుండుననియు నిరూపింతురు. రూపరసగంధస్పర్శములతో పాటుగ శబ్దము పంచభూతములకు సంబంధించియుండుననియు, రూపాదులవలెనే యనిత్యమనియు నిమిత్తవశమున నభివ్యక్తమగుననియు సాంఖ్యులయాశయము. శబ్ద మాకాశగుణమనియు నుత్పత్తి వినాశములుగలదనియు వైశేషికమతము పృథివ్యాదిమహాభూతములసంబంధమువలన శబ్దము పుట్టుననియు, నిరాధారమనియు బౌద్ధులు తలంతురు.

ఇట్లు శబ్దస్వరూపమువిషయమున మతభేదము లుండుటచేఁ దత్స్వరూపమును సవిమర్శముగ నిర్ణయింపవలసియున్నది.

(1) శబ్దము కంఠతాల్వాదిసంయోగవిభాగములచే నుద యించునదిగానఁ గారణజన్యమగుచుండుటచే ననిత్యమను టయే సమంజసము కారణజన్యమగువస్తువు నశింపకతీఱదుగదా? ఇట సంయోగవిభాగములు శబ్దోత్పత్తికారణములుగాక యా వఱకే సిద్ధమయియున్నశబ్దమునకు వ్యంజకములని కొందఱు తలంతురు. వీరిమతమున భేరీదండసంయోగమువలన నభివ్యక్త మగుశబ్దము చాటుననున్నపురుషునికి వినఁబడుట సంభవింపక పోవలయును. ఇట వ్యంజకమగుభేరీదండసంయోగమును జాటుననున్నపురుషుఁడు గ్రహింపఁజాలఁడుగదా? వ్యంజకమగు దీపకాంతి ప్రత్యక్షముకానివానికిఁ దద్వ్యంగ్యమగుఘటాదికము ప్రత్యక్షమగుట యెట్లు సంభవించును? కావున శబ్దమునకు భేరీదండసంయోగము వ్యంజకమనుట సరిగాదు ఉత్పాదకమే యనవలయును. ఇటులన్నచో నుత్పాదకమగుసంయోగము కనఁబడకున్నను దజ్జన్యమగుశబ్దము వినఁబడుట కభ్యంతరము గానరాదు. కారణమగు కుమ్మరి యగపడకున్నను గార్యమగు ఘటమగపడుచుండుటచేఁ గార్యప్రత్యక్షమునఁ గారణప్రత్యక్ష మావశ్యకముగాదుగదా?

(2) మఱియు నుత్పత్తివినాశములు గలసుఖదుఃఖాదులు తీవ్రములనియు మందములనియు వ్యవహరింపఁబడునటులే శబ్దముగూడఁ దీవ్రమనియు మందమనియు వ్యవహరింపఁబడు

చుండుటచే దీనికిని నుత్పత్తివినాశము లుండుననుటయే సమంజసము. ఇటఁ గొందఱు మీమాంసకులు శబ్దమెల్ల నొక్కటియే యనియు నయినను వ్యంజకమగుదీపకాంతికిఁ గలస్పష్టత్వాస్పష్టత్వములు వ్యంగ్యమగురూపమునందు నౌపచారికముగ వ్యవహరింపఁబడు చుండునటులే వ్యంజకమగు భేరీదండసంయోగమునకుఁ గలతీవ్రత్వమందత్వములు శబ్దమునం దౌపచారికముగ వ్యవహరింపఁబడు చుండుననియు నట్టియౌపచారికవ్యవహారమాత్రమున శబ్ద ముత్పత్తివినాశశాలియని యంగీకరింపఁబనిలేదనియు నాక్షేపింతురు కాని లోకమున తీవ్రమగు భేరీశబ్దము మందమగువీణాశబ్దమును వినఁబడకుండఁ జేయుట యనుభవసిద్ధము. శబ్దమెల్ల నొకటియే యనుచో నొకశబ్దమును వేఱొకశబ్ద మభిభవించునను ననుభవము వీరిమతమున నెట్లు సరిపడును? అదిగాక వీరిమతమున వ్యంగ్యవ్యంజకములు రెండును భిన్నదేశస్థములా? సమానదేశస్థములా? యని పరిశీలింపవలయును. భిన్నదేశస్థములకు వ్యంగ్యవ్యంజకభావ ముపపన్నము గాదు. ఒకగృహమున దీపముంచినచో దానివలన దూరస్థమగు వేఱొకగృహమునందలి వస్తువు లగపడవుగదా? ఇక భేరీదండసంయోగమును దద్వ్యంగ్యమగుశబ్దమును నొకే స్థలమున నుండునందురేని యిచటిశబ్దము స్థలాంతరముననుండు వీణాశబ్దము నభిభవించుట యెట్లు పొసఁగును. భిన్నస్థలములనుండు నీరెండుశబ్దములకును సంబంధమే లేదుగదా? ఇట్లు సంబంధము లేకున్నను నభిభవించునన్నచో నొకభేరీశబ్దము

ప్రపంచమునందలి మందములగు వీణాశబ్దాదుల నన్నిఁటిని నొక్కమాఱుగ నభిభవింపవలయుఁగదా ? అట్టి యభిభవ మసంభవమని సర్వవిదితము. కాఁగా నీ మీమాంసకమతము సయుక్తికముగఁ గానరాదు కావున నైయాయికమతము నీ క్రిందిరీతిని గ్రహింపవలయును. భేరీదండసంయోగమువలన భేరి యొద్ద శబ్దము పుట్టును. ఆశబ్దమునుబట్టి యన్నివైపులను ధారారూపముగ శబ్దము లేర్పడును ఈశబ్దపరంపరలు వాయువశమున సుదూరము వ్యాపించుచుండును. ఆశబ్దములలో మన శ్రోత్రేంద్రియమునకు సంబంధించినవానినిమాత్రము మనము గ్రహించుచుందుము. మనశ్రోత్రేంద్రియమును సంబంధించిన వానిలోఁ దీవ్రమగుశబ్దము మందశబ్దము నభిభవించుచుండును. అనఁగాఁ బెద్దధ్వనిచేఁ జిన్నధ్వని తిరోహితమై మనకు వినఁబడదని తాత్పర్యము.

(3) మఱియు గంధాదులవలె శబ్దమును నింద్రియగ్రాహ్యమగుచుండుటచే దీనింబట్టిగూడ శబ్ద మనిత్యమనియే తేలుచున్నది.

**(పూ) సూ:—ప్రధ్వంసాభావ, వ్యవహార, జాతులం బట్టి యనిత్యతాహేతువు లనుపపన్నంబులు—౧౪.**

(1) పుట్టినవస్తువు నశించుట ప్రధ్వంసాభావము. ఈ యభావమున కెప్పటికిని వినాశము లేదు. కావున నిది నిత్యము గదా ? వస్తువినాశమున కేదియో కారణ ముండియేతీఱును.

కాఁగా సకారణమగు నీప్రధ్వంసాభావము నిత్యమగుచున్న టులే సకారణమగుశబ్దమును నిత్యమే యనరాదా?

(2) అనిత్యములగు వృక్షాదులయెడ వృక్షప్రదేశము మున్నగువ్యవహారము లున్నటులే నిత్యములగు గగనాదుల విషయమునసయితము గగనప్రదేశము మున్నగువాడుకలు గలవు. ఇట్టివ్యవహారసామ్య మున్నంతమాత్రమున గగన మనిత్య మనఁజాలమగదా ? ఇటులే సుఖదుఃఖాదుల తీవ్రత్వ మందత్వవ్యవహారసామ్యమునుబట్టి శబ్ద మనిత్యమనుట యెట్లు పొసంగును?

(3) న్యాయమతమున నింద్రియగ్రాహ్యములయినను ఘటత్వాదిజాతులు నిత్యములని యంగీకరించియుండిరిగదా ? ఇటులుండ శ్రోత్రేంద్రియగ్రాహ్యమయినంతమాత్రమున శబ్ద మేల యనిత్య మనవలసివచ్చెను ? కాఁగా నీరీతిని గారణ వత్త్వము ప్రధ్వంసాభావమునందును, నైంద్రియకత్వము ఘటత్వాదిజాతులందును, వ్యవహారము గగనమునందును వ్యభి చరితము లగుచుండుటచే వీనింబట్టి శబ్దమునకు ననిత్యత్వ మును సాధించుట యెట్లని యిటఁ గొందఱు ప్రశ్నింతురు.

**(స) సూ:—వ్యవహారభేదమునుబట్టియు సంతానాను మానమునుబట్టియు నాక్షేపం బనుపపన్నంబు— ౧౫-౧౬-౧౭.**

(1) లోకమున ముఖ్యమనియు నౌపచారికమనియు వ్యవ హారంబు ద్వివిధంబు. ఒకదానికిఁ గలవాస్తవికధర్మమునుబట్టి

ప్రవర్తించునది ముఖ్యవ్యవహారము. ఆరోపితధర్మమునుబట్టి ప్రవర్తించునది యౌపచారికవ్యవహారము. ప్రకృతమునఁ బ్రధ్వంసాభావమునకుఁ గలనిత్యత్వవ్యవహార మౌపచారికము గాని ముఖ్యము కానేరదు వాస్తవికనిత్యత్వముగలదానికి యుత్పత్తియు వినాశమును నుండరాదు. ప్రధ్వంసాభావము నకు వినాశములేకున్నను నుత్పత్తిగలదుగాన దీని నిత్యత్వ మారోపితమగునుగాని వాస్తవికము కానేరదు. కాఁగా నిట నిత్యత్వవ్యవహార మౌపచారిక మగుచున్నది. వాస్తవికనిత్య త్వములేని యిట్టి ప్రధ్వంసాభావమును దృష్టాంతముగఁ గైకొని తత్సామ్యమున శబ్దమునకు నిత్యత్వముగల్పించుట యుక్తము గాదు

(2) ఆక్షేపకులు చూపినటులు వృక్షప్రదేశమను వ్యవ హారమువలెనే యాకాశప్రదేశ మనువ్యవహారము లోకమున నుండుట సత్యము కాని వృక్షమునకు శాఖాస్కంధాదిప్రదేశ ములే యవయవములు వృక్షము వాస్తవికముగ నిట్టియవ యవములు గలదగుటచే నిట నవయవముల బోధించెడిప్రదేశ వ్యవహారము ముఖ్యమగుచుండును. గగనమునకు నవయవ ములు లేకపోవుట సర్వసమ్మతము. కావున నిటఁ బ్రదేశవ్యవ హారము వాస్తవికముగాక యౌపచారికమగుచుండును సుఖ దుఃఖములకును శబ్దమునకును వాస్తవికముగఁ గలతీవ్రత్వాది ధర్మములసామ్యమునుబట్టి యచటి ముఖ్యవ్యవహారముచే సుఖ దుఃఖములవలె శబ్దమును ననిత్యమని పూర్వము నిరూపింపఁ

బడినది. ఇట నాక్షేపకు లౌపచారికవ్యవహారమునకు వ్యభిచారమును జూపిరిగాని ముఖ్యవ్యవహారమునకు వ్యభిచారమును జూపియుండరైరి. కావున శబ్ద మనిత్యమనుటకు హేతువుగ గ్రహింపఁబడిన తీవ్రత్వాదిముఖ్యవ్యవహారము వ్యభిచరితము కాకుండుటచే శబ్దమున కనిత్వము నే స్థిరపఱుచుచున్నది.

(3) ఇంద్రియములు వస్తువులను గ్రహించుటలో రెండు పద్ధతులు గలవు. చక్షురింద్రియము ఘటాదివస్తువులను సమీపించి యావస్తువులను దద్గతధర్మములను గ్రహించుచుండును. శ్రోత్రఘ్రాణాదు లీరీతిని వస్తువులను సమీపింపక పవనాదివశంబున తమయొద్దకువచ్చిన శబ్దగంధాదులను గ్రహించుచుండును. కాఁగా దీనింబట్టి శ్రోత్రము భేరీశబ్దమును గ్రహింపవలయునన్నచో భేరియొద్దనుండి శ్రోత్రమునఱకు నెన్నియో శబ్దములు ధారారూపముగ నుదయింపవలసియుండును. ఇట్లుదయించి క్రమముగా శ్రోతమును సమీపించినశబ్దము శ్రోత్రగృహీతమయినపిమ్మట నశించుటయు మనకనుభవసిద్ధము. ఈ రీతిగ నింద్రియమును సమీపించి గృహీతములగునవి యన్నియును నుత్పత్తివినాశములు గలవగుటచే ననిత్యములే యగుచుండును.

కాఁగా నిటు లైంద్రియికత్వహేతువుగూడ వ్యభిచరితముగాకుండుటవలన నెటులు పరిశీలించినను శబ్ద మనిత్యమే యని తేలుచున్నది. మఱియు,

**(స) సూ:—అనావృతంబయ్యుఁ బ్రాగనుపలబ్ధిచే ననిత్యంబు—౧౮.**

శబ్దము నిత్యమే యయినచో నుచ్చరింపఁబడక పూర్వము సయితము మన కగు వినఁబడవలసియుండును. ఒకప్పు డేదయినఁ బ్రతిబంధకమున్న యెడల నది వినఁబడకున్నను నట్టిప్రతిబంధకము లెవ్వియు లేనియెడ విధిగా వినఁబడవలయుఁగదా? అట్లు వినఁబడకుండుటచే నిత్యమనుటకు వలనుపడదు. శబ్దము నిత్యమయినను దానికి నుచ్చారణము వ్యంజకముగాన నయ్యది లేనంతవఱకు శబ్దము వినఁబడదనియు నంతమాత్రమున దాని నిత్యతకు భంగములేదనియు శంకింపరాదు. మనుజుఁడు తన యభిప్రాయమును నితరుల కెఱిఁగింపఁ దలఁచినపుడు తత్ప్రియత్నముచేఁ బ్రేరితమయి వాయువు లోపలినుండి ముఖద్వారమున వెలువడును. అట్లు వెలువడునపుడు కంఠతాల్వాదిస్థానములతో దానికిఁ గలుగుసంయోగవిభాగములే యుచ్చారణము గదా? ఇట్టిసంయోగము శబ్దమున కుత్పాదకమనియు వ్యంజకముగాదనియుఁ బూర్వము (౨-౨-౧౩) నిరూపింపఁబడినది. ఉచ్చారణమునకుఁ బూర్వకాలమందుఁగాని యుత్తరకాలమందుఁగాని వినఁబడక యుచ్చారణసమయమునమాత్రము వినఁబడుచుండుటచే నుత్పత్తివినాశశాలియగుశబ్ద మనిత్యమని దృఢపడుచున్నది.

**సూ:—తదనుపలబ్ధ్యాదులంబట్టియు నావరణసిద్ధి దుర్ఘటంబు—౧౯-౨౦-౨౧**

శబ్దాభివ్యక్తికిఁ బ్రతిబంధకమగు నావరణము కనఁబడకుండుటచే నది లేదని యెటులందురో యటులే యావరణాభావమును నగపడకుండుటచే నయ్యదియు లేదనియే చెప్పవచ్చును గదా? మన కగపడకున్నను నావరణాభావమున్నదందురేని యటులే యగపడనియావరణముగూడ నున్నదనియే యంగీకరింపరాదా ? ఈరీతి నెటులయినను నావరణము సిద్ధించుచునే యున్నదే? అది లేదనుట యెట్లు? అని యిటఁ గొందఱు చమత్కారముగఁ బ్రశ్నింతురు కాని యావరణమువలె నావరణాభావము సత్పదార్థముగాకుండుటచే నదియున్నను మన కగపడుట కవకాశము లేదు. ఆవరణమున్నచో నయ్యది సత్పదార్థముగాన నగపడియే తీఱవలయును. ఇట్లు భిన్నస్వభావముగల పదార్థములకు సామ్యమును గల్పించి యట్లు ప్రశ్నించుట న్యాయ్యముగాదు.

ఇటమీఁద శబ్దము నిత్యమనుటకు మీమాంసకులు చూపినహేతువులను గనుఁగొని పరిశీలింపవలసియున్నది.

**సూ:—స్పర్శాభావంబునను[1] సంప్రదానంబునను[2] నభ్యాసంబునను[3] శబ్దంబు నిత్యంబు—౨౨-౨౪-౨౫.**

(1) స్పర్శరహితమగుగగనమువలెనే స్పర్శము లేకుండుటచే శబ్దము నిత్యము.

(2) గురువు శిష్యునకు వేదమంత్రము లుపదేశించుటయు శిష్యుఁడు వానిని గ్రహించి పఠించుటయు లోకమునఁ గలదు.

ఇట్లు గురువుపదేశించుశబ్దములు శిష్యుఁడు గ్రహించి తిరిగి పఠించునంతదనుక నశింపక నిలిచియుండవలయునుగదా? అట్లు నిలువక యయ్యవి క్షణికములే యయినచో శిష్యుఁడు వానిని గ్రహించి పఠించుటెట్లు? దీనింబట్టి శబ్దములు క్షణికములు కావని తేలుచున్నది. ఇట్లు క్షణికములుగాని శబ్దములకుఁ బిమ్మట నాశకసామగ్రి లేకుండుటచే నవి నిత్యములే యని స్థిరపడు చున్నది.

(3) ఒకశబ్దమును బలుమా ఱావృత్తిచేయుచుండుటయు లోకమునఁ బ్రసిద్ధము శబ్దము క్షణికమే యగుచో నిట్టియభ్యాసము సంభవింపదుగాన దీనింబట్టియు శబ్దము స్థిరమే యని తేలుచున్నది. అని మీమాంసకులు శబ్దనిత్యత్వమునకు హేతువులఁ జూపుదురు. కాని,

**సూ:—కర్మానిత్యత్వాంతరానుపలబ్ధ్యుపచారంబులం బట్టి నిత్యత్వహేతువులనుపపన్నంబులు —౨3-౨౪-౨౬-౨౭-౨౮-30-3౧-3౨.**

క్రియస్పర్శరహితమనియు ననిత్యమనియు ననుట సర్వసమ్మతముగదా? మఱియు స్పర్శముగలపరమాణువులు నిత్యములగుచున్నవి. ఈరీతిని స్పర్శాభావ మనిత్యములందును స్పర్శము నిత్యములందును వ్యభిచరితము లగుచుండుటచే నివి నిత్యత్వమునకుఁగాని యనిత్యత్వమునకుఁగాని సాధకములు గానేరవు.

(2) గురు వుపదేశించినపిదపఁ గొలఁది కాలమునకు శిష్యుఁడా వేదమంత్రమును బఠించును. గురు వుపదేశించునపుడును శిష్యుఁడు పఠించునపుడును దప్ప మధ్యకాలమున నాశబ్దము లెవ్వరికిని వినఁబడవు. అయ్యవి స్థిరములే యగుచో మధ్యకాలమునసయితము వినఁబడుచునే యుండవలయుఁగదా? అట్లు వినఁబడకుండుటచే మధ్యకాలమున నాశబ్దములు నశించినవనియుఁ దత్సజాతీయశబ్దములను శిష్యుఁడు పఠించుననియు నంగీకరింపఁగలయును. కావున నిట్టి సంప్రదానముసయితము నిత్యత్వమును సాధింపఁజాలదు.

(3) "వాఁడు రెండుమాఱులు నాట్యము చేసెను. రెండుమాఱులు భుజించెను" మున్నగుచోటులందు నస్థిరములగు క్రియలకును నావృత్తి యగపడుచున్నది. ఇట మొదటినాట్యక్రియకును రెండవనాట్యక్రియకును భేదముండుట సుస్పష్టము గదా? అట్లు భిన్నములయినను నీరెండుక్రియలును సజాతీయములగుటచే నిట్టియెడ నౌపచారికముగ నావృత్తివ్యవహారముపపన్నమగుచుండును. కావున స్థిరాస్థిరసాధారణమగు నుఁ గొన్నిచోట్ల నౌపచారికమగు నావృత్తివ్యవహారమునుబట్టి శబ్దము నిత్యమనుట పొసంగదు.

ఇటుఁ గొందఱు భిన్నవస్తువెల్లఁ దన్నుఁబట్టి యభిన్నమే యగుచుండునుగానఁ బ్రపంచమున భిన్నమగువస్తువే యుండదనియుఁ గావునఁ బయిని నిరూపించినరీతిని 'భిన్నవస్తువుల కౌపచారికముగ నావృత్తివ్యవహారముండుననుట యుక్తము

గాదనియు శంకింతురు. కాని లోకమున భిన్నవస్తువే లేనియెడఁ దద్బోధకముగ భిన్నశబ్దము సిద్ధించుటెట్లు? అది సిద్ధింపనిచో దానితోఁ గలిసియున్న యభిన్నశబ్దమును దానియర్థమును సిద్ధించుట మిక్కిలి యసంభవముగదా? కావున నిట్టిశంకలు హాస్యాస్పదములే యగుంగాని సారవంతములు గానేరవు.

**సూ:—వినాశకోపలబ్ధిఁబట్టియు ననిత్యత్వంబు సిద్ధంబు—33-34-35-36.**

లోకమున ననిత్యములగుఘటాదులకు దండఘాతాదులగువినాశకారణములు మన కగపడుచుండును శబ్దమనిత్యమే యగునెడఁ దద్వినాశకారణములుగూడ మనకుఁ దెలియవలయుఁ గదా? అట్టికారణము లెవ్వియు మన కుపలబ్ధములు గాకుండుటచే నది నశించుననుట కవకాశ మగపడదు కాఁగా శబ్దము నిత్యమే యనవలయు నని మఱికొందఱు తలంతురు. కాని వినాశకారణ మగపడకుండుటచే శబ్దము నశింపదనిగదా వీరి యాశయము. ఇట్లయినచో నిత్యమగుశబ్ద మెల్లపుడును వినఁబడకుండుటకుఁ గారణ మగపడకుండుటచే వినఁబడకపోవుటయు సంభవింపదుగాన శబ్దములన్నియు నవిచ్ఛిన్నముగ నెల్లపుడును వినఁబడుచునే యుండవలయును. కారణములేకున్నను వినఁబడకపోవచ్చునన్నచోఁ గారణములేకున్నను నశింపవచ్చుననిమాత్ర మేల యంగీకరింపరాదు? ఇదిగాక వినాశకారణ మగపడనంతమాత్రమున శబ్దము నిత్యమే యన్నచో శబ్దాభివ్యక్తికిని వినాశకారణ మగపడకుండుటచే నయ్యదియు నిత్యమే

యనవలసివచ్చును. అభివ్యక్తి నిత్యమని యాక్షేపకులుసయితమంగీకరింపరుగదా?

ఇది యిటులుండ దూరముగఁ బరిశీలించినచో శబ్దవినాశమునకుఁ గారణము తప్పక మనకు లభించును. భేరీదండసంయోగమువలన శబ్దధార లుదయించునని పూర్వము నిరూపింపఁబడినది. ఇట నుత్తరోత్తరశబ్దోత్పత్తికిఁ బూర్వపూర్వశబ్దము కారణమగుచుండును. ఇటులే పూర్వపూర్వశబ్దవినాశమునకు నుత్తరోత్తరశబ్దము కారణమగుచుండును తుట్టతుది శబ్దమునకు వినాశకముగఁ దదుత్తరశబ్దము లేకున్నను వస్త్వంతరప్రతిఘాతమువలన నయ్యది సయితము నశింపక తీఱదు. కావున నీరీతిని శబ్దము నశించుటకుఁ గారణము లుపలబ్ధములగుచుండుటచే శబ్దము వినాశశాలి యనియు నిత్యముగాదనియుఁ దేలుచున్నది.

మఱియు నొకగంటను గఱ్ఱతో వాయించుచుండునపుడు దానినుండి యుదయించుశబ్దములు మొదటఁ బెద్దవిగను క్రమముగాఁ జిన్నవిగను నవిచ్ఛిన్నముగ నెల్లరకు వినఁబడుచుండుట యనుభవసిద్ధము శబ్దము నిత్యమనియు ఘంటాదండసంయోగము శబ్దమున కుత్పాదకముగాక యభివ్యంజకమే యనియు ననువారిమతమున నిట నభివ్యంజకమగుఘంటాదండసంయోగ మేకరూపమే యగుటచేఁ బెద్దవిగనో చిన్నవిగనో యొకేవిధమున శబ్దములు వినఁబడవలయును గాని మొదటఁ బెద్దవిగను క్రమముగఁ జిన్నవిగను వినఁబడుట కుపపత్తి గానరాదు.

అనిత్యమనుమతమున నిట్టి యనుపపత్తిలేదు. ఘంటాదండసంయోగము వేగసహాకృతమై ప్రథమశబ్దమును బుట్టించును. ప్రథమశబ్దము పుట్టినతోడనే యావేగ మీప్రథమశబ్దమున సంక్రమించును. అట్టివేగముగల ప్రథమశబ్దమువలన ధారారూపముగ శబ్దము లుదయించును ఆశబ్దములందును నీవేగము సంక్రమించుచుండును క్రమక్రమముగ నీవేగము తగ్గుచుండుటచే నుత్తరోత్తరశబ్దములు చిన్నవగుచుండును. కావున శబ్దము మొదటఁ బెద్దదిగను గ్రమక్రమముగాఁ జిన్నదిగను వినఁబడుట యారీతి నుపపన్నమగుచున్నది.

**సూ:—పాణిసంశ్లేషంబువలనిశబ్దాభావంబున సంస్కారంబు సుగ్రహంబు—3౬**

వేగరూపమగుసంస్కారముచే మొదటిశబ్దము పెద్దదిగను నుత్తరోత్తరశబ్దములు చిన్నవిగను వినఁబడునని నిరూపింపఁబడెను. ఉపలబ్ధముగాకుండుటచే నిట్టిసంస్కారమే లేదని కొందఱందురు. కాని యొకగంటనుగాని యొకకంచుగిన్నెనుగాని కఱ్ఱతోఁ గొట్టినచో ధారారూపమున శబ్దము లుదయించును. పిమ్మట నాగంటనుగాని గిన్నెనుగాని చేతితోఁ గట్టిగఁ బట్టుకొనినయెడల మఱి శబ్దములు వినఁబడవు. పాణిసంస్పర్శము శబ్దోత్పత్తికి నిమిత్తమగు వేగరూపసంస్కారమును నిరోధించుటచే శబ్దములు పుట్టకుండుటవలన నయ్యవి వినఁబడుటలేదని గ్రహింపవలయును. లోకమున వేగముగలబాణములు మున్నగువాని కేదయినఁ బ్రతిబంధక మేర్పడినచో వాని

వేగము నిరుద్ధమయి గమన మాఁగిపోవుట యనుభవసిద్ధము గదా? కాఁగా నీరీతిని బాణిస్పర్శముచే శబ్దము వినఁబడకుండు టంబట్టి తదుత్పత్తినిమిత్త మగు వేగరూపసంస్కారము నిరుద్ధ మగుట స్పష్టమగుచుండ నట్టి సంస్కారమే లేదనుటకు వలను పడదు.

పాణిసంశ్లేషమువలన శబ్దోత్పత్తినిమిత్త మగు వేగ రూపసంస్కారము నిరుద్ధమగుననియు దానిచే శబ్దము విచ్ఛిన్న మగుననియుఁ బయిని నిరూపింపఁబడియె. ఇటులయినచో నొక దాని నాశ్రయించియుండు వానికే (సమానాధికరణములకే) కార్యకారణభావముగాని నాశ్యనాశకభావముగాని సంభవిం చునుగాని వేఱువేఱుతావుల నుండు వానికి (వ్యధికరణములకు) సంభవింపదుగాన బాణిసంశ్లేషమును సంస్కారమును శబ్ద మును బ్రకృతమున గంటయందే యుండవలయునుగదా ? కాఁగా శబ్దము రూపాదిగుణములతోఁగలసి పృథివ్యాదులం దుండి యభివ్యక్తమగు ననుసాంఖ్యసిద్ధాంత మే బలపడుచున్న దనియు శబ్ద మాకాశమాత్రనిష్ఠమే యనునైయాయికసిద్ధాం తము భగ్నమగుచున్న దనియు సాంఖ్యు లాక్షేపింతురు. కాని,

సూ:—అస్పర్శత్వాంబునఁ బ్రతిషేధం బనుపప న్నంబు—౩౮-౩౯.

శ్రోత్రేంద్రియము తనకు సమీపించినశబ్దమునే గ్రహిం చునుగాని దూరస్థమగు దానిని గ్రహింపనేరదు గావున శబ్దము ఘంటాస్థమే యగుచో మన కది వినఁబడుటకే యవకాశము

లేదు. కావున ఘంటాదండసంయోగమువలన ఘంటాప్రదేశస్థమగు నాకాశమున నొకటిశబ్ద ముదయించుననియు దానింబట్టి క్రమముగా నాకాశమున శబ్దధార లేర్పడుననియు నందు శ్రోత్రమునకు సంబంధించినశబ్దమే వినఁబడుచుండుననియు నంగీకరింపవలయును. కాఁగా ఘంటాప్రదేశస్థమగు నాకాశమున శబ్ద ముదయించునపుడు ఘంటాదండసంయోగ మెటులు కారణమగుచుండునో యటులే ఘంటాప్రదేశస్థమగు నాకాశమున శబ్దవిచ్ఛేదమునకు ఘంటాపాణిసంశ్లేషము నిమిత్తమగుచుండును. కావున ఘంటాదండసంయోగమును ఘంటాపాణిసంశ్లేషమును ఘంటయందునలె ఘంటాప్రదేశస్థమగు నాకాశమునందును పరంపరాసంబంధమున నుండుటచే శబ్ద మాకాశమాత్రనిష్ఠ మనుసిద్ధాంతమునకు భంగము వాటిల్లదు.

మఱియు సాంఖ్యులు నిరూపించినట్లు శబ్దము రూపాదులతోఁగలసి పృథివ్యాదులందుండుటయు నభివ్యక్తమగుటయుఁ బొసంగనేరదు వీణాదులందు రూపగంధస్పర్శాదు లేక రూపముగనే యెల్లపుడును గ్రహింపఁబడుచుండును. శబ్దమన్ననో యట్లుగాక వివిధముగ వినఁబడుచుండును. మఱియు సజాతీయమగుశబ్దమునయినను నొకప్పుడు పెద్దదిగను మఱియొకప్పుడు చిన్నదిగను వినఁబడుటయు సంభవించును. ఇట్టిభేదమభివ్యక్తిపక్షమున దుర్ఘటమగుటచే నుత్పత్తిపక్షమే సర్వథా సమంజసమని గ్రహింపవలయును.

శబ్దానిత్యత్వప్రకరణము సమాప్తము.

---

**సూ:—వికారాదేశోపదేశంబున సంశయోదయంబు సిద్ధంబు—౪౦-౫౯.**

లోకమున శబ్దము ధ్వన్యాత్మకమనియు వర్ణాత్మకమనియు ద్వివిధముగ నుండును. ఇందు వర్ణములు భాషలో నొకదానికి మాఱుగ వేఱొకటి వినఁబడుచుండుట గలదు. ఇట్టియెడ నొక వర్ణము వేఱొకటిగ మాఱునని కొందఱును నొకవర్ణమును బ్రయోగింపవలసినప్పుడు దానిస్థానమున వేఱొకటి ప్రయోగింపఁబడునని కొందఱును నిరూపింతురు. ఇందు మొదటిది వికారవాదమనియు రెండవది యాదేశవాదమనియు వ్యవహరింపఁబడును. కాఁగా (దధ్యత్ర) (దధి+అత్ర) అనునెడ దధి యనుదాని 'ఇ' కారమే క్రమముగా యకారముగ మాఱినదా? లేక యిచ్చో 'ఇ' కారమును బ్రయోగించుటకు బదులుగ 'య' కారము ప్రయుక్తమగుచున్నదా? అనుసంశయము గలుగుచుండును. పరిశీలింపఁగా నీరెండిటిలో నాదేశవాదమే సమంజసమని తోఁచెడిని వికారవాదమునఁ గొన్ని యనుపపత్తులు గాననగును.

(1) ప్రకృతియగు 'ఇ' కారమునందలి ఇత్వ, హ్రస్వత్వాదిధర్మము లెవ్వియు యకారమున ననువర్తింపకుండుటచే 'ఇ' కారమే యకారముగ మాఱినదనుట కుపపత్తి గానరాదు.

(2) 'ఇ' కారము వివృతప్రయత్నముగలది. ఒకప్రయత్నముగలవర్ణము వేఱొకప్రయత్నముగలవర్ణముగ మాఱినదనుట సయుక్తికముగాదు.

(3) వికారవాదులమతమున 'ఇష్ట్వా' = (యజ్ + త్వా) యనుదానిలోని 'ఇ' కారము వికృతమనియు 'ఇదమ్' అనుదానిలోని 'ఇ' కారము ప్రకృతిసిద్ధమనియుఁ జెప్పవలయును. ఇటులే 'దధ్యత్ర' అనుచో యకారము వికృతమనియు 'యతతే' అనుచో యకారము ప్రకృతిసిద్ధమనియు ననవలసియుండును. ఇట 'ఇష్ట్వా' 'ఇదమ్' అనువానిలోని 'ఇ' కారముల యుచ్చారణప్రయత్నములకును, 'దధ్యత్ర' 'యతతే' అనువానిలోని 'య' కారముల యుచ్చారణప్రయత్నములకును నించుకయిన భేదము గానరాదు. పయివానిలో నొకటి వికృతమును వేఱొకటి స్వాభావికమును నగుచో వీనియుచ్చారణప్రయత్నములకు భేద ముండితీఱవలయుఁగదా?

(4) 'ఇ' కారమే ప్రయోగింపఁబడుచుండి 'య' కారముగ మాఱినటులు మనచే గ్రహింపఁబడుట లేదు.

(5) శబ్దశాస్త్రమున 'అస' ధాతువునకు 'భూ' అనియు 'బ్రూఞ్' ధాతువునకు 'వచ్' అనియు నీరీతిని గొన్ని వర్ణసముదాయములకుఁ గొన్ని వర్ణసముదాయము లాదేశరూపముగ నిరూపింపఁబడియున్నవి. ఇట్టియెడ 'అస్' అనునది 'భూ' అనునదిగను 'బ్రూ' అనునది 'వచ్' అనునదిగను మాఱినటులు వికారవాదులుసయితమంగీకరింపఁజాలరుగదా? కావున నాదేశవాదమే సయుక్తికమని తేలుచున్నది.

లోకమున దీర్ఘమగుసువర్ణశలాకవలన వర్తులమగుకుండలాదికమును చిన్నవగుదూదిపింజెలవలనఁ బొడవగుదారము

లును నేర్పడు చుండుట సుప్రసిద్ధము. ఈరీతిని బ్రకృతిగతము లగు దీర్ఘత్వాల్పత్వాదులు వికృతులం దగపడకుండుటయుఁ గలదు. కాఁగాఁ బ్రకృతమున 'ఇ' కారమందలి 'ఇత్వహ్రస్వత్వములు' యకారమం దగపడనంతమాత్రమున వానిప్రకృతి వికృతిభావమునకు భంగ మెటులు వాటిల్లునని శంకింపఁజనదు.

ఇట వికారవాదులు హేతుశూన్యమగు దృష్టాంతమును మాత్రము చూపియుండిరి. ఇట్టి దృష్టాంతములను బరిగ్రహింప రాదు ఏలయన, ఎద్దులు లాగు చుండుబండి కొకప్పు డావృషభములను విడిచి వానిస్థానమున మహిషములను గట్టుదురు అంత మాత్రమున మహిషము వృషభవికారము గానేరదుగదా ? ఈదృష్టాంతమునుబట్టి 'ఇ' కారమునకు 'య' కార మాదేశముగనే వచ్చినదనవచ్చునుగదా? కావున హేతుశూన్యమగు దృష్టాంత మెన్నఁడును సాధ్యసాధకము గానేరదు.

మఱియు వికారవాదులు చూపినదృష్టాంత మిట సరిపడియు నుండలేదు సువర్ణశలాకయందలి దీర్ఘత్వము వర్తులకుండలములం దనువర్తింపకున్నను బ్రకృతిగతసువర్ణత్వము కుండలములం దనువర్తించుచునే యున్నది. ప్రకృతమున 'య' కారమునందుఁ బ్రకృతిగతమగు హ్రస్వత్వమువలె 'ఇత్వము' సయితమనువర్తింపలేదుగదా ? ఇట 'ఇ' త్వ మనువర్తింపకున్నను 'వర్ణ'త్వ మనువర్తించుచుండుటచేఁ బయిదృష్టాంతమునుబట్టి వికారవాద ముపపన్నము గారాదా యనియు శంకింపఁజనదు.

సువర్ణత్వాశ్రయమగుసువర్ణమునకుఁ బూర్వాకృతిమాఱి నవీనాకృతి యేర్పడినపు డానవీనాకృతిని వికారమని వ్యవహరింతుము. ప్రకృతమున వర్ణత్వ మనువర్తించినను వర్ణత్వాశ్రయమగుశబ్దమునకు వేఱొకరీతిని మాఱఁదగినయాకృతి యేదియు లేకుండుటచే వికారవాద మెటు లుపపన్నమగును? మఱియుఁ బ్రకృతివికృతిభావముగలతావులందెల్ల "సువర్ణం కుణ్డలమ్" మున్నగురీతి నభేదవ్యవహార మగపడుచున్నది. ఇటులే వికారవాదులమతమున "ఇకారోయకారః" మున్నగు రీతి నభేదవ్యవహారము నంగీకరింపవలసివచ్చును.

మఱియు క్షీరమునుండి దధి యేర్పడును. దధి క్షీరముగ నెన్నఁడును మాఱదు. అనఁగా వికృతి యెన్నఁడును బ్రకృతిగా మాఱదని తేలుచున్నది. వికారవాదమున "ధ్యై=(చిన్తాయామ్") అను ధాతువునుండి నిష్పన్నమగు 'ధీ' శబ్దమున 'ఇ' కారము 'య' కారమునకు వికృతి యనవలయుఁగదా? వికృతి యగు నీ 'ఇ' కారము 'ధ్యాప్తిః=(ధీ+ఆప్తిః)' అనుచో మరల యకారముగ మాఱినదనియు నంగీకరింపవలయుఁగదా? కాఁగా వీరిమతమున వికృతి మరలఁ బ్రకృతిగమాఱినట్లు తేలుచున్నది. ఇయ్యది పయినిజూపినరీతి ననుభవవిరుద్ధము.

సువర్ణము కుండలముగను గుండలము తిరిగి సువర్ణముగను మాఱుచుండుటయు లోకసిద్ధమే గావున వికృతి ప్రకృతిగ మాఱుట యసంగత మెట్లగుననియుఁ బ్రశ్నింపరాదు. పరిశీలింపఁగా లోకమునఁ గొన్ని వికృతులు ప్రకృతులుగ మాఱు

టయుఁ గొన్ని మాఱకుండుటయుఁ గలదు. ప్రకృతమున నీ రెండుదృష్టాంతములును హేతుశూన్యములే యగుటచే నర్థసాధకములు గాక సంశయకారణము లగుచుండును.

మఱియు సుదూరము పరికింప సువర్ణోదాహరణ మిట సముచితముగాదని తోఁచెడిని ఏలయన, కటకరూపమునను్న సువర్ణము కటకాకృతినివిడిచి కుండలాకారము నొందును. కాఁగాఁ గటకాకృతిని వీడుటయుఁ గుండలాకారము నొందుటయు సువర్ణమునకు ధర్మము లగుచున్నవి. ప్రకృతమున 'ఇ' కారాకృతిని విడిచి 'య' కారాకృతిని బొందినవర్ణ మొకటి ప్రత్యేకముగఁ గానరాదు. వర్ణత్వము సువర్ణత్వమువలె ధర్మమాత్రమే గావున దానియం దీధర్మము లుండుననుట పొసంగదుగదా?

మఱియు వర్ణములు నిత్యములనుపక్షమున 'ఇ' కార 'య' కారములు రెండును నిత్యములే యగుటచే నవి రెండును స్వస్వరూపములతో నెల్లప్పుడును నటులే యుండుననవలయును గాని వానికిఁ బ్రకృతివికృతిభావకల్పనము సంగతముగాదు. అనిత్యములనుపక్షమున 'ఇ' కారము 'య' కారముగ మాఱునంతవఱకు నుండక పుట్టినవెంటనే నశించునుగావున నవి 'య' కారమునకుఁ బ్రకృతి యగుననుటకును నవకాశము గానరాదు.

నిత్యములలోఁ బరమాణ్వాదు లతీంద్రియములయినను నాత్మాదులు ప్రత్యక్షములే యగుచుండును. కావున నిత్యవస్తువులెల్ల నొక్కరీతిగనే యుండవలయు ననునిర్బంధ మగ

పడదు. ఇటులే గగనాదులగు కొన్నినిత్యవస్తువులు మాఱి యున్నను వర్ణములు మాఱుచుండుట సంభవింపరాదా యనియు శంకింపఁదగదు. నిత్యవస్తువులపరిమాణమునందును ప్రత్యక్షాదులందును భేదముండిన నుండవచ్చునుగాని స్వభావమున భేదముండుట యసంభవము. అనఁగా నిత్యవస్తువులు మార్పుల నొందుట ప్రపంచమున లేదని భావము.

వర్ణము లనిత్యములయినను శ్రోత్రసంబద్ధములై వినఁబడుచున్నటులే మార్పులనుమాత్రమే మేల చెందరాదనియుఁ బ్రశ్నింపదగదు. ఈపక్షమున వర్ణము వినఁబడుచుండుటచే దానికి శ్రోత్రసంబంధముగలదనిమాత్రమే సిద్ధించునుగాని యయ్యది మార్పులనొందవచ్చునని సిద్ధించుట యెట్లు? వినఁబడుచున్నదిగాన వికృతి యనరాదా యనుశంక పృథివికి గంధముగలదుగాన బుద్ధియుఁ గలదనరాదా యనునటు లసంబద్ధమయి పరిహాసాస్పదమగును.

ఇదిగాక తొలుత 'దధి-అత్ర' యని విడివిడిగా నుచ్చరించి చాలకాల మూరకుండి 'దధ్యత్ర' యని యుచ్చరింపనగును. ఇట 'దధి-అత్ర' అనుదానిలోని 'ఇ' కారము నశించుటచే నది 'దధ్యత్ర' యనుదానిలోని 'య' కారమునకుఁ బ్రకృతి యగుట యెట్లు?

మఱియు 'ధ్యై' అనుదానిలోని 'య' కారమునకు 'ధీ' యనుదానిలోని 'ఈ' కారము వికృతిగదా? 'ధ్యాప్తిః' యను

దానిలోని 'య' కారము 'ధీ' యనుదానిలోని 'ఈ' కారము నకు వికృతి యనవలయుఁగదా! కాఁగా 'ఈ' కార 'య' కార ములలోఁ బ్రకృతి యెద్దియో వికృతి యెద్దియో నియమముగ నిర్ణయించుట కవకాశము లేదు. ఈరీతి నిట ననియమము ప్రసక్తమగుచున్నది. ఇట్టి యనియమము లోకమునఁ బ్రకృతి వికృతులం దెచ్చటను గానరాదు.

ఇట 'ఇ' కార 'య' కారముల ప్రకృతి వికృతిభావము విషయమున ననియమము నియమితమగుచుండుటచే ననియమ మును నియమమే (నియమ్యత ఇతి నియమః) యగుచున్నది. కాఁగా ననియమమనునది యెచటను నుండదని కొందఱు ఛలోక్తిగఁ బ్రసంగింతురు కాని నియమము భావరూపమును ననియమము తన్నిషేధరూపమును నగుచుండుటచే నీ రెండును బరస్పరభిన్నములే యగుచున్నవి. కాఁగా నిట ననియమము నియమింపఁబడినను ననియమమే యగునుగాని నియమము గానేరదు. నియమితమగుటచే నియమమనుసంజ్ఞాంతరమును గల్పించినను దత్స్వరూపము మాఱదు. కావున నిట్టి ఛలోక్తు లిటఁ జెల్లనేరవు. కాఁగాఁ బయిరీతి నెంతపరిశీలించినను 'ఇ' కారము 'య' కారముగ మాఱెననుటకుపపత్తి గానరా కుండుటచే నిట్టి వర్ణవికారవాదము పరిగ్రాహ్యముగాదు. అయి నను లోకమున వర్ణవికారమనునది లేకపోలేదు. అది యెట్టి దన,

ఒకచో నుదాత్తమగువర్ణ మనుదాత్తముగ మాఱు చుండును. ఇట్టియెడ ధర్మి యగువర్ణము మాఱకుండఁగనే తద్గతమగుధర్మముమాత్రము మాఱుచున్నది. ఇటులే హ్రస్వదీర్ఘ ప్లుతములు కొన్నియెడలఁ బరస్పరము మాఱుచుండుటయు గలదు. 'అస'ధాతు నిష్పన్నమగు 'స్తః' 'సన్తి' యనురూపము లలో 'అ'కారము లోపించును. 'భగవన్నత్ర=(భగవన్+అత్ర)' అనునెడ 'న' కారమునకు మఱియొక నకార మాగమముగ వచ్చుచుండును. ఈరీతిని గుణాంతరాపత్తియు హ్రాసవృద్ధులును లోపాగమాదులును భాషలో ననేకములు గానవచ్చుచుండును. వీనింబట్టి వర్ణవికారము లున్నవని వ్యవహరించినను వ్యవహరింప వచ్చును.

శబ్దపరిణామవాదప్రకరణము

సమాప్తము.

---

**సూ:—విభక్త్యంతంబు పదంబునాఁబడు—౬౦-౬౧.**

సుప్పులు తిఙ్లులు నని విభక్తులు రెండువిధములుగ నుండును. వీనిలో నేదయిన నొకవిభక్తి యంతమునఁ గల వర్ణముగాని వర్ణసముదాయము గానిపదమని వ్యవహరింపఁ బడును. 'గౌః, గచ్ఛతి' మున్నగునవి యుదాహరణములు. 'ప్ర' మున్నగు నుపసర్గములకును 'చ' మున్నగు నిపాతము లకును బదసంజ్ఞార్థము సుప్రత్యయములును దల్లోపమును

శాస్త్రమున విధింపఁబడుటచే నయ్యవియుఁ బదములే యని గ్రహింపవలయును. ఇట్టిపదము లర్థబోధకము లగుచుండును.

గోత్వజాతియు గోవ్యక్తియుఁ దదాకృతియు నొకదాని నొకటి విడువక సంబద్ధములై యుండును. ఈమూఁడిటిని బోధింపవలసినపుడు గోశబ్దము ప్రయోగింపఁబడును కాఁగా 'గౌః' అనుదానికిఁ బయిమూఁడింటిసముదాయ మర్థమా లేక వీనిలో నొక్కొకటి యర్థమా యని సంశయము గలుగును.

**సూ:—అనవస్థానంబునంజేసి వ్యక్తిపక్షం బనుపపన్నంబు—౬౨-౬౩-౬౪.**

(1) 'ఈగోవు నిలుచున్నది. ఆగోవు నడచుచున్నది' అని లోకమున వ్యవహరింతురు. జాతియంతయు నేకమే గావున దానికి 'నిలుచుండుట, నడచుట' యనువిరుద్ధక్రియ లొకేకాలమున సంభవింపనేరవు. శబ్దమునకు వ్యక్తి యర్థమన్నచో వ్యక్తులు భిన్నములగుటచే నేకకాలమున విరుద్ధక్రియలతోఁ బ్రత్యేకముగ సంబాధ ముపపన్నమగును.

(2) మఱియు 'గోసమూహా' మనువాడుక గలదు. సమూహ మనఁగా ననేకములగువస్తువుల కూడికగదా! ఇదియు వ్యక్తిపక్షముననే సరిపడును.

(3) మఱియు 'గోవు నిచ్చిరి, గోవును బుచ్చుకొనిరి' మున్నగుచోట్ల దానప్రతిగ్రహములం బట్టియు,

(4) 'ఇది కౌండిన్యునిగోవు, అది మాండవ్యునిగోవు,' మున్నగునెడ సంబంధభేదవ్యవహారమును బట్టియు,

(5) 'పదిగోవులు, ఇరువదిగోవులు' మొదలగుసంఖ్యా వ్యవహారమునుబట్టియు,

(6) 'ఈగోవు బలిసినది, ఆగోవు కృశించినది' మొదలగు నెడ నుపచయాపచయంబులనుబట్టియు,

(7) 'ఈగోవు తెల్లనిది, ఆగోవు నల్లనిది' మొదలగువర్ణ భేదములనుబట్టియు,

(8) 'ఈగోవు సుఖించుచున్నది, ఆగోవు కష్టపడుచున్నది' మున్నగురీతిని సుఖదుఃఖాదిసంబంధమునుబట్టియు,

(9) 'ఈగోవు పుట్టినది' మొదలగు ననిత్యతావ్యవహారమునుబట్టియు శబ్దమునకు వ్యక్తియే యర్థ మనవలయునుగాని జాతి యర్థమనుట పొసంగనేరదు అని కొందఱు తలంతురు.

కాని 'కాశియందు గోవు గలదు' అనువాక్యమును వినినతోడనే యెన్నఁడును నాగోవును జూడకున్నను మనుజుఁడిందలిగోశబ్దమునకు నర్థమును గ్రహించును. ఈగోశబ్దమున కాగోవుతోడిసంబంధము శ్రోతచే గృహీతము గాకుండుటచే నీశబ్దమున కది యర్థమని యాతఁడు గ్రహించుట వ్యక్తివాదుల మతమున నుపపన్నముగాదు. జాతివాదులమతము నీయనుపపత్తి గానరాదు.

ఇంతకుమున్ను వ్యక్తివాదులు జాతిపక్షమునఁ జూపిన యాక్షేపణములన్నియు నౌపచారికవ్యవహారాంగీకారముచే నిరస్తములగును.

లోకమున నిమిత్తభేదముచే నిట్టియౌపచారికవ్యవహారము లనేకములు ప్రవర్తిల్లుచుండును.

(1) కుంతధారులగు రాజభటులు ప్రవేశించుటను జూచి 'కున్తాః ప్రవిశన్తి' అని ప్రయోగింతురు. ఇటఁ గుంతశబ్దము సాహచర్యమునుబట్టి కుంతధరులగుపురుషులను బోధించుచుండును.

(2) మంచస్థులగుపురుషులను బోధింపవలసినపుడు స్థానమునుబట్టి 'మఞ్చాః క్రోశన్తి' అని ప్రయోగింతురు.

(3) వస్త్రము నేయుటకుఁ దంతువులను సరిపుచ్చునపుడు తాదర్థ్యమునుబట్టి 'పటం వయతి' అని వ్యవహరింతురు.

(4) ప్రవర్తనమునుబట్టి 'యమో రాజా' మొదలగు వ్యవహారములు గలుగును.

(5) ఆఢకపరిమితములగు గోధుమలను మానమునుబట్టి 'ఆఢకగోధూమము' లని వ్యవహరింతురు.

(6) త్రాసులోఁ దూఁచినచందనమును ధారణమునుబట్టి 'తులాచందన' మని వాడుదురు.

(7) గంగయొడ్డున గోవులు సంచరించుటను జూచి సామీప్యమునుబట్టి 'గఙ్గాయాం గావః' అని వాడుదురు.

(8) కృష్ణవర్ణముతోఁగూడినవస్త్రమును సంబంధమునుబట్టి 'కృష్ణశాటి' అని వాడుదురు.

(9) అన్నము ప్రాణధారణసాధనమగుటచే 'అన్నం ప్రాణాః' అని వ్యవహరింతురు.

(10) ప్రాధాన్యమునుబట్టి 'అయం పురుషః కులమ్' మున్నగువాడుకలు ప్రవర్తిల్లును.

వ్యక్తివాదులు చూపినవ్యవహారములన్నియు నీరీతిని సాహచర్యాదులంబట్టి యౌపచారికములుగ గ్రహించినచోఁ బయియాక్షేపణము లుండవని జాతివాదులు సమర్థింతురు.

**సూ:—దానాద్యనుపపత్తింబట్టి యాకృతిపక్షంబును ననుపపన్నంబు—౬౫-౬౬.**

లోకమున నాకృతినిబట్టియే పదార్థముల గ్రహింతుము గావున నాకృతియే శబ్దమున కర్థమని కొందఱందురు. ఆకృతి యనఁగా నియతములగునవయవములకూడిక. 'గోవు నిమ్ము; గోవును దెమ్ము' మున్నగుచోట్ల దానాదిక్రియాసంబద్ధముగ గోత్వజాతిగలవస్తువు బోధింపఁబడుచున్నది. గోత్వజాతియుఁ గ్రియాసంబంధమును వ్యక్తియందుండునుగాని యాకృతియం దుండవు. కావున నాకృతి పదార్థమనుట పొసంగనేరదు.

**సూ:—స్వతంత్రాభివ్యక్త్యభావంబున జాతిపక్షంబును ననుపపన్నంబయగు—౬౭.**

మృణ్మయమగుగోవ్యక్తియందు నాకృతియున్నను గోత్వజాతిసంబంధము లేదు. ఇట్టిగోత్వమనుష్యత్వాదిజాతులు చేతనములందుమాత్రమే యుండును. కావుననే 'గోదానము

చేసిరి' యనునెడ మట్టితోఁ గల్పింపఁబడినకృత్రిమగోవు స్ఫురింప నేరదు. కాన దేనిసంబంధము లేకుండుటచే నిట్టియెడ మట్టి గోవుపస్థితముగాకుండునో యట్టిగోత్వజాతి పదార్థమని కొందఱందురు.

కాని లోకమున గోత్వమనుష్యత్వాదిజాతు లాకృతి. వ్యక్తులనుబట్టియే గ్రహింపఁబడుచుండునుగాని స్వతంత్రముగ గ్రహింపఁబడవుగాన వ్యక్త్యాకృతి సాపేక్షమై స్వతంత్రాభివ్యక్తి శూన్యమగుజాతిపదార్థమనుటయుఁ బొసంగదు.

ఇఁకఁ బదార్థమన నెట్టిదన;

**సూ:—వ్యక్త్యాకృతిజాతిసముదాయంబు పదార్థంబు—౬౫-౭౧.**

పూర్వము నిరూపించినరీతిని జాతిగాని యాకృతిగాని వ్యక్తిగాని ప్రత్యేకముగ శబ్దమున కర్థమనుట పొసంగకున్నను నీమూఁడిటిసముదాయము పదార్థమనునెడ నెట్టిదోషమును సంభవింపదు.

(1) 'గోవు నడచుచున్నది' మున్నగుచోటులందు గమనక్రియ గోవ్యక్తియం దుపపన్నమగుటచే నిట వ్యక్తి ప్రధానముగ భాసిల్లుచుండును.

(2) చిత్రలిఖితమగుగోవును జూచి 'యీగోవు సుందరముగనున్న' దని యందుము. ఇట్టియెడ నాకృతి ప్రధానముగ భాసిల్లును.

(3) 'గోవు నిత్యము' మున్నగుస్థలములందు నిత్యత్వము గోత్వజాతియందుపపన్నమగుటచే నిట గోత్వజాతి ప్రధానముగ భాసిల్లుచుండును.

(1) పరస్పరసంబద్ధావయవములుగలిగి రూపరసాదిగుణముల కాశ్రయమై చక్షురాదీంద్రియగ్రాహ్యమగునది వ్యక్తి యనఁబడును.

(2) దేనినిబట్టి గోత్వమనుష్యత్వాదిజాతులను మనము గ్రహింతుమో యట్టి యవయవసన్నివేశమే యాకృతి యనఁబడును.

(3) అనేకములగువ్యక్తులం దనుగతముగ గోవులనిగాని మనుష్యులనిగాని యేకరూపమగుబుద్ధిని గలిగించుచు నితరవ్యక్తిభేదమును బోధించునది జాతి యని వ్యవహరింపఁబడును.

ఇట్లు పరస్పరభిన్నములగు వ్యక్త్యాకృతిజాతులసముదాయమే ప్రధానోపసర్జనభావంబున శబ్దమున కర్థమగుచుండునని గ్రహింపవలయును.

ద్వితీయాధ్యాయమున
ద్వితీయాహ్నికము సమాప్తము.

---

చెన్నపురి: వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్‌వారి
'వావిళ్ల' ప్రెస్సున ముద్రితము.—1932